



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సోమవారం | 5 ఆగస్టు 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 245

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi





అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - శిశిర ఋతువు, ఆషాఢమాసం శుద్ధ పాడ్యమి రా.3.48, పునర్వసు తె.4.57, వర్జ్యం సా.4.40 నుంచి 6.18 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.7.22 వరకు

## చైనా కుయుక్తులు.. భారత్‌కు ప్రమాద ఘంటికలు



● బ్రహ్మపుత్రపై భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు ● మరోసారి నిర్మించేందుకు పావులు కదుపుతున్న చైనా

పొరుగు దేశం చైనా అవకాశం దొరికినప్పుడల్లా విషం చిమ్ముతూనే ఉంది. వ్యూహాత్మక ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తూర్పు లద్దాఖ్లోని గల్వాన్ ఘటన తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇదే సమయంలో సమస్యాత్మక సరిహద్దు ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేయడం, అరుణాచల్ ప్రదేశ్ను తమ భూభాగంలో చూపించడం లాంటి విపరీత చర్యలకు డ్రాగన్ పాల్పడింది.

6లో

## ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా



● వేల ఎకరాలను సేకరించి దోచుకునే కుట్ర ●ధరణిపై భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయండి ● ధరణిపై వేసిన కమిటీ ఏం తేల్చింది? ● కేసీఆర్ కుటుంబ భూదోపిడీపై చర్యలేవి? ● బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు ● కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్



# వణుకుతున్న ఉత్తరాది

మధ్యప్రదేశ్‌లో భీకర వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల గోపాద, నర్మదా నదుల ఉగ్రరూపంగా దాల్చి.. ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. నర్మదా నది ప్రవాహంలో ఘాట్‌లు, మందిరాలు నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. వరద ముప్పుతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది ప్రభుత్వం. మరోవైపు భోపాల్‌లో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ముంచెత్తింది.

● ఎడతెరిపిలేని వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు

● వరదల తో జనజీవనం అస్తవ్యస్తమైంది

6లో

### గురు ప్రసన్న బాధ్యతను తీసుకోవడం

# సీఎం గొప్ప మనస్సు

● సీఎం చంద్రబాబు గొప్ప మనస్సుకు నిదర్శనం ● నంద్యాల జిల్లాలో విషాద ఘటన

● మట్టి మిద్దె కూలి నలుగురి దుర్మరణం ● అనాథగా మారిన గురు ప్రసన్న అనే బాలిక

● రూ.10 లక్షల సాయం ప్రకటించిన చంద్రబాబు ● బాలిక సంరక్షణ బాధ్యతను తీసుకున్న వైనం ● మంత్రి నారా లోకేశ్

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృాఎతి చెందడం తెలిసిందే. ఈ ఘటనలో తల్లిదండ్రులను, తోబుట్టువులను కోల్పోయిన గురు ప్రసన్న (15) అనే బాలిక అనాథగా మారింది. అయితే, తాన ున్నానంటూ సీఎం చంద్రబాబు ఆ బాలికకు ఆపన్న హస్తం అందించారు. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.



వివరాలు-2లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### జనం ఛీ కొట్టినా చీటింగ్

# బుద్ధి మార్చుకోరా

### మాజీ సీఎం జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్



2లో

జనం ఛీ కొట్టినా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం తన ఛీటింగ్ బుద్ధి మార్చుకోలేదంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాజీ సీఎంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఏదో జరిగిపోతున్నట్లు ప్రతిరోజూ సోషల్ మీడియాలో వైసీపీ శ్రేణులు, నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లలో ఏపీని అరాచక ఆంధ్రప్రదేశ్ గా మార్చి రాష్ట్రంలో రక్తపుటేరులు పారించింది మీరు కాదా జగన్ రెడ్డి? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

### ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మృతి



6లో

● టెల్అవీవ్ శివార్లలో కత్తిపోట్ల కలకలం!

● గాజాపై మరోసారి విరుచుకుపడిన ఇజ్రాయెల్

హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యలతో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉండటంతో.. పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఈ పరిణామాల నడుమ గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది.

## రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా లక్ష్యం

● భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదు ● యాదవ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం ● సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి

రాష్ట్ర అభివృాఎద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, గత ప్రభుత్వంలో భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని గృాఎహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థ సారథి స్పష్టం చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం అలిపిరి చేరుకున్న మంత్రి పార్థ సారథి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వారికి అందరికీ తక్కువ ధరలో ఇల్లు అందచేయాలని సంకల్పించి చర్యలు చేపడుతున్నామన్నారు.



2లో

అంతా ఇంతే!




ట్రంప్ ప్రచారానికి రమ్మని అడిగారా ?

# నిండుకుండలా సాగర్

● గత వారం రోజులుగా శ్రీశైలం జలాశయానికి భారీ వరదలు ● 10 గేట్లను ఎత్తి 5 లక్షల క్యూసెక్కుల నీటిని సాగర్కు విడుదల ● నేడు, రేపు సాగర్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్న అధికారులు



7లో

గత వారం రోజులుగా శ్రీశైలం జలాశయానికి భారీ వరదలు వస్తుండటంతో 10 గేట్లను ఎత్తి 5 లక్షల క్యూసెక్కుల నీటిని సాగర్కు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం పూర్తి స్థాయికి చేరుకోనుంది. రేపు సాయంత్రానికి సాగర్ నిండుతుందని అధికారులు చెబుతున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 573 అడుగులకు చేరుకుంది. అలాగే సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 264 టీఎంసీలు దాటింది.

### మార్చి నాటికి

# బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

● గుంటూరు జిల్లాలో పర్యటించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని ● తాడికొండలో బేస్ బ్యాండ్ యూనిట్ ప్రారంభం ● 4,500 టవర్ల ద్వారా నాణ్యమైన 4జీ సేవలు అందిస్తామని వెల్లడి



వివరాలు-6లో

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం గుంటూరు జిల్లాలో పర్యటించారు. తాడికొండలో ఏర్పాటు చేసిన దేశీయ బేస్ బ్యాండ్ యూనిట్ ను స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.





# టెన్నిస్ విశ్వవిజేతగా జకోవిచ్

## ఫైనల్లో యువరాజు అల్కరాజ్‌పై నెగ్గిన టెన్నిస్ రారాజు

పారిస్: విశ్వ క్రీడల్లో సెర్బియా స్టార్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ అద్భుతం చేశాడు. పారిస్ ఒలింపిక్స్ 2024 టెన్నిస్ పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచాడు జకోవిచ్. ఆదివారం రాత్రి జరిగిన ఉత్కంఠపోరులో అల్కరాజ్ పై విజయం సాధించాడు. వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకర్ జకోవిచ్, వరల్డ్ నెంబర్ 2 అల్కరాజ్ పై 7-6 (7-3), 7-6 (7-2) తేడాతో ఫైనల్లో గెలుపొంది ఒలింపిక్స్ విజేతగా నిలిచాడు. జకోవిచ్ కు స్వర్ణం దక్కగా, రన్నరప్ గా నిలిచిన స్పెయిన్ ఆటగాడు అల్కరాజ్ రజతంతో సరిపెట్టుకున్నాడు. ఒలింపిక్స్ స్వర్ణం నెగ్గడంతో జకోవిచ్ కెరీర్ గోల్డెన్ స్లామ్ పూర్తి చేసుకున్న అత్యంత అరుదైన ఆటగాడిగా నిలిచాడు.

### ర్యాపిడ్ ఫైర్ పిస్టల్.. క్వాలిఫికేషన్

# రౌండ్‌లో నిరాశపర్చిన భారత షుటర్లు

పారిస్... పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ పురుషుల 25మీ .ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ క్వాలిఫికేషన్‌లో భారత షూటర్లు విజయ్‌వీర్, అనీశ్ భన్వాలా నిరాశపర్చారు. స్టేజ్ 1లో మెరుగైన ప్రదర్శన చేసినా చివరిదైన స్టేజ్ 2లో ఆశించిన మేరకు రాణించలేదు. స్టేజ్ 1లో విజయ్‌వీర్ 8 సెకన్ల షూట్‌లో 98, 6 సెకన్ల షూట్‌లో 98, 4 సెకన్ల షూట్‌లో 97 పాయింట్లు సాధించాడు. ఇక, అనీశ్ కూడా విజయ్‌వీర్ సాధించిన స్కోరే సాధించాడు. కానీ, స్వల్ప తేడాతో విజయ్‌వీర్ (293.14) ఐదో స్థానం, అనీశ్ (293.11) ఏడో స్థానంలో నిలిచారు. దీంతో రెండో స్టేజ్‌లోనూ మన షూటర్లు మంచి ప్రదర్శన చేసి టాప్-6లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధిస్తారని భారత అభిమానులు భావించారు.



# గురు ప్రసన్న బాధ్యతను తీసుకోవడం సీఎం గొప్ప మనస్సు

● సీఎం చంద్రబాబు గొప్ప మనస్సుకు నిదర్శనం ● నంద్యాల జిల్లాలో విషాద ఘటన ● మట్టి మిద్దె కూలి నలుగురి దుర్మరణం ● అనాథగా మారిన గురు ప్రసన్న అనే బాలిక ● రూ.10 లక్షల సాయం ప్రకటించిన చంద్రబాబు ● బాలిక సంరక్షణ బాధ్యతను తీసుకున్న వైనం ● మంత్రి నారా లోకేశ్



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తెలిసిందే. ఈ ఘటనలో తల్లిదండ్రులను, తోబుట్టువులను కోల్పోయిన గురు ప్రసన్న (15) అనే బాలిక అనాథగా మారింది. అయితే, తాన ఎన్నానంటూ సీఎం చంద్రబాబు ఆ బాలికకు ఆపన్న హస్తం అందించారు. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. మట్టి మిద్దె కూలిన ఘటనలో అయిన వాళ్లు సజీవ సమాధి కాగా, అనాథగా మారిన బాలిక గురు ప్రసన్న సంరక్షణను స్వీకరించడం ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప మనసుకు నిదర్శనం అని కొనియాడారు. విధి ఆ బాలికను అనాథను చేస్తే, చంద్రబాబు అక్కున చేర్చుకున్నారని వివరించారు. సీఎం చంద్రబాబు ఆ బాలిక పేరు మీద రూ.10 లక్షలు డిపాజిట్ చేసి, ఆ బాలిక నాయనమ్మ నాగమ్మకు రూ.2 లక్షలు సాయం ప్రకటించారని, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని నారా లోకేశ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

# మార్చి నాటికి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు





● గుంటూరు జిల్లాలో పర్యటించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని ● తాడికొండలో బేస్ బ్యాండ్ యూనిట్ ప్రారంభం ● 4,500 టవర్ల ద్వారా నాణ్యమైన 4జీ సేవలు అందిస్తామని వెల్లడి

గుంటూరు : కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం గుంటూరు జిల్లాలో పర్యటించారు. తాడికొండలో ఏర్పాటు చేసిన దేశీయ బేస్ బ్యాండ్ యూనిట్ ను స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. 4,500 టవర్ల ద్వారా నాణ్యమైన 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. అతి తక్కువ ధరలకే 4జీ సేవలు అందించేందుకు కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని పెమ్మసాని పేర్కొన్నారు.

ప్రైవేటు టెలికామ్ సంస్థలు ధరలు పెంచడం వల్ల అందరూ బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా లక్ష్యం

● భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదు ● యాదవ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం ● సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి





ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, గత ప్రభుత్వంలో భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థ సారథి స్పష్టం చేశారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం అలిపిరి చేరుకున్న మంత్రి పార్థ సారథి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వారికి అందరికీ తక్కువ ధరలో ఇల్లు అందచేయాలని సంకల్పించి చర్యలు చేపడుతున్నామన్నారు. , పురోగతిలో ఉన్న, పెండింగ్ లో ఉన్న టిడ్కో, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్లను సంవత్సరంలో లబ్ధిదారులకు పూర్తి చేసి అందించేలా లక్ష్యాలు నిర్దేశించుకున్నామని వెల్లడించారు. మంత్రి పార్థ సారథి కి యాదవ సంఘం నేతలు పెద్ద ఎత్తున సన్మానం చేసి బస్ స్టాండ్ సమీపంలోని యాదవ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. యాదవ భవన్ కు చేరుకున్న మంత్రికి టీడీపీ నేతలు , యాదవ సంఘం నేతలు ఆత్మీయ స్వాగతం పలికి సన్మానించారు. పురోగతిలో ఉన్న యాదవ భవన్ ను మంత్రి పరిశీలించి వాసుదేవ యాదవ సంఘం యాదవ భవన్ ఏర్పాటు చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని, సాటి యాదవుడిగా తన వంతుగా రూ. 5 లక్షలు విరాళం గా అందజేస్తానని ప్రకటించారు. టిడ్కో గృహాలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.. . టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి లబ్ధిదారులకు పలు ఇబ్బందులు గురి చేసిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 20 సం.లు వెనక్కి వెళ్లిందన్నారు. ఇప్పుడు మళ్లీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. గత పాలనలో భూ కబ్జాలు, అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని, వారి బాధితులకు తప్పక న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వ నాయకత్వంలో చూస్తామని తెలిపారు. వైసీపీ ముఖ్యనేతల అరెస్ట్ లతో ప్రభుత్వానికి సంబంధం లేదని, ప్రభుత్వం ఎక్కడా కక్షపూరితంగా వ్యవహరించడం లేదని తెలిపారు. గతంలో చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గృహ నిర్మాణం కోసం రెండున్నర లక్షలు ఒక యూనిట్ కాస్ట్ గా ఉండేదని, అంతేకాకుండా ఎస్సీ ఎస్టీలకు 50 ల వరకు అదనంగా ఇచ్చిన సందర్భాలను మంత్రి గుర్తు చేశారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చాక దానిని రూ. 1.80 లక్షలకు తగ్గించేశారని, ఎస్సీ, ఎస్టీ లకు ఎలాంటి అదనపు మొత్తం గృహనిర్మాణానికి ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. పైగా టిడ్కో ఇళ్లపై బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను దారి మళ్లించి, టిడ్కో లబ్ధిదారులను మానసిక క్షోభకు గురిచేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం యాదవ సామాజిక వర్గానికి నిజమైన అవకాశం కల్పిస్తూ రెండు మంత్రి పదవులతో అనేక మందికి అవకాశాలు ఇచ్చారని యాదవ సామాజిక వర్గం తరపున హర్షం వ్యక్తం చేశారు. ఏ ప్రాంతీయ పార్టీకి లో చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ అధ్యక్షుడిగా యాదవుడికి అవకాశం కల్పించారు.

మంత్రిని తిరుపతి శ పద్మావతి అతిథి గృహం లో స్థానిక తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్, పలువురు తెలుగు దేశం నాయకులు, తెలుగు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీ పతి నాయుడు, మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణ యాదవ్, అన్నా అనిత కార్పొరేటర్, ధనుంజయ్ రెడ్డి టిడిపి లీడర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టిని మళ్లించేందుకే కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు

### మాజీ మంత్రి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



జమ్మలమడుగు : వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అప్పటి సీఎం జగన్ 2 లక్షల కోట్ల రూపాయలు స్వాహా చేశారని మాజీ మంత్రి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు. ఆ పార్టీ నేతలు మరో 3 లక్షల కోట్ల రూపాయల వరకు తిన్నారని విమర్శించారు. ఓట్ల లెక్కింపు జరిగి నేటికి రెండు నెలలు పూర్తయిందని రాష్ట్రంలో ఎటుచూసినా అక్రమాలు, కబ్జాలు అనేకం వెలుగులోకి వచ్చాయని అన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్సీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవ విషయాలు పక్కనపెట్టి జగన్ దిల్లీలో ధర్నాకు దిగారని ఇష్టం వచ్చినట్లు అప్పు చేశారని ఆదినారాయణ తెలిపారు. సీఎం చంద్రబాబు 7 శ్వేతపత్రాల ద్వారా అనేక విషయాలను బయటపెట్టారని అన్నారు. ఈ 60 రోజుల్లో 1వ తేదీన ఉద్యోగులు, ఫించనుదారులు, సామాజిక భద్రతా ఫించన్లు ఠంచనుగా అందించిన ఘనత మహాకూటమి ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ఈ సారి జగన్‌ను పులివెందుల్లో సైతం ఓడిస్తామని తెలిపారు. పులివెందల అభివృద్ధి పేరుతో 60 కోట్ల రూపాయల పనిని రూ.600 కోట్లకు చేసినట్లు చూపించి ఆ డబ్బులు కూడా చెల్లించలేదని మండిపడ్డారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి సున్నా అని త్వరలో వైఎస్సార్సీపీ కూడా అదే స్థితికి రాబోతోందని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రంలో పరిశ్రమలు, సంస్థలు, నీటిపారుదల, మౌలిక వసతులు, పర్యాటకం బాగా వృద్ధి చెందుతాయని సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తమదేనని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అమరావతి పనుల కోసం తొలిదశ నిధులు ఇచ్చారని అన్నారు. విశాఖ రైల్వేజోన్ త్వరలోనే క్లియర్ అవుతుందని విశాఖలో ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందని తెలిపారు. అలానే కడప స్టీల్ ప్రారంభమవుతుందని తెలిపారు. అర్హులందరికీ ఇళ్లు వస్తాయని రాష్ట్రానికి కావాల్సినంత గ్రామీణ ఉపాధి లభిస్తుందని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి సహా ఆ పార్టీకి చెందిన నాయకులు అనేక మంది జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుందన్నారు. దస్త్రాలు దహనం, కాలువల్లో పారేయడం వంటివి వారి దుశ్చర్యలకు నిదర్శనాలుగా అభివర్ణించారు. జగన్ పాలనలో జరిగిన మద్యం విక్రయాల్లోనే భారీ కుంభకోణం బయటపడుతుందన్నారు. వైఎస్సార్సీపీకి రాజకీయాలు లేకుండా చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారనే భయంతోనే ఎమ్మెల్సీగా పోటీకి మాజీ మంత్రి బొత్సకు అవకాశం కలిపించారన్నారు. రాష్ట్రంలో కబ్జాలు, తప్పులు జరని ప్రాంతం ఏది లేదన్నారు.

# జనం ఛీ కొట్టినా చీటింగ్ బుద్ధి మార్చుకోరా?

### మాజీ సీఎం జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్



అమరావతి: జనం ఛీ కొట్టినా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం తన ఛీటింగ్ బుద్ధి మార్చుకోలేదంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాజీ సీఎంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఏదో జరిగిపోతున్నట్లు ప్రతిరోజూ సోషల్ మీడియాలో వైసీపీ శ్రేణులు, నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్లలో ఏపీని అరాచక ఆంధ్రప్రదేశ్ గా మార్చి రాష్ట్రంలో రక్తపుటేరులు పారించింది మీరు కాదా జగన్ రెడ్డి? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల నుంచి ప్రతిపక్ష నేతల వరకు వారిపై దాడులు, దౌర్జన్యాలు జరగని రోజు ఏదైనా ఉందా? అని నిలదీశారు. పల్నాడులో తెలుగుదేశం పార్టీ కార్యకర్త తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతు కోసి చంపింది ఎవరు? ఆనాడు జగన్మోహన్ రెడ్డి కళ్లుమూసుకొని కూర్చున్నారా? రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయి. జగన్ మానసిక పరిస్థితే బాగాలేదు. అధికారం పోయేసరికి ఏం చేయాలో అర్థంకాక కూటమి ప్రభుత్వంపై అబద్ధాలతో కుట్రలు పన్నుతున్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైనింగ్ ముఠా పాలన నడిపింది మీరుకాదా జగన్ రెడ్డి? ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై ఇప్పుడైనా తప్పుడు ప్రచారాలు మానుకో.. లేదంటే వచ్చే ఎన్నికల్లో మీరు ఎమ్మెల్యేగా కూడా గెలవలేరు. ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేసినా జగన్ లో ఎటువంటి మార్పు రాలేదు. జగన్ తప్పుడు ప్రచారాన్ని జనం నమ్మే పరిస్థితుల్లో లేరు. త్వరలో వైసీపీ కార్యాలయానికి టులెట్ బోర్డు పెట్టుకోవడం ఖాయం అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఏపీలో ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతోందని, లాం అండ్ ఆర్డర్ కంట్రోల్ లో ఉందని కూటమి నేతలు చెబుతున్నారు. గత ప్రభుత్వం పెంచి పోషించిన గంజాయి గ్యాంగ్ వల్లే అక్కడక్కడా అలజడి చెలరేగుతోందని, త్వరలోనే వీటికి చెక్ పెడతామని ఏపీ మంత్రులు పలు సందర్భాలలో చెబుతూనే ఉన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ప్రజల రక్షణే తమకు ముఖ్యమని.. హద్దు మీరితే పోలీసు శాఖ ఎవరినీ వదిలి పెట్టదన్నారు.

# ప్లీజ్ బెయిల్ ఇవ్వండి : హైకోర్టుకు పిన్నెల్లి రిక్వెస్ట్

అమరావతి : వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా పిన్నెల్లి ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని.. కానీ తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. రాజకీయ పెద్దల ప్రోద్బలంతో తనను పోలీసులు లక్ష్యంగా చేసుకున్నారని పిన్నెల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఏపీ హైకోర్టులో పిన్నెల్లి పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు సోమవారం విచారణకు రానున్నాయి. ఏపీ పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేయడంతో పాటు అడ్డుకోబోయిన టీడీపీ పోలింగ్ ఏజెంట్‌పై దాడి చేయడంతో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిపై పల్నాడు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో అరాచకం సృష్టించడం, అడ్డుకోబోయిన సీఐపై దాడి చేసిన కేసుల్లో పిన్నెల్లితో పాటు ఆయన తమ్ముడు, అనుచరులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పిన్నెల్లిని జూన్ 26వ తేదీన అరెస్ట్ చేశారు.

### సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్‌లకు స్వామీ వారి

# ఆశీస్సులుండాలి-మంత్రి సారధి



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సమస్యలపై అలుపెరగక పోరాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరియు మంత్రి లోకేష్ గారికి ఆ తిరుమల ఏడు కొండల స్వామి ఆశీస్సులు అండదండలు ఉండాలని శ్రీవారిని కోరుకున్నానని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థ సారధి పేర్కొన్నారు. నేటి ఆదివారం ఉదయం విఐపీ విరామ సమయంలో మంత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రంలోని అల్పాదాయ వర్గాలకు చెందిన పేద ప్రజలకు, అలాగే జర్నలిస్టులకు కూడా తక్కువ ధరతో ఇల్లు అందించాలని సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. నేటి ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, ఉప ముఖ్యమంత్రి గారికి మరియు మంత్రి లోకేష్ గారికి ఆ దేవదేవుడు ఏడు కొండల స్వామి వారి ఆశీస్సులు అండదండలు ఉండాలని కోరుకున్నానని మంత్రి తెలిపారు. టిడ్కో ఇల్లు, పిఎంఎవై కింద పురోగతిలో ఉన్న ఇల్లు, పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలను ఒక ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ఒక సంవత్సరం లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందచేసేలా ముఖ్యమంత్రి చేసిన సూచనల మేరకు లక్ష్య సాధన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని తెలిపారు.అనంతరం మంత్రి తిరుపతి చేరుకుని స్థానిక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వేకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వంశీకి క్షమాభిక్ష లేదు : బుద్దా



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హత్యలు చేసిన వారికి క్షమాభిక్ష ఉంటుందేమో కానీ వల్లభనేని వంశీకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాభిక్ష ఉండదని తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర ఇన్చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇష్ట రీతిగా ప్రవర్తించడంతోపాటు వ్యక్తిత్వ హననానికి పాల్పడి పార్టీ ఆఫీసునే తగలబెట్టిన చరిత్ర వంశీదన్నారు. ఎన్నికలకు ముందు రజినీకాంత్ డైలాగులు చెప్పి తరువాత గజినీకాంత్ గా మారిన పరిస్థితి వంశీదన్నారు. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గం లోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ , గన్నవరం ఖాన్ దాదా అధికారం అడ్డం పెట్టుకొని చాలా ఇష్టం వచ్చినట్టు ఆయన ప్రవర్తించాడు అతను ఎవరో తెలుసు కదా గన్నవరం వంశీ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు కుటుంబం మీద అనేక మాటలు మాట్లాడి టిడిపి ఆఫీసును కూడా తగలబెట్టాడన్నారు. నోరు ఉందని ఇష్టమొచ్చినట్టు వాగటం ఎందుకు ఎన్నికల అయిపోయిన వెంటనే పారిపోవటం ఎందుకు అని ప్రశ్నించారు. పరిటాల రవి అనుచరుడివని ప్రగల్ బాలు పలికిన వాడివి నివు ఆఖరికి పరిటాల రవి ఆస్తులు కూడా దోచుకున్నాడన్నారు. ఇంటిలిజెన్స్ డిజిపి ఆంజనేయులు హని ట్రైప్ చేసి ఇరిగించాడన్నారు. వంశీ కి కరెక్ట్ అనేది ఉందా నీకు పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఏంటి పరిటాల రవి దగ్గర నీ ఒక చెంచావన్నారు. పోలీసులు అరెస్ట్ చేయకుండానే సోషల్ మీడియాలో అరెస్టు చేశారని ప్రచారం చేయించుకున్న వంశీ, భయంతో పారిపోయాడన్నారు. ఎన్నికల ముందు సింహం సింగిల్ గా వస్తుందని రజనీకాంత్ డైలాగులు చెప్పాడనీ, ఎన్నికలు అయిపోయిన తర్వాత 11 సీట్లు వచ్చేసరికి గజినీకాంత్ మాటలు చెబుతూ ఉన్నాడన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోతే పార్టీ చేసుకున్న వంశీ అలాంటి వ్యక్తిని కూడా జగన్మోహన్ రెడ్డి పార్టీలో చేర్చుకున్నాడన్నారు. వంశీ లాంటి వ్యక్తి సమాజంలో ఉండటానికి అనర్హుడన్నారు. వంశీ సమాజంలో ఎక్కడైనా కనపడితే ప్రజలు పోలీసులకు అప్పచెప్పండనీ విజ్ఞప్తి చేశారు.

# ఆగి ఉన్న ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు



విశాఖపట్నం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో మంటలు చెలరేగాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా నుంచి విశాఖ చేరుకున్న ఎక్స్‌ప్రెస్ (18517) రైలు బోగీల్లో ఈ మంటలు వ్యాపించాయి. స్టేషన్‌లోని 4వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఈ ఘటన జరిగింది. మూడు ఏసీ బోగీలు దగ్ధమయ్యాయి. బీ7 బోగీలోని మరుగుదొడ్డిలో షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. దీంతో బీ7 బోగీ పూర్తిగా.. బీ6, ఎం1 బోగీలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.రైలులో అగ్ని ప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత డీఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని విశాఖ సంయుక్త సీపీ ఫకీరప్ప తెలిపారు. రైలులో నుంచి ప్రయాణికులందరూ దిగిపోయారని చెప్పారు. నేడు ఉదయం 10 గంటలకు మంటలు చెలరేగాయన్నారు. వెంటనే రైల్వే సిబ్బంది, పోలీసులు అప్రమత్తమయ్యారని తెలిపారు. నాలుగు అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలార్పారని చెప్పారు. దగ్ధమైన బోగీలను రైలు నుంచి వేరు చేసి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాద ఘటనపై రైల్వే సిబ్బంది పరిశీలిస్తున్నారని ఫకీరప్ప వివరించారు.

# చీరలోనే అమ్మతనం, కమ్మతనం..

### ఏపీ హోం మంత్రి అనిత



విశాఖపట్నం: చీరకట్టడం మన సాంప్రదాయమని, చీరలోనే అమ్మతనం, కమ్మతనం ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో జరిగిన కలర్ ఫుల్ హ్యాండ్లూమ్ శారీ వాక్ కార్యక్రమానికి హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏపీ చేనేత కార్మికులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వంలో కార్మికులను ఆదుకుంటామని హోం మంత్రి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే చీర గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చీర అంటేనే గుర్తుకొచ్చేది అమ్మ మాత్రమేనని, భావితరాలు ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. చీరను నేసేటప్పుడు చేనేత కార్మికులకు కష్టం ఉంటుందని, ఒక చీరను నేయడానికి దాదాపుగా 20 రోజులకు పైగా సమయం పడుతుందన్నారు. చిన్నపాటి వర్షం పడిన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయితే చేనేత కార్మికులు సమస్యలు ఇప్పటికీ తీరడం లేదని, మా ప్రభుత్వంలో చేనేత కార్మికులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు.



# మరో నెల రోజుల్లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు

**విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కీలక వ్యాఖ్యలు**

కర్నూల్: ఏసీఏ ఎన్నికలు మరో నెల రోజుల్లో జరుగుతాయని విజయవాడ ఎంపీ, కర్నూల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల ఆఫీసర్గా నిమ్మగడ్డ రమేష్ కుమార్ను నియమించినట్లు చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నాడు నిర్వహించారు. త్వరలో ఏసీఏ పాలకవర్గం ఎన్నికకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.
ఏసీపీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో పాత బోర్డ్ సభ్యుల రాజీనామాలు ఆమోదించామని వివరించారు. వారు ఏసీఏకి చేసిన సేవలకు కృతజ్ఞతగా సన్మానించామని అన్నారు. ఈ నెల రోజులు ఏసీఏ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామని ప్రకటించారు. ఈ కమిటీలో ఆర్వీ ఎస్కే రంగారావు, మ్యాన్ చో ఫేరార్, జాగర్ల మూడి మురళీ మోహన్ రావు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. అనంతరం జరిగిన జనరల్ బాడీ మీటింగ్లో క్రికెట్ స్టేడియాల పరిస్థితిపై చర్చించారు. క్రికెట్ క్రీడాకారుల సదుపాయలపై కూడా సభలో మాట్లాడినట్లు కేశినేని చిన్ని తెలిపారు.



## పంటలు నష్టపోయిన రైతులకు
# 80శాతం రాయితీపై విత్తన పంపిణీ

● రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: అధిక వర్షాల కారణంగా ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులకు 80% రాయితీపై విత్తన పంపిణి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృఎద్ధి మరియు మత్స్య శాఖా మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు అన్నారు. రైతు మేలు కోరుకునే ప్రభుత్వం కాబట్టే రైతుల కష్టాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృఎషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో జూన్ మరియు జూలై నెలలో సాధారణానికి మించి 48.6% అధిక వర్షపాతం నమోదు కావడం వలన ఇప్పటికే వరి ఊడ్పుల కోసం సిద్ధంగా వున్న సుమారు 1406 హెక్టర్ల నారుమళ్లు మరియు వేల హెక్టర్లలో నాట్లు పూర్తన వరి పంట ముంపునకు గురైందని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రుల బృఎందం ముంపు ప్రాంతాల్లో పర్యటించామని, మంత్రుల బృందం, రాష్ట్ర స్థాయి అధికారులు, వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమీక్షలు నిర్వహించి ముందస్తుగానే రైతుల అవసరాలకు తగినట్టుగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను తయారు చేస్తున్నామన్నారు. ముంపునకు గురై పంటలు దెబ్బతిన్న రైతులకు సత్వర సహాయంగా, వెనువెంటనే విత్తుకొనుటకు 80% రాయితీపై వరి పంట విత్తనాలను పంపిణి చేయుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. . అధిక వర్షాల వలన నారుమళ్లు నాటిన వరి పంటలు దెబ్బ తిన్న రైతులు 88శాతం రాయితీపై తమతమ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీ పొంది మంచి సాగు యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

## పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాల్లో
# అవినీతికి పాల్పడిన వారిని వదలం

● ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న ఆర్థిక సాయాన్ని పెంపు
● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోళ్లు. గృఎహ నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని. సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి నియోజక వర్గం పెదరావూరులో పెదరావూరు, సిరిపురం, దావులూరు ప్రాంతాల్లో పేదల కోసం ఉద్దేశించిన లే అవుట్లను, అక్కడి ఇళ్ల నిర్మాణాలను ఆదివారం పరిశీలించారు. గృఎహ నిర్మాణ స్థితిగతులపై అధికారులతో, లబ్ధిదారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లకు రెండు వారాల గడువు ఇస్తున్నామని, పనులు మొదలు పెట్టకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు తమకు మంజూరు చేసిన స్థలం ఎక్కడుందో కూడా తెలియదని చెప్పడంతో మనోహర్ విస్తుపోయారు. లబ్ధిదారులకు వారి స్థలాలు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. గృఎహ నిర్మాణ శాఖ నుంచి లబ్ధిదారులకు రావాల్సిన బకాయిలు వారం రోజుల్లో విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో



ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న ఆర్థిక సాయాన్ని త్వరలోనే పెంచుతామన్నారు.

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసిన
# రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృఎద్ధి , మత్స్య శాఖామంత్రి కింజరావు అచ్చెన్నాయుడుని విజయవాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ కలిసారు. వివిధ అంశాలపై వీరు చర్చించారు.



## అటల్ మారథాన్ పోటీల్లో
# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ర్యాంకు

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: నీతి ఆయోగ్ వారి అటల్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న అటల్ మారథాన్ లో భాగంగా 2023-24 సంవత్సరానికి గానూ ఆన్ లైన్ ప్రాజెక్టు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ర్యాంకు దక్కిందని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 01 నుండి ఈ ఏడాది జనవరి 26 వరకు దేశవ్యాప్తంగా 2000 ప్రాజెక్టులు సమర్పించగా వాటిల్లో 500 ఉత్తమ ప్రాజెక్టులు ర్యాంకులు వారీగా ఎంపికయ్యాయని, అందులో మన రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులు 35 ఎంపిక జాబితాలో ఉన్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటినందుకు ర్యాంకులు సాధించిన బృఎందాలతో పాటు, ప్రాజెక్టులు సమర్పించిన అన్ని పాఠశాలల విద్యార్థులకు, సహకరించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.




తమ చుట్టూ ఉన్న సమస్యలనే ఆసరాగా చేసుకుని పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ లాబ్ లోని పరికరాలను విద్యార్థులు ఉపయోగించి వినూత్న ఆలోచనలకు నాంది పలకడం ఆనందదాయకమని, రాబోయే కాలంలో మరిన్ని వినూత్న ఆవిష్కరణలు సృఎష్టించి మన రాష్ట్రానికి ఖ్యాతి తీసుకురావాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు కోరారు. తక్కువ ఖర్చుతో సెలైన్ అలారం ప్రాజెక్టుకు రెండో ర్యాంకు.. శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సమర్పించిన తక్కువ ఖర్చుతో సెలైన్ అలారం (ప్రాజెక్టుకు రెండో ర్యాంకు దక్కింది. ఈ ప్రాజెక్టు ఆ పాఠశాల బయాలజీ స్కూల్ అసిస్టెంట్ ఎస్.ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో పదో తరగతి చదువుతున్న డి. నవీన్ కుమార్ బృఎంద నాయకునిగా, జె.ఎస్.హాసిని, హరి సింహాద్రి రూపొందించారు.

# సంచనలంగా మారిన సీఆర్డిఏలో ఫైళ్లు మిస్సింగ్

**పాలన వ్యవహారాలకు ఇబ్బందులు**

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ కార్యాలయంలో పలు కీలక ఫైల్స్ కనిపించడం లేదన్న సమాచారం సంచలనంగా మారింది. . వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ప్రభుత్వ తప్పులను పట్టుకుని, కేసులు పెట్టేందుకు సీఆర్డీఏ ఫైల్స్ను అణువణువూ శోధించింది. విచారణ కోసం పలు ఫైళ్లను స్వాధీనం చేసుకుంది. వీటిలో కొన్ని కీలక ఫైళ్లు ఇప్పటికీ కనిపించడం లేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అమరావతి రాజధాని పనుల వునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తోంది.ఈ కమంలో సీఆర్డీఏ పాలనా వ్యవహారాలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువు తీరాక రాజధానిపై పై పోకస్ పెట్టింది. దీంతో సీఆర్డీఏ ద్వారా తిరిగి అధికారికంగా కార్యకలాపాలు మొదలయ్యాయి. అమరావతి భవిష్యత్ ప్రణాళికలపైన ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తోంది. ఇదే సమయంలో సీఆర్డీఏ కార్యాలయంలో కీలక ఫైల్స్ మాయం అయినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.

**కీలక ఫైళ్లు మిస్సింగ్...** ప్రస్తుత ముఖ్యమంత్రి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై




కక్షగట్టిన వైసీపీ ప్రభుత్వం.. ఆయనను కేసులలో ఇరికించేందుకు సింగపూర్ దేశంతో చేసుకున్న ఎంఓయూలకు సంబంధించిన ఫైళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వీటిలో కూడా కొన్ని కనిపించటం లేదని తెలుస్తోంది. చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేశ్లను ఇన్నర్రింగ్ రోడ్డు కేసులో ఇరికించేందుకు భూ సంబంధిత ఫైళ్లన్నీ పట్టుకుపోయారు. వీటిలో కూడా చాలావరకు వెనక్కి రాలేదని తెలుస్తోంది. అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఆర్డీఏ అధికారులు ఈ ఫైళ్లు ఇచ్చేశారు. ఈ ఫైళ్లకు సంబంధించిన కాపీలు అయినా తమ దగ్గర పెట్టుకోలేదు. ప్రస్తుతం సీఆర్డీఏకు కమిషనర్ నుంచి అడిషనల్ కమిషనర్ల వరకు అంతా కొత్తవాళ్లు వచ్చారు. మిగిలిన ఫైళ్లు తెచ్చుకుందామంటే అవి ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉంది.

**పాలనా వ్యవహారాలకు ఇబ్బంది...** దీంతో సీఆర్డీఏ పాలనా వ్యవహారాలకు ఇబ్బందిగా మారింది. అమరావతి ప్రక్రియ తిరిగి ప్రారంభమైన క్రమంలో కీలక వ్యవహారాలపై ముందుకు వెళ్లేందుకు సీఆర్డీఏ అధికారులకు ఇబ్బందిగా మారింది. ఫైళ్లు కనిపించని విషయం మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ దృఎష్టికి కూడా వెళ్లింది. ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, ఎస్టేట్ ఇలా పలు విభాగాల ఫైల్స్ కనిపించడం లేదు. ఈ ఫైళ్లను టీడీపీ ప్రభుత్వంపై విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం నాడు స్వాధీనం చేసుకున్న విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు.

# రాజకీయ కబంధ హస్తాల్లో ఏసీఏ

● ఇన్నాళ్లూ విజయసాయిరెడ్డి క్రికెట్ అసోసియేన్
● శరత్ చంద్రారెడ్డి, పి రోహిత్ రెడ్డిలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు
● పాలక వర్గానికి ఇంకా ఏడాదిపైనే సమయం ఉన్నా రాజీనామాలు
● క్రికెట్ అసోసియేషన్లో భారీ కుదుపుకు క్రికెటర్ హనుమ విహారి కారణం?
● ప్రస్తుతం మంత్రి లోకేష్ కనుసన్నలలోకి వచ్చేసిన అసోసియేషన్
● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ను అధ్యక్షునిగా చేసేందుకు నిర్ణయం?

విశాఖపట్నం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్లో కలకలం చెలరేగింది. అసోసియేషన్ సభ్యులందరినీ రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం వత్తిడి పెంచింది. దీంతో ఆగస్టు 4న ఆదివారం ఏసీఏ సమావేశం అయ్యింది సమావేశం అనంతరం రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారని సమాచారం. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చరిత్రలో పూర్తిస్థాయి రాజకీయాలు చోటు చేసుకుని ఒకేసారి ఎలక్టెడ్ బాడీ మొత్తం రాజీనామా చేయడం ఇదే మొదటిసారి అని చెప్పవచ్చు.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలవగానే రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి ఆదిపత్యం క్రికెట్ అసోసియేషన్లో కొనసాగింది. ఏసిఏ సభ్యుల ఎన్నిక గడువు ముగియడంతో తన బంధువులైన పి శరత్ చంద్రారెడ్డి, పి రోహిత్ రెడ్డిలను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నిక చేయించుకోవడంలో సఫలమయ్యారు. అప్పటి వరకు ఉన్న కమిటీ మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుకు సంబంధించిన వారు. గంగరాజు వారసత్వానికి ముగింపు పలుకుతూ విజయసాయిరెడ్డి క్రికెట్ అసోసియేన్లోకి చొరబడ్డారు.
క్రికెట్ అసోసియేన్లో మూడేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ఆ ఎన్నికల్లో గెలిచిన వారు మూడేళ్లు అసోసియేషన్ పాలకవర్గంగా ఉంటారు. ప్రస్తుత పాలక వర్గానికి ఇంకా ఏడాదిపైనే సమయం ఉంది. అయినా వీరంతా రాజీనామా చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు కారణం ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏసీఏలో పెత్తనం చెలాయించినందున ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఏసీఏలో పెత్తనం చెలాయించేందుకు నిర్ణయించింది. ఏసీఏను తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆయన వత్తిడి మేరకే పాలక వర్గం రాజీనామా చేస్తున్నారని క్రికెట్ రంగంలోని పలువురు చెబుతున్నారు.

**అసోసియేషన్లో విహారి కుదువు**

క్రికెట్ అసోసియేషన్లో భారీ కుదుపుకు హనుమ విహారి అనే క్రికెటర్ కారణమనే ఆరోపణలు ఉన్నాయి. హనుమ విహారి ఎవరు? ఏమి జరిగింది? ఆయన ఎందుకు తెరపైకి వచ్చారనేది తెలుసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్లో ఉంటున్న హనుమ విహారి గుంటూరుకు చెందిన వ్యక్తి. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఆడుతున్న విహారి ఏపీలో ఆడేందుకు అసోసియేషన్ అనుమతి ఇచ్చింది. హనుమ విహారి కెప్టెన్సీలో ఒక టీమ్ ఆడుతోంది. అయితే టీము సభ్యులను ఇష్టానుసారం తిట్టేవాడని, వెటకారంగా వారిని మాట్లాడేవాడని, తాగిన మైకంలో టీము సభ్యుల మనస్సు నొచ్చుకునేలా ప్రవర్తించే వాడనే ఆరోపణలు ఉన్నాయి. అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి రెకమెండేషన్తో తిరుపతికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుని కుమారుడు ఒకరు ఏపీ టీములో చేరారు. ఆ క్రికెటర్ విహారి తిట్టిన తిట్లు తనను బాధించాయని ముందుగా కంప్లెంట్ చేశారు. ఆ తరువాత టీములోని సభ్యులు 15 మంది ఈ మెయిల్స్ ద్వారా అసోసియేషన్కు కంప్లెంట్ చేశారు. అనంతరం రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేశారు. విహారి విషయమై అసోసియేషన్లో చర్చ జరుగుతుండగా విషయం తెలుసుకున్న విహారి అసోసియేషన్ నుంచి పిలువు రాకముందే తాను ఏపీ టీము నుంచి తప్పుకుంటుంటున్నానని ఏసీఏకు మెయిల్ పెట్టాడు. సెలక్టర్లు కూడా ఆయనను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఇంటర్ స్టేట్ మ్యాచ్లో మ్యాచ్ ఫిక్సింగ్కు పాల్పడి టీము ఓడిపోయేందుకు కారకుడయ్యాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. తాను ఏపీ క్రికెట్ నుంచి వెళ్లిపోతూ ఏసీఏపై ఒక ఆరోపణ చేశారు. ఏసీఏలో రాజకీయాదే పైచేయిగా ఉందని, రాజకీయాలకు క్రికెటర్లు బలవుతున్నారని ఇన్స్టాగ్రాంలో వీడియో పోస్టు చేశారు. ఏపీకి ఇకపై నేను క్రికెట్ ఆడనని, వేరే రాష్ట్రాలకు ఆడేందుకు నాకు ఎన్వోసీ ఇవ్వాలని ఏసీఏకు విజ్ఞప్తి చేశారు. ఎన్వోసీ ఇవ్వకముందే ఉత్తర ప్రదేశ్లో ఆడేందుకు అక్కడి వారితో మాట్లాడుకున్నారని పలువురు క్రికెటర్లు చెబుతున్నారు. ఇన్స్టాగ్రాంలో విహారి పోస్టు చేసిన వీడియో రాజకీయ దుమారం లేపించింది. ఎన్నికలకు ముందు జరిగిన ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లు ఎన్నికలకు ముందు ఏసీఏ భ్రష్టుపట్టిందని పేర్కొంటూ విహారిని వారిద్దరూ బలపరిచారు. అప్పటి వరకు విహారికి



ఏసీఏ ఎన్వోసీ ఇవ్వలేదు. ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమి గెలవడంతో విహారికి ఎన్వోసీ ఇచ్చారు. ఆ తరువాత తిరిగి తాను ఏపీ టీము నుంచి క్రికెట్ ఆడతానని వచ్చారు. ఈ వ్యవహారమంతా అగ్నికి ఆజ్యం పోసినట్లైంది.

**పాలక మండలి ఎందుకు రాజీనామా చేయబోతోంది?..**

ఏసీఏ అధ్యక్షులు పి శరత్ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు పి రోహితడ్డి, కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్రెడ్డి, సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి ఎవి చలం, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు వురుషోత్తంలు ఆదివారం రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వీరంతా వైఎస్సార్సీపీకి చెందిన వారు కావడంతో ఎలాగైనా వీరిని తొలగించాలని తెలుగుదేశం ప్రభుత్వం భావించింది. రాజీనామా చేసి వెళ్లాల్సిందిగా వీరిపై లోకేష్ వత్తిడి తెచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా వీరికి ఏడాదిపైనే సమయం ఉంది. వీరందరూ వివిధ రంగాల్లో వ్యాపారులుగా ఉన్నారు. రాజీనామాలు చేయకుండా ఉంటే ప్రభుత్వ పెద్దలు వ్యాపారాలను దెబ్బతీసే అవకాశం ఉందని భావించి రాజీనామాలు చేస్తున్నట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో అసోసియేషన్లు, 31 పట్టణాల్లో క్రికెట్ క్లబ్బులు ఉన్నాయి. వీరిలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, మరికొందరు సభ్యులకు ఓటు హక్కు ఉంటుంది. ఇంటర్నేషనల్ ప్లేయర్లు అయిన ఎంఎస్కే ప్రసాద్, వై వేణుగోపాల్రావు, ఆర్ కల్పనలకు కూడా ఓట్లు ఉంటాయి. అసోసియేషన్ తరవున ఒక మెన్, ఉమెన్ ప్లేయర్లు కూడా ఓటు హక్కు కలిగి ఉంటారు. కంప్రోలర్ ఆఫ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నుంచి అసోసియేషన్ పరంగా ఒక వ్యక్తికి ఓటు హక్కు ఉంటుంది. ప్రస్తుత కమిటీ రాజీనామా చేసిన తరువాత మళ్లీ కొత్త బాడీని ఎన్నుకోవాల్సి ఉంటుంది.

**ఉద్యోగుల్లో ఆందోళన..**

ఏసీఏ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. తమను కూడా ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తారేమోననే ఆందోళనలో చాలా మంది ఉన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో గోకరాజు గంగరాజుకు సంబంధించిన వ్యక్తులను కాదని వైఎస్సార్సీపీకి చెందిన వారిని విజయసాయిరెడ్డి సారథ్యంలో పెట్టుకున్నారు. అప్పట్లో ఒక ఒప్పందం అసోసియేషన్కు, గోకరాజు గంగరాజుకు మధ్య జరిగినట్లు క్రికెటర్లు చెబుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం కమిటీ సభ్యులు రాజీనామాలు చేసినా, టర్మ్ అయిపోయి దిగిపోయినా నిబంధనల ప్రకారం అసోసియేషన్లోకి తీసుకున్న ఉద్యోగుల్లో ఒక్కరిని కూడా తొలగించేందుకు వీలు లేదు.
అయితే ఈ సారి తమ ఉద్యోగాలకు కూడా గండం ఉందనే ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారు. ఆదివారం పాలక మండలి రాజీనామా చేయగానే ఎన్నికల అధికారిని నియమించి నిబంధనల ప్రకారం కొత్త పాలక మండలి సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ను అధ్యక్షునిగా ఉంచేందుకు లోకేష్ నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటి వరకు ఆయనకు ఓటు హక్కు లేదు. అందువల్ల ఏదో ఒక క్రికెట్ క్లబ్కు అధ్యక్షుడిని చేసి ఓటు హక్కు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ఒక నెల రోజుల పాటు కొనసాగుతుంది. అనంతరం కొత్త పాలక మండలి ఎన్నికవుతుంది.

# వైభవంగా ముగిసిన సాహిత్యోత్సవ్



హైదరాబాద్ : హైదరాబాద్లో కిక్కిరిసిన ఆడిటోరియంలో ప్రేక్షకుల ఆనందోత్సాహాల నడుమ జరిగిన సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ అపూర్వ విజయం సాధించింది. హిందుస్థానీ కళ, సంస్కృఎతి మరియు సాహిత్యాన్ని వేడుక చేసుకునే అతిపెద్ద సాంస్కృఎతిక కార్యక్రమాలలో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్, సాంస్కృఎతిక మంత్రిత్వ శాఖ (జిఓఐ) మరియు పర్యాటక మంత్రిత్వ శాఖ (జిఓఐ) సహకారంతో నిర్వహిస్తున్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ మద్దతుతో ఈ సాంస్కృఎతిక కార్యక్రమం హైదరాబాద్లో నిర్వహించబడింది. పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్ ; మానూ వైస్-ఛాన్సలర్, ప్రొ. ఐనుల్ హసన్ ; ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ సెయెద్ ఇ. హస్నైన్; తెలంగాణ కస్టమ్స్ మరియు జీఎస్టీ ప్రధాన కమిషనర్, సందీప్ ప్రకాష్ ; ఆదాయవు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్, ఆంధ్ర మరియు తెలంగాణ శ్రీమతి మితాలి మధుమిత ; జష్న్-ఎ-అదాబ్, అధ్యక్షుడు నవనీత్ సోనీ ఐఆర్ఎస్ కవి మ- సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ సింగ్ తో సహ విశిష్ట అతిథులు హాజరు కాగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో డెక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావాన్ని అన్వేషిస్తూ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ మరియు అజ్మ్ షాకిరీలతో డెక్కనీ ఉర్దూ మే ఫార్సీ కే అస్రాత్పై చర్చా కార్యక్రమం జరిగింది. మరో ప్యానెల్ చర్చ కార్యక్రమంలో కులీ కుతుబ్ షా, హైదరాబాద్, ఔర్ దక్కనీ అదాబ్ ఈ ప్రాంతంలోని గొప్ప కవిత్వ సంప్రదాయాన్ని ఎత్తిచూపారు. దక్షిణ భారతదేశానికి చెందిన లతీఫుద్దీన్ లతీఫ్, వాహెద్ పాషా క్వాద్రీ, షాహెద్ అదీలీ, మీర్ బిద్రీ, చాచా పాల్మూరి, ఫరీద్ సహర్ మరియు హమీద్ సాలీ వంటి ప్రముఖ కవులు చేసిన దక్కనీ షేరీ మెహఫిల్ అద్భుతమైన విజయాన్ని సాధించింది. డా. విద్యా షా ఆత్మీయ స్వరంలో దాద్రా, తుమ్రీ, గజల్తో కార్యక్రమం సంగీత మలుపు తిరిగడంతో ప్రజలు ఆనందోత్సాహాలతో ఊగిపోయారు. అత్యంత ప్రజాదరణ పొందిన వార్సీ బ్రదర్స్ యొక్క శక్తివంతమైన ఖవ్వాలీ ప్రదర్శనతో సాయంత్రం ముగిసింది. యువ కవిత్వ ఔత్సాహికులు మరియు ప్రతిభావంతు ఉర్దూ కవిత్వం యొక్క వేగవంతమైన ఆట ' బైత్బాజీ' లో పాల్గొన్నారు. డాక్టర్ మమతా జోషి తన అందమైన పాటల ద్వారా హృఎదయాన్ని కదిలించే సూఫీ కలామ్లకు వందనం సమర్పించారు. అహ్మద్ రషీద్ షేర్వానీ ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం మన గంగా-జమునీ తహజీబ్కు నిజమైన వందనంగా నిలిచింది. 'నృఎత్య ధార'తో జాతీయ అవార్డు గ్రహీత కూచిపూడి నృఎత్యకారిణి యామినీరెడ్డి హిందుస్థానీ నాట్య వైభవాన్ని ప్రదర్శించారు. ప్రముఖ నటీనటులు అమిల్ సియాల్, మను రిషి చద్దా మరియు ఫైసల్ మాలిక్ లతో జరిగిన సినిమా ఓటిటి మరియు థియేటర్: సమాజిక్ సరోకర్ యా మనోరంజన్ అనే ప్యానెల్ చర్చలో ప్రియమైన నటీనటులు చర్చను వినడానికి యువత ప్రత్యేకించి అధిక సంఖ్యలో వచ్చారు. మెహ్ఫిల్-ఎ-సుఖాన్: ముషైరా మరియు కవి సమ్మేళనం జరిగింది. ఇక్కడ పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్, మదన్ మోహన్ డానిష్, తాహిర్ ఫరాజ్, మోయెన్ షాదాబ్ వంటి లెజండరి కవులతో పాటుగా సుదీర్ఘమైన ఇతర భారతీయ కవులు మరియు షాయార్లు పాల్గొనటంతో వేడుక ఘనంగా ముగిసింది.

## ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసుని,పాడేరు టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిని కలిసిన
## ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ట్రైబల్ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బృందం

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృఎష్ణ శ్రీని వాసుని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ధన లక్ష్మి, విశాఖ జిల్లా అధ్యక్షులు హేమామాలిని, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు... ఈ సందర్భంగా ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ట్రైబల్ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళా వైద్య ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే దృఎష్టికి తీసుకెళ్లామని దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృఎష్ణ శ్రీనివాసుని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ట్రైబల్ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా శాలువాతో సత్కరించారు.



పాడేరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరిని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ట్రైబల్ ఉమెన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు భూలోకమ్మ, రాష్ట్ర కార్యదర్శి జి. ధనలక్ష్మి,పాడేరు జిల్లా అధ్యక్షురాలు పెద్దమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా వైద్య ఉద్యోగుల సమస్యలను పాడేరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి దృఎష్టికి తీసుకెళ్లామని దీనిపై ఆమె సాను కూలంగా స్పందించారని తెలిపారు.... ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సరోజినీ, మణి కుమారి, వుష్ప తదితరులు పాల్గొన్నారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం

4

సోమవారం 05 ఆగస్టు 2024

editpage@suryaa.com

## అందంగా...



అది ఆకర్షణ చందం
కలకాలం నిలిచి పోతే
వెన్నెలలు కురిసి పోతే
అది ఆత్మీయ బంధం
జన్మలు దాటిన సంబంధం
ఆద్యంతమూ
ప్రేమ మకరందాన్ని చిందించే
ఆ చూపు గాలానికి
నీ మనసు చిక్కుకోనీ
స్వచ్ఛందంగానే.
నిను చూసిన మరుక్షణమే
ఆ కళ్ళలో మెరుపు మెరిస్తే
అది నీ అందం
ఆ మెరుపు మాయమైతే
ఓ గుండె గాయమైతే
చేయందించిన ఆ సహచరి కి
జీవితం సర్వం అంకితం కానీ
మరింత అందంగానే.

**డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.**
**9440836931**

## పరమార్థం !



అను నిత్యం
ధ్యానం అలవర్చుకోవాలి
ధ్యానం పరమాత్మ స్వరూపం
ధ్యానం పరమ ధర్మం
మనిషి మనసు పదిలం
కావాలంటే ధ్యానం నేర్చుకో
ధ్యానం మౌనం తో సమానం
ధ్యానం తో శాంతి సహనం
ధ్యానం తో సౌభ్రాతృత్వం
ధ్యానం తో సహృదయత
ధ్యానం తో సమభావం
మన శాంతి కోసం
మీరు దారులు
వెతుకుతున్నారా
అవేంకావు....
ఆత్మ శాంతి కోసం

**ఎల్. ప్రఫుల్ల చంద్ర**
**6300546700**

## అవగాహన

ఇద్దరు స్నేహితుల మధ్య స్నేహం ఓ అందమైన బంధాన్ని సృష్టిస్తుంది. తల్లి, తండ్రి, భార్య, భర్త పిల్లల మధ్య ప్రేమ బంధాలు ప్రాధాన్యం కలిగి ఉంటాయి. ఇవి చాలా ఆత్మీయమైనవి. ఎంతోకాలం పటిష్టంగా ఉన్న బందాల్లోనూ కాలగతిలో మార్పులు వస్తాయి అని గ్రహించాలి. రక్తసంబంధీకుల మధ్య స్నేహితుల మధ్య ఉండే బాంధవ్యాలు కాలం విసిరే సవాళ్లకు ఎదురుగా నిలబడి మనకి మనమే ప్రభావితం అవత్తము.ద్వాదశ ఆదిత్యులలో ఒకరైన మిత్ర భగవానుడు స్నేహం, ఏకాగ్రత, సామరస్యం. వంటి ఉత్తమ లక్షణాలతో ప్రకాశించే అధిష్ఠాన దేవత. ఆయన లక్షణాలు మానవ స్నేహసంబంధాలలో ప్రతిఫలించినప్పుడు మన జీవితాలు వెలుగులీనుతాయి.స్నేహబంధం మధురమైనది. ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య లేదా కుటుంబ సభ్యుల మధ్య బంధం బలంగా ఉంటుంది. అవగాహన లోపం లేదా అపోహా ల వల్ల స్నేహాలు మరియు కుటుంబ బంధాలు సైతం బీటలు వస్తున్నాయి. కాలం సృష్టించే ఇబ్బందులు కాలం వల్లే సమసిపోతాయని విశ్వసించాలి. ప్రతి దానికి అనవసరంగా అనుమాన పడి కొందరు అన్ని ఉన్న అనాథల చాలా మంది ఉంటున్నారు. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన ఒక పాట లో ఒకే ఒక్క చరణం తో అపోహల గురించి చక్కగా వివరించారు.చేజేతులా ఏ ఒక్కరు ఏ నేరము చేసెరగరు తెలిసెవరూ దోషులు కారు ఫలితం మాత్రం మోశారు పరులంటూ ఎవరూ లేరు ఐనా అంతా పగవారు వ్యక్తులు ఎంత పెద్దవారైనా ప్రతిరోజూ చిన్నతనంలో పాఠశాలకు వెళ్ళినట్లుగా వర్తమానంలో జీవించాలి...పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విని ఎదుగుతాం. జీవితంలో ప్రతిరోజూ కాలం బోధించే పాఠాలు విని జ్ఞానం తెచ్చుకోవాలి. బుద్ధి వికసించగానే అపార్థాల మేలిముసుగులు తొలిగిపోయి బాంధవ్యాల కుసుమాలు పరిమళిస్తాయి. భార్యాభర్తల మధ్య ఉండే దీర్ఘకాల స్నేహబాంధవ్యం బలంగా నిలుస్తుంది. సంతానం వారి బంధానికి గట్టి పునాది వేస్తుంది.పవిత్రమైన పెళ్ళితంతుతో ఒక్కటయ్యే వధూవరులు ఒకరికి ఒకరుగా జీవిస్తారు. కష్టసుఖాలలో సగభాగం పంచుకుంటారు.ఇద్దరు ప్రాణ స్నేహితులు లేదాభార్యాభర్తల మధ్య అపార్థాలు పచ్చినప్పుడు– సమస్యల్ని పరిష్క రించడంలో వాద ప్రతివాదాలు సహాయం చేయవు. ఒకరి తప్పులు ఒకరు ఎంచుకుంటే నష్టమే జరుగుతుంది.ఇద్దరూ మళ్ళీ ఒకటయ్యే విధంగా సామరస్య వాతావరణాన్ని సృష్టించుకుని స్నేహభావాన్ని వెల్లడి చేసే అనుకూలమైన మాటలు మాట్లాడుకోవాలి ఇద్దరు ప్రియమైన వ్యక్తుల మధ్య అనురాగం పెరిగేందుకు వారి వైఖరి చిన్నతనంలో ఎలా ఉండేదో దానికి అనుగుణంగా సాగుతుందంటారు మనస్తత్వ నిపుణులు.బాల్యస్నేహితులతో ఇప్పటికీ సంబంధం ఉన్న వ్యక్తులకు స్నేహం విలువ బాగా తెలుస్తుంది. అటువంటివారు పెద్ద వయసులో స్నేహితులతో, భాగస్వామితో సఖ్యాన్ని చక్కగా నెరవేర్చుటకు చాలా అవకాశాలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.చిన్నతనంలో అభద్రతాభావంతో పెరిగినవారు బాంధవ్యాల నిర్వహణలో వెనకుడతారని కొందరి మాట. కొన్ని జీవితాలు లేదా కొన్ని కుటుంబాలు కొంత అపార్థాల తరవాత చక్కబడాలంటే ఒకరి పట్ల ఒకరు విమర్శలు చేయటం అపి , ప్రేమను వ్యక్తపరుస్తూ మాట్లాడటం ఏంతో అవసరం.కౌరవులు, పాండవుల మధ్య రాజ్యాధికారం కారణంగా వచ్చిన అపార్థాలు తొలిగిపోక పోవడంతో అది కురుక్షేత్ర మహాసంగ్రామానికి దారి తీసింది. అర్జునుడికి, శ్రీకృష్ణుడికి మధ్య ఎంతో స్నేహం ఉన్నప్పటికీ గంధర్వరాజు అయిన గయుడు కారణంగా వారి తాత్కాలిక విరోధం వచ్చింది. అపార్థాలు,తొలగిన తరువాత పూర్వ స్నేహం వైభవంగా కొనసాగింది. అపార్థాలు తొలగించుకోలేనంత పెద్ద విషయాలు కావు. అవగాహనతో వాటిని అధిగమించవచ్చు. లేదా పెద్దవాళ్ళకి తమ మధ్య వచ్చిన వివాదం ఏంటి అని చెప్పి సలహా అడగాలి. దాని కంటే ముందుగా కావలసింది తిరిగి స్నేహభావంతో బాంధవ్యాలను నిర్మించుకోవాలనే తీవ్రమైన ఆకాంక్ష. ఈ మధ్య కొందరు తమ స్వార్థం కోసం కుటుంబ సభ్యుల ను దూరం చేస్తున్నారు..“అందంగా ఉండటం అంటే బొట్టు కాటుక మాత్రమే ఉండటం కాదు అందరికీ ఆనందాన్ని పంచడం నిజమైన అందం
అని అందరూ తప్పక తెలుసుకోవాలి.

**గోపాలుని లక్ష్మి సిరియణ,9948205204**

## నా కవితా గాన



మన ప్రేమ ఇంద్రధనస్సై
నీ గుండె నింగిలో
నిఘా వేసింది.
అర్థమైందా నీకు..
నా బ్రతుకు శబ్దం నీపేరు.
నీ బ్రతుకు స్వప్నం నాప్రేమ.
కొన్నేళ్లుగా ఇలాంటి రాతలే
నాచూపులు పలికే కవితాగానం.
నీజత కోసమే అరుంధతి
నక్షత్రాన్ని వేడుకుంటుంది
అదిగో నా ప్రాణం..!
నా హృదయతరువు
వీచే గాలుల దరువు
నీ చూపుల వర్షంలో
నీ మువ్వల సవ్వడిలో

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

# శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద కథా సంగ్రహం



**వనం జ్వాలా నరసింహారావు**
**8008137012**

శ్రీవిలుబుత్తూరు నగరం పాండ్యుల రాజ్యంలోని నగరాలన్నిటి కంటేగొప్పది. ఎత్తైన మేడలతోను, ఉద్యానవనాలతోను,తీర్చిదిద్దిన వీధులతోను, శిల్పకళతో ముచ్చటగా వుండే ఇళ్లద్వారాలతోను, పద్మినీ జాతి స్త్రీలతోను, స్వచ్ఛమైన కొలనులతోను, ఋతువులకు తగ్గ ఫలాలను ఇచ్చే వృక్షాలతోను,నానారకాల పక్షులతోను, సాయంకాలాలు గంపల్లో పూలు తెచ్చి అమ్మేపల్లెటూరి పడుచులతోను, ఇంకా అనేక వింతలతోను అలరారుతుంది(శ్రీవిలుబుత్తూరు నగరం. విలుబుత్తూరు నగర గృహస్థులు అతిథి,అభ్యాగతులకు మర్యాదలు చేయడంలో సాటిలేనివారు. ఆతిథ్యం స్వీకరించిన అతిథులువెళ్లిపోతామంటే బంధువులు దూరమవుతున్నట్లు విచారించేవారు. అలాంటివారిలో అద్వైతసిద్ధాంతాన్ని త్రికరణ శుద్ధిగా అనుసరించే పరమ భాగవతోత్తముడు విష్ణుచిత్తుడు ఒకడు.అద్వైత వాదంతో ఉత్తమ జీవితం గడుపుతూ భగవద్భక్తులకు సకల పరిచర్యలు, మర్యాదలు జరుపుతూ, దేవుడి చేతులకు,చరణాలకు తులసీదళాల మాలలు అలంకరిస్తూ విష్ణుచిత్తుడు గృహస్థుడిగా సుఖ సంతోషాలుఅనుభవిస్తున్నాడు. అతడి ఇంటిలో అర్ధరాత్రి దాటేదాకా పురాణ పారాయణం, దైవ సంకీర్తనం వినిపించేది. ఇదిలా వుండగా, దక్షిణ భారతదేశంలో మధురాపురం అనే ప్రసిద్ధమైనమహానగరం సకల సౌభాగ్యాలతో నిండి వుండేది. ఆ నగరంలో పూలు,పూలమాలలు అమ్మే కన్యల చమత్కారాలు వర్ణించలేని ఆనందాన్ని ఇస్తాయి. ప్రణయభావాలురేకెత్తించే చమత్కార సంభాషణలతో యువకులను వివశులను చేసి తమ పూల దండలను విరివిగాఅమ్ముకుంటారు. శీలం చెడకుండా ప్రవర్తించే గడుసువారు ఆ యువతులు. కాకపోతే చూసేవారిలోకోరికలు ఊరిస్తూ వుంటారు. మధురానగరంలో వేశ్యలు మరీ అప్సరసలు. రతీమన్మథ శాస్త్రాలలోపారంగతులు వారు. ఆ నగరంలోని బ్రాహ్మణులు నిత్యాగ్నిహోత్రులు. యజ్ఞాయాగాలుచేసేవారు. ఆ నగర బ్రాహ్మణులు చేయి చాచి దానం పట్టరు. ఆ నగరంలోని రాకుమారులకుమంత్రకవచం తప్ప యుద్ధకవచం అక్కరలేదు. భుజబలాన్ని చూసి కాకుండా బుద్ధిబలాన్ని చూసిగౌరవిస్తారు. ఆ పట్టణంలోని వెనుకబడిన వర్గాల వారు పొలాలు దున్ని ధాన్యరాశులుపండించుకుంటారు. ఆ నగరాన్ని మత్స్యధ్వజుడు అనే చంద్రవంశపు రాజు పరిపాలిస్తున్నాడు. ఆరాజు రాజనీతి విశారదుడు. పాండ్యవంశ వారసుడు. సామ,దాన, భేద, దండోపాయాలతో పాటు షడ్గుణాలలోచక్రవర్తి. ఆయన కీర్తి దేవలోకందాకా వ్యాపించింది. గ్రీష్మఋతువు ప్రవేశించగానేప్రకృతి పరవశంతో పాటు, ఆ నగరంలో కొండమీద వున్న దేవుడికి తెప్పతిరునాళ్ల ఉత్సవం వచ్చింది. తిరునాళ్లను చూడడానికి వచ్చిన పరదేశ బ్రాహ్మణుడు ఒకడుమధురానగరి వైభవాలను చూస్తూ ఆనందించ సాగాడు. రాజపురోహితుల ఇంటి ఆతిథ్యంస్వీకరించాడు. ఆ తరువాత భక్తుల కోరిక మీద సూక్తులు పాడడం మొదలెట్టాడు. అందులోని ఒకసూక్తి, అదే సమయంలో రాజు మత్స్యధ్వజుడు వేశ్య భోగిని ఇంటికి పోతుండగా, ఆయనహృదయానికి సూటిగా తగిలింది. తన ప్రవర్తనకు విచారించాడు. తాను ఇంతకాలం ఇంద్రియ సుఖాలే ముఖ్యమనుకున్నాని, ఇక ముందు పరలోక సుఖాలకోరకు కృషిచెయ్యాలని నిశ్చయించుకున్నాడు రాజు మత్స్యధ్వజుడు. ఒక తలారి ద్వారా తన వేలికున్నముద్రికను ఆ పరదేశి బ్రాహ్మణుడికి పంపాడు. తాను అంతఃపురంలోకి పోయాడు. మర్నాటి సభలోహాజరైన వేదవేదాంత తత్త్వవేత్తలను, పండితులను,గురువులను శాశ్వతంగా, సులభంగా మోక్షాన్నిచ్చే దేవుడు ఎవరని ప్రశ్నించాడు. సభలోనివారు ఒకరు శివుడని, మరొకరు శ్రీహరి అని,ఒకరు పార్వతి అని, ఇంకొకరు అగ్ని అని రకరకాలుగా వాదించారు.రాజును ఎవరూ నమ్మించలేకపోయారు. మదురానగరంలో ఇలా చర్చ జరుగుతున్నప్పుడు శ్రీవిలుబుత్తూరులోనివిష్ణుచిత్తుడు తన నిత్యాచారం ప్రకారం తులసి మాలలు కట్టి దేవాలయంలోని మన్ననారుస్వామికి సమర్పించడానికి పోయాడు. అతడిని వెంటనే మధురానగరం పొమ్మని స్వామి అంటూ, అక్కడి పాండ్యరాజు కొలువులో జరుగుతున్న శుష్కవాదాలను ఓడించి, తన మహిమను చాటి, అందరినీ గెలిచి బహుమతి తీసుకొమ్మని చెప్పాడు.దేవుడు మాట్లాడగానే ఆశ్చర్య పోయాడు విష్ణుచిత్తుడు. పాండ్యరాజు సభలో అతడుగెలిచేట్లు చేసే బాధ్యత తనదని, ఆయన నిమిత్తమాత్రుడే అని చెప్పాడు.విష్ణుచిత్తుడు వెళ్లిపోయాడు. మధురానగరం పోయిన విష్ణుచిత్తుడు రాజసభలో ప్రవేశించగానే ఆయనకు అంతా గౌరవాభినందనలుచేశారు. రాజుగారు ఆయన్ను ఒక బంగారు పీఠం మీద కూచోబెట్టాడు. సభలోని వారందరి వాదనల్లోనితప్పులను ఎత్తి చూపాడు విష్ణుచిత్తుడు. అందరి వాదాలనూ ఓడించాడు. చివరకు, విశిష్టాద్వైతవాదం పరకారం యాత్ర దేవుళ్లు అంతా విష్ణుదేవుడిఅంశలేనని నిరూపించసాగాడు. అందువల్ల అంశమాత్రులైన ఇతరులను పూజించడం కన్నామోక్షకాముకులు పరిపూర్ణుడైన నారాయణుడిని కొలవడం ఉత్తమం అని తేల్చాడు. ఈ సందర్భంగాఖాండికధ్వజుడు, కేశిధ్వజుడు అనే అన్నదమ్ముల కథ చెప్పాడు. నిమివంశంలో ధర్మధ్వజుడు, కృతధ్వజుడు అనే ఇద్దరు అన్నదమ్ములకుఖాండికధ్వజుడు, కేశిధ్వజుడు అనే ఇద్దరు కుమారులు పుట్టారు.వీరిలో ఖాండికధ్వజుడు కార్యశూరుడు కాగా, కేశిధ్వజుడు విజ్ఞాని. పెరిగి పెద్దైనతరువాత వారిలో ఒకరంటే ఇంకొకరికి అసూయ పెరిగింది. రాజ్యకాంక్ష పెరిగి యుద్ధానికితలపడ్డారు. చివరకు ఖాండికధ్వజుడి సైన్యాన్ని ఓడించి కేశిధ్వజుడు విజయం సాధించాడు. ఖాండిక్యుడుతన పరివారంతో సహా అరణ్యాలకు పోయి అక్కడ వుండసాగాడు. కేశిధ్వజుడు గెలిచినప్పటికీసోదరుడి రాజ్యాన్ని ఆక్రమించుకోకుండా తాను మృత్యువును, పునర్జన్మను జయించాలని యోగనిష్టతో



యజ్ఞాయాగాలు చేస్తూ వ్రతదీక్షలో మునిగిపోయాడు. యజ్ఞంలో బలిపశువుగా రాజు పెంచుకున్న ఆవు ప్రమాదవశాన పులినోట చిక్కికొనవూపిరితో వుండడంతో తన యజ్ఞం ఆగిపోతుందేమోనాన్న భయం పట్టుకుంది రాజుకు.ఏంచేయాలని యజ్ఞం చేయిస్తున్న మునులను అడిగాడు. ఆ ధర్మసూక్ష్మం అరణ్యాలలో వున్నఖాండిక్యుడికి మాత్రమే తెలుసునని అనగానే అతడి దగ్గరికి సపరివారంగా బయల్దేరాడుకేశిధ్వజుడు. అలా వస్తున్న అతడిని, సైన్యాన్ని చూసి,మొదట్లో ఖాండిక్యుడికి, తనమీద యుద్ధానికి వస్తున్నాడేమోనని సోదరుడి మీద అనుమానంవేసింది. కాని అతడొచ్చిన పని చెప్పినతరువాత మంత్రులను సంప్రదించి, తన నిర్ణయంగా సోదరుడికి సహాయం చేయడానికేని శ్చయించుకున్నాడు. యాగానికి ఉద్దేశించిన ఆవు చనిపోతే చేయాల్సినప్రాయశ్చిత్తాన్ని ఖాండిక్యుడు తన సోదరుడికి చెప్పాడు. ఆ తరువాత కేశిధ్వజుడు తనవ్రతం పూర్తి చేసుకున్నాడు. ఆ తరువాత గురుదక్షిణ ఇవ్వాలని అనుకున్నాడు కేశిధ్వజుడు. మళ్లీ అడవికివెళ్ళాడు. ఖాండిక్యుడిని కలిసి గురవైన అతడికి ఏమి ఇవ్వమంటారో సెలవివ్వమని అడిగాడు.ఆధ్యాత్మిక చింతన కలవాడైన కేశిధ్వజుడిని తనకు మోక్షాన్ని ఇచ్చే విద్యనుగురుదక్షిణగా బోధించమని చెప్పాడు. తన రాజ్యం కోరకుండా విద్యను కోరినందుకుసోదరుడిని అభినందిస్తూ, కేశిధ్వజుడు ఆ విద్యను నేర్పాడు. తత్త్వబోధచేశాడు. ఆ తరువాత సోదరుడి కోరిక మేరకు కేశిధ్వజుడు యోగవిద్యను గురించి కూడావివరించాడు. చెప్పాల్సినదంతా చెప్పిన తరువాత తన రాజ్యాన్ని కూడా తీసుకోమ్మన్నాడు.ఖాండిక్యుడు రాజ్యాన్ని స్వీకరించి, తన కొడుక్కు పట్టాభిషేకం చేసి, ప్రజలందరినీ సక్రమంగా పాలించమని చెప్పి,అడవులకు పోయి, అక్కడే భక్తి యోగాభ్యాసం చేసి, విష్ణుమూర్తిని మనసులో దర్శించి,విష్ణువులో కలిసిపోయాడు. ఈ కథను పాండ్యరాజైన మత్స్యధ్వజుడికి చెప్పిన విష్ణుచిత్తుడు, ఆయన్ను కూడా విష్ణుమూర్తిని జపించి తరించమని అన్నాడు. రాజుగారిచెవిలో అద్వైతమాట మంత్రాన్ని రెండు అక్షరాలలో చెప్పి విష్ణుభక్తుడిగా మార్చివేశాడు. మత్స్యధ్వజుడు ఆయనకు అనేక బహుమతులు అందచేశాడు. ఓటమిపాలైన పండితులు కూడాఆయన్ను పొగిడారు, ప్రశంసించారు. రాజాజ్ఞాప్రకారం విష్ణుచిత్తుడిని ఊరేగింపుగాసాగనంపమని చెప్పగా వారు అలాగే చేయడంతో స్వదేశానికి పోసాగాడు. విష్ణుచిత్తుడి భక్తియుక్తులకు మెచ్చిన విష్ణువు ఆయనకుప్రత్యక్షమయ్యాడు. విష్ణుచిత్తుడు తనకు సాక్షాత్కారమైన శ్రీహరిని పరిపరి విధాలుగాస్తుతించాడు. శ్రీహరి అతడిని ఆశీర్వదించి స్వర్గానికి పోయాడు. విశ్వకర్మను పిలిచివిష్ణుచిత్తుడి ఇంటిని సుందర సౌధంగా చేయమని ఆదేశించగా అతడు అలాగే చేశాడు.పురప్రవేశం చేసిన విష్ణుచిత్తుడికి పురప్రముఖులు బ్రహ్మరథం పట్టారు. ఊరేగింపుజరపసాగారు. విష్ణుచిత్తుడు ముందుగా మన్ననారు దేవాలయానికి వెళ్లి భక్తిశ్రద్ధలతోపూజించి, తన ఇంటికి పోయాడు. ఆ మహాసౌదాన్ని చూసిశ్రీమన్నారాయణుడి కృపవల్ల తనకు సిరిసంపదలు లభించాయని భావించాడు.ఈ నేపథ్యంలో ఒకనాడు మన్ననారు దేవాలయంలోని విష్ణుమూర్తివిష్ణుచిత్తుడిని ప్రశంసిస్తూ, ఆయనలాంటి మరో వ్యక్తైన యామునాచార్యుడిప్రసక్తి తెచ్చాడు లక్ష్మీదేవి దగ్గర. అతడి వివరాలు చెప్పమని కోరింది లక్ష్మీదేవి.సమాధానంగా శ్రీహరి ఇలా చెప్పాడు. మధురానగరంలో నాదముని అనే భక్తుడికి మనుమడుగాపుట్టిన యామునాచార్యుడు పరమ భక్తుడు. అప్పట్లో పాండ్యరాజ్యాన్ని పాలిస్తున్న రాజుశైవమత పక్షపాతి. శ్రీహరి విగ్రహాలను పూజించరాదని కట్టడి చేశాడు. దేవాలయాలను పాడుచేశాడు. పాండ్యరాజు భార్య మాత్రం విష్ణు భక్తురాలు. విష్ణు వ్రతాలు చేసేది. విష్ణుభక్తులను కాపాడాలనే ఆలోచన, రాజు వారిని గౌరవించేలా చేయాలన్న భావనశ్రీహరికి కలిగింది. హరిభక్తిని చాటడానికి యామునాచార్యుడిని నియమించాలనుకున్నాడు.రాజు కొలువులో విష్ణు తత్త్వమే పరమ తత్త్వమని వాదించడానికి యామునాచార్యుడు రాణిసహాయం కోరాడు. ఆమె రాజును ఒప్పించింది. మర్నాడు యామునాచార్యుడు సభలో ప్రవేశిస్తూ అక్కడే మొలచిన రావిచెట్టుకునమస్కారం చేసి తాను చేయబోయే వాదనకు ఆ చెట్టే సాక్షి అని అన్నాడు. యామునాచార్యుడు ఆసభలో వున్న అందరి వాదాలను ఒక్కొక్కటిగా సహేతుకంగా ఖండించి విష్ణుమూర్తే పరమాత్మఅని, విశిష్టాద్వైతమే గొప్ప మతం అని నిరూపించాడు.అదే సమయంలో సింహద్వార సమీపంలో ఉన్న రావిచెట్టు అదే విధంగా పలికింది. రాజుగారుయామునాచార్యుడిని మెచ్చుకున్నారు. ఆయనకు సాష్టాంగనమస్కారం చేసి, పూజించి, హరిభక్తి మంత్రోపదేశం పొందాడు.యామునాచార్యుడికి తన చెల్లెలినిచ్చి వివాహం కూడా చేశాడు. అర్ధరాజ్యం ఇచ్చి పట్టాభిషేకంచేశాడు. భక్తితో శ్రీహరిని సేవించసాగాడు. రాజ్యాధికారం చేపట్టిన యామునాచార్యుడుదండయాత్రలు చేసి దిగ్విజయుడై రాజధానికి తిరిగి వచ్చాడు. ఆ తరువాత జరిగినరక్తపాతానికి ప్రాయశ్చిత్తంగా యజ్ఞయాగాదులు చేశాడు. యామునాచార్యుడు ఆధ్యాత్మిక విశేషాలు మరచిపోయి రాజ్యభోగలాలసుడైమోక్షానికి దూరం అవుతున్నాడని శ్రీరామమిశ్రుడు అనే అతడు భావించాడు. అతడినిసంస్కరించాలనుకున్నాడు. ఒకనాడు రాజును కలిసి, ఆయన పూర్వులు సంపాదించిన నిధినిక్షేపాలు, హిందూ మహాసముద్ర జలాల మధ్య దాచబడి వున్నాయని వాటిని చూపించడానికివచ్చానని చెప్పి రాజును సపరివారంగా, సకుటుంబ సమేతంగా తనతో తీసుకు పోయాడు. అంతాశ్రీరంగం చేరి, కావేరీ చంద్ర పుష్కరిణి స్నానం చేసి, శ్రీరంగనాథుడి దర్శనం చేసుకుని పూజించారు. అదే నిక్షేపం అనిచెప్పాడు శ్రీరామమిశ్రుడు. రంగనాథుడి పాదపద్మాలు చూపించాడు. వెంటనేయామునాచార్యుడికి పూర్వాశ్రమ జ్ఞానం కలిగింది. వెంటనే కొడుక్కు రాజ్యం అప్పగించి,రాజనీతి బోధించి, సన్యాసాశ్రమం స్వీకరించాడు. విష్ణుభక్తితోజీవితాన్ని గడిపాడు. ఇదే తన భక్తుల ప్రభావం అని చెప్పాడు శ్రీహరి లక్ష్మీదేవికి. ఇదిలా వుండగా, విష్ణుచిత్తుడి జీవితంలో కొత్త ప్రకరణంప్రారంభం అయింది. ఒకనాడు అలవాటు ప్రకారం తులసీదళాలు కోస్తుంటే, తులసి చెట్ల గుబురుమధ్య ఒక ఆడ శిశువు మెరిసిపోతూ కనిపించింది. బిడ్డలు లేని తనకు విష్ణుమూర్తేబిడ్డను ఇచ్చాడని అనుకుంటూ ఆ శిశువును ఎత్తుకుని ముద్దాడుతూ ఇంటికి వెళ్లి భార్యకుఇచ్చాడు. అల్లారుముద్దుగా పెరిగిన ఆమె యౌవనవతి అయింది. ఆమె విష్ణుచిత్తుడికిదొరికిననాడే మురాళిక, ఏకావళి, హరిణి, మనోజ్ఞ, స్రగ్విణి అనే నాగకన్యలు కూడాపుట్టి ఆమెతో పాటే పెరిగారు. స్నేహితులయ్యారు. విష్ణుచిత్తుడి కూతురు విష్ణువు మీద, ఆయన అవతారమైన శ్రీకృష్ణుడి మీద ప్రేమభావాన్ని పెంచుకోసాగింది. ఆయన్నేపెళ్లి చేసుకోవాలని మనసులో నిశ్చయించుకున్నది. ఆముక్తమాల్యద అనే పేరుకల ఆ కన్య అనునిత్యం ఒక వింతపని చేస్తూవుండేది. తండ్రి దేవుడి కొరకు కట్టిన పూలమాలలను తాను అలంకరించుకొని విష్ణువును తలచుకునేది. నీళ్లలో తన అందాన్నిచూసుకునేది. విరహం పొందేది. తండ్రికి తెలియకుండా ఆ మాలలను బుట్టలో వేసేది. తనతండ్రి తన విషయం తెలియక మరెవరికన్నా ఇచ్చి పెళ్లి చేస్తే, మరో జన్మలోనైనాశ్రీకృష్ణుడినే పెళ్లి చేసుకోవాలని కోరుకుంటూ ఆత్మహత్య చేసుకుంటానని అనేదిస్నేహితురాళ్లతో. ఆమె భర్త ఎక్కడో లేదని, శ్రీరంగంలో ఉన్నాడని, తొందరపడి ఆత్మహత్య చేసుకోవద్దని,రంగనాథుడిని పూజించమని సలహా ఇచ్చారు చెలికత్తెలు. ఆనాటి నుండి ఆ కన్య విష్ణువునేప్రియుడిగా తలచుకుంటూ ప్రేమగీతాలు పాడసాగింది. సూర్యోదయానికి ముందే లేచి పూలమాలలుపట్టుకుని దేవాలయానికి వెళ్లేది. ఇంటికి వచ్చి ఎప్పుడూ ప్రియుడి గురించి ద్రావిడభాషలో పాటలు రాసి పాడుకుంటూ వుండేది. అలా,అలా ఆముక్తమాల్యదలో విరహతాపం ఎక్కువైంది. కూతురు ముఖం రోజురోజుకూ వాడిపోవడం చూసిన విష్ణుచిత్తుడి మనస్సుతరుక్కుపోయింది. వెంటనే దేవాలయానికి వెళ్లి దేవుడి విగ్రహానికి తన బాధనుచెప్పుకున్నాడు. మన్ననారు ఆ భక్తుడి అమాయకతకు చిరునవ్వు లొలికిస్తూ మాలదాసరి కథచెప్పాడు. అతడెలా తన కులవృత్తి చేసుకుంటూనే తనను కీర్తించినదీ, తన విగ్రహాన్ని అలంకరించేదీ, తనసేవకుపాటలు పాడేదీ, తన కైంకర్య ప్రసాదాన్ని దూరం నుండే ఎలా కళ్లకద్దుకుని తీసుకునేదీ వివరించాడు శ్రీహరి.ఒకనాడు చీకటిలో దేవాలయానికి వస్తుండగా ఎలా కుంభజానుడు అనే రాక్షసుడు చేతికిచిక్కినదీ, అతడితో ఎలా పోరాడినదీ, ఓటమి పాలైనదీ, తననుఆహారంగా తీసుకుంటానని బెదిరించగా రాక్షసుడిని ఒప్పించి వైకుంఠదేవాలయానికి వెళ్లి వచ్చినదీ, అక్కడ వ్రతం పూర్తి చేసుకున్నదీ చెప్పాడు శ్రీహరి విష్ణుచిత్తుడికి.దాసరి చీకట్లో అడవి దాటడానికి రాక్షసుడు సహాయం చేశాడు. దాసరి గుడికివెళ్లి భక్తిశ్రద్ధలతో సంకీర్తనచేసి తిరిగివచ్చి తనను ఆహారంగా తీసుకొమ్మనిరాక్షసుడి ఎదుట నిలిచాడు. ఆ బ్రహ్మరాక్షసుడు దాసరి సత్యసంధతకు ఆశ్చర్యపోయాడు. వెంటనేదాసరి చుట్టూ ప్రదక్షిణ చేసి సాష్టాంగనమస్కారం చేశాడు. తనకు శాప విముక్తినికలిగించమని వేడుకున్నాడు. తాను పూర్వ జన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడినని శాపవశానఇలా అయ్యానని చెప్పాడు. దాసరి ఆయన చేసుకున్న పుణ్యాన్ని ధారపోస్తే తనకు శాపవిముక్తి కలుగుతుందన్నాడు. మొదట్లో ఒప్పుకోకపోయినా చివరకు అంగీకరించాడు మాలదాసరి.పుణ్యం, ఫలం అనేవి తనకు తెలియవని, అవి భగవంతుడికే తెలుసని, కాబట్టి భగవంతుడే అతడిని రక్షిస్తాడనిరాక్షసుడికి చెప్పాడు. అంతటితో రాక్షసుడు సోమశర్మగా మారిపోయాడు. అతడు ముక్తిపొంది చివరకు తనలో చేరిపోయాడనిశ్రీహరి చెప్పాడు విష్ణుచిత్తుడికి. తాను చెప్పిన కథ తెలిసిన భూదేవి తనలో చేరాలనే కోరికతో, లక్ష్మీతోసమానమవ్వాలనే కోరికతో విష్ణుచిత్తుడికి కూతురై తననే ప్రేమించి విరహతాపంపొందుతున్నదని చెప్పిన మన్ననారు స్వామి, అతడి కూతురును శ్రీరంగం తీసుకెళ్లిస్వామికి అర్పించమని సూచించాడు. విష్ణుచిత్తుడు శ్రీరంగానికి కూతురుతో సహా పోయాడు.శ్రీరంగనాథుడికి సాష్టాంగదండ ప్రణామాలు ఆచరించాడు. దేవుడిని కీర్తించాడు.శ్రీరంగనాథుడు ఆముక్తమాల్యద మీద తన మనసు ఆపుకోలేక, ఒక మాయా కన్యను సృష్టించి, విష్ణుచిత్తుడి ఇంట్లో వదిలేసి,అక్క వున్న ఆముక్తమాల్యదను తన ఆత్మలోకి తీసుకున్నాడు. ఇంటికి వెళ్లిన విష్ణుచిత్తుడికి తన కూతురు కనిపించింది.మరికాసేపటికి శ్రీరంగనాథుడి పక్షాన పిల్లను ఇవ్వమని అడగడానికి బ్రహ్మ, శివుడు, పార్వతి,ఇంద్రుడు పెళ్లిపెద్దలుగా వచ్చారు. తన జీవితం ధన్యమైందని అన్నాడు విష్ణుచిత్తుడు.తమ ఇంటి ఆచారం ప్రకారం శ్రీరంగనాథుడు పెళ్లికొడుకై సకుటుంబ సపరివార బంధుమిత్రసమేతంగా తన ఇంటికే వచ్చి పెళ్లి చేసుకుని, భార్యను తీసుకెళ్లాలని షరతు పెట్టాడు.దేవతలు దానికి సమ్మతించారు. లగ్నం నిశ్చయించారు. శ్రీవిలుబుత్తూరులో విష్ణుచిత్తుడు కూతురు పెళ్లికి వైభవోపేతంగా ఏర్పాట్లుచేశాడు. శ్రీమహావిష్ణువు పెళ్లికొడుకై గరుత్మంతుడి మీద ఊరేగుతూ వచ్చాడు. దేవతలంతావచ్చారు. శాస్త్రోక్తంగా కన్యాదానం జరిగింది. విష్ణుమూర్తి ఆముక్తమాల్యద మెడలోమంగళసూత్రం కట్టాడు. అంతకు ముందు జీలకర్ర–బెల్లం పెట్టించారు. సప్తపది జరిపించారు.అరుంధతీ దర్శనం చేయించారు. విష్ణుమూర్తిగోదాదేవిని భార్యగా తీసుకుని వైకుంఠానికితరలి వెళ్లాడు. (పోలవరపుశ్రీహరిరావు వచన రచన ఆధారంగా)

# యావత్ నృత్య ప్రపంచానికి తీరనిలోటు!

ప్రముఖ భరతనాట్య,కూచిపూడి, ఒడిస్సీ నృత్య కళాకారిణి పద్మవిభూషణ్ డాక్టర్ యామినీ కృష్ణమూర్తి గారు ( 84) వయో భారం,ఆరోగ్య సమస్యలతో తుదిశ్వాస విడవటం,శివైక్యం పొందడం అనేది నిజంగా యావత్ నృత్య ప్రపంచానికి తీరనిలోటు. ఎందుకంటే చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20 న ముంగర కృష్ణమూర్తి, లక్ష్మి దంపతులకు జన్మించిన యామినీ గారు నృత్యం పై వున్న ఎనలేని మమకారంతో, అమితాశక్తితో అతి చిన్న వయస్సులోనే ఓ డాన్స్ మాస్టర్ దగ్గర డాన్స్ నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత కొద్ది రోజులకు తమిళనాడులోని చిదంబరంలో స్థిర పడ్డారు. అయితే తన తండ్రి ప్రోత్సహంతో ఆమె తన 5 వ ఏటనే చెన్నై లోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించి, ఆ తర్వాత కూచిపూడి, ఒడిస్సీ కూడా అభ్యసించారు.ఇంతటితో ఆగక ఎండీ రామనాథన్ గారి వద్ద కర్ణాటక సంగీతం,కల్పక్కం స్వామినాథన్ గారి దగ్గర వీణ నేర్చుకున్నారు.వీటన్నింటిని బాగా వంట బట్టించుకోని, అయా కళ లన్నింటిలో పరకాయ ప్రవేశం చేసిన యామినీ గారు ఇక ఏ మాత్రం వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. అందులో భాగంగా తన తొలి ప్రదర్శనను తన 17 వ ఏట 1957 చెన్నై లో ఇవ్వడంతో పాటు,కేవలం 20 ఏళ్ల వయసులోనే అత్యంత ప్రతిభావంతురాలైన నర్తకిగా,నాట్య శిరోమణి గా గుర్తింపు తెచ్చుకున్నారు యామినీ గారు. ఇక అంతటితో ఆగక యామినీ భరతనాట్య ప్రతిభ,నైపుణ్యం ఖండా%శీ%తరాలకు దాటింది. అందులో భాగంగా 17 ఏళ్ల వయసులో తొలిసారిగా ఆస్ట్రేలియాలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చి ఇక ఆ తర్వాత అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, ఇండోనేషియా,బ్యాంకాంగ్, సింగపూర్, మయన్మార్ వంటి దేశాల్లో సైతం భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో అక్కడి నాట్య ప్రియులను, నృత్యం అంటే చెవి కోసుకునే అశేష కళాభిమానులను అమోఘంగా ఆకట్టుకోవడంతో పాటు వారిని మంత్ర ముగ్ధలను చేశారు యామినీ గారు.ఇక ఆమె ప్రతిభను మెచ్చి 2014 లో మహిళా దినోత్సవం సందర్భంగా 'శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ' యామినీ గారికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది.అదే మాదిరి తనకు దేవుడిచ్చిన ఈ కళ తనతో పాటు ఎలాంటి పరిస్థితుల్లో అంతరించిపోకూడదు అనే పట్టుదలతో, ఒక ఆశయంతో,కృత నిశ్చయంతో తాను స్థిరపడిన ఢిల్లీ నగరంలోనే ' నృత్య కౌస్తుభ కల్చరల్ సొసైటీ యామినీ స్కూల్ ఆఫ్ డాన్స్ ' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి అందులో యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు న్యూఢిల్లీ లోని 'ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ ' అనే సంస్థకు డైరెక్టర్ గా కూడా ఆమె కొన్నేళ్లు సేవలందించి తన కళను, దాతృత్వాన్ని ఈ విధమైన ఉదాత్తమైన రీతిలో చాలా గొప్పగా చాటుకున్న యామినీ కృష్ణమూర్తి గారు ఎంతైనా అభినందనీయులు,మెచ్చుకోలుకు పాత్రురాలు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదిఏమైన తాను వివాహం సైతం చేసుకోకుండా నాట్య రంగానికే తన పూర్తి జీవితాన్ని అంకితం చేసిన యామినీ గారు తన నృత్య జీవిత విశేషాలను,నృత్యం నేర్చుకునే క్రమంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు,నేర్పించిన గురువుల వివరాలతో ' ఏ ఫ్యాషన్ ఫర్ డాన్స్ ' పేరుతో పుస్తకాన్ని సైతం రచించి తన పేరుకు గొప్ప చరితార్థికతను లిఖించుకున్నారు ఈ యామినీ గారు.ఏమైనా యామినీ కృష్ణమూర్తి గారు దేశ,విదేశాల్లో తాను నేర్చుకున్న కూచిపూడి నృత్యానికి ఎంతో పేరు, ప్రఖ్యాతలు తెచ్చిపెట్టి మన భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేశారు. ఇక ఆమె యొక్క గొప్ప ప్రత్యేకత ఏమంటే కర్ణాటక సంగీతానికి సంబంధించిన పాట పాడుతూ నృత్య ప్రదర్శనలు ఇవ్వడంలో మేటిగా, భేష్ గా నిలువడం యామినీ గారి నృత్య జీవితానికి ఓ కలికితురాయి వంటిది. దీంతో భరత



నాట్యానికి ఆమె అందించిన అసాధారణ సేవలను గుర్తించి మన కేంద్రప్రభుత్వం వారు యామినీ గారికి 1968 లో పద్మశ్రీ, 2001 లో పద్మభూషణ్, 2016 లో పద్మవిభూషణ్ లతో సత్కరించారు. అంతేకాదు నాట్యమయూరి అయిన యామినీ గారు టీటీడీ ఆస్థాన నర్తకిగా కూడా కొనసాగి అందరిచేత శెభాష్ అనిపించుకున్నారు.అన్నింటికి మించి భరతనాట్య విద్వాంసురాలు యామినీ కృష్ణమూర్తి గారి శాశ్వత నిష్క్రమణ,ఆమె కానరాని లోకాలకు తరలివెళ్లిన నేపథ్యంలో ఆమె మృతి పట్ల కేంద సంగీత నాటక అకాడమీ దాని అనుబంధ సంస్థలు తీవ్ర సంతాపం వ్యక్తం చేయడంతో పాటు,యామినీ గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వారు వ్యక్తం చేయడం వెరసి యామినీ కృష్ణమూర్తి గారు లేని లోటు నిజంగా ఖచ్చితంగా యావత్ నృత్య రంగానికి పూడ్చలేనిది అనే కఠోర వాస్తవం, చేదు నిజం మనందరికీ బాగా బోధపడుతున్నది అనే మాట సత్య దూరం కాదు. ఎంతైనా ఇలాంటి మహోన్నత మహిళలకు జన్మనిచ్చిన మన భరతభూమి ఎంతో పుణ్యం చేసుకుంది అనడంలో ఎలాంటి సందేహనికి తావు లేదు.అమర్ రహే,అమర్ రహే భరతనాట్య ప్రవీణురాలు యామినీ కృష్ణమూర్తి గారు! జై హింద్! మేరా భారత్ మహాన్!

**బుగ్గన మధు సూధనా రెడ్డి**
**9000369660**

# పుస్తకాల తోటలో

**నిర్వహణ: డా: అమ్మినఏతెలుగుసేవకుడు:7729883223**

ఉన్నత పాఠశాల దశ పిల్లలకు పాఠ్యాంశాలే పరమావధిగా పరీక్షలే ప్రధానం అయిన వేళ చదువులలో భాగమైన సృజనను కథలుగా తీర్చిదిద్దుతున్న గురువులు కూడా ఉండటం నేటి ఆధునిక విద్యా వ్యవస్థకు ఉన్న అదనపు సృజనబలం. అందులో భాగంగానే సూర్యపేట జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక స్థలం "దక్షిణ కాశీ"గా పిలవబడే "మేళ్లచెరువు" జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ వర్ధమాన బాల సాహితీ కథకుడు ముక్కామల జానకిరామ్ తమ పాఠశాలలోని విద్యార్థుల్లో గల కథకులను పసిగట్టి తనదైన బాణిలో సానబట్టి తెలుగు బాలసాహితీ క్షేత్రానికి మరికొందరు భావి రచయితలను అందించే సత్ సంకల్పంతో వెలువరించిందే "ఊహలకు రెక్కలు వస్తే .."కథా సంకలనం, జానకిరామ్ సంపాదకత్వంలో వెలువడిన ఈ సంకలనంలో మొత్తం 33 కథలు మనం చదవవచ్చు, అన్ని కథలు ఆరు నుంచి పదవ తరగతి చదివే విద్యార్థులు వ్రాసినవే!! ఈ కథల్లోని వస్తువులు అన్నీ పిల్లల నిజ జీవితాలకు అద్దం పడతాయి, ఈ సంకలనం చదివిన పాఠకులకు చక్కని సంతృప్తి కలగడమే కాదు, ఈ కథలు రాసిన చిన్నారులకు జీవితాంతం మిగిలిపోయే మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. పరుల సొమ్ము బరువును తెలిపే "రిషిత నిజాయితీ", పర్యావరణ ప్రాధాన్యత తెలుపుతూ బాల్య దశ నుంచే దాని ఆవశ్యకత అందరూ తెలుసుకోవాలి అనే ముందుచూపు చూపించే కథ "ఆకుపచ్చ ఆలోచన" ఆపదలో గల శత్రువును సైతం సంరక్షించాలి అనే చక్కని నీతిని పంచే కథ "కోకిల



చిలుక స్నేహం", దీనిలో మైత్రి విలువను కూడా ఎంచక్కా చెప్పింది ఈ కథ. పిల్లలు ఉన్నతంగా ఎదగడానికి చిన్నపాటి ప్రోత్సాహం ఎంత చక్కగా సహకరిస్తుందో కళ్ళకు కట్టినట్టు చెబుతుంది "ప్రోత్సాహం" కథలో సారంగి మహిత, సొంత అధ్యయనం సొంత ఆస్తి ద్వారా వచ్చే విజ్ఞానం సుఖం ఎలాంటి ఆత్మ సంతృప్తిని ఇస్తాయో పిల్లలకు విడమర్చి చెబుతుంది మెర్రిమేకల నాగేశ్వరి "తప్పు తెలుసుకున్న ఇందు" కథలో, విద్య యొక్క విలువ చెబుతూ దాని ద్వారా ఎలాంటి లాభం సొంతంగా పొందవచ్చు చెబుతూ బాలికలకు చక్కని ఆత్మస్థైర్యం నింపింది సారంగి మహిత తన స్వీయ అనుభవపు "దటీజ్ మహీ" కథలో . ఇదే కోవకు చెందిన మరో కథ ఆరవ తరగతి విద్యార్థిని తూరపాటి శైలజ రాసిన "అమ్మ బడికి వెళ్తా".. ఇటీవల విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి సాంప్రదాయాలు అయిన పండుగలు పర్వదినాల సందర్భంగా ఆయా వాతావరణం కలిగిస్తూ నమూనా పండుగల కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించడం నేటి విద్యాలయాల్లో వచ్చిన ఆదర్శనీయమైన మార్పు, దీనికి సంబంధించిన నేపధ్యపు కథను కూడా మంచి నీతిని జోడించి సోమ గాని చంద్ర తేజ అనే ఆరవ తరగతి విద్యార్థిని వ్రాసిన "బతుకమ్మ సంబరాలు" అనే కథ, ఇలా ప్రతి కథను చిన్నారులు "పిట్టకొంచెం కూత ఘనం" అన్న చందంగా తీర్చిదిద్ది మన తెలుగు బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. పుస్తక సంపాదకుడు ముక్కామల జానకిరామ్ అందించిన మేళ్లచెరువు గ్రామ చరిత్ర ఈ పుస్తకానికే తలమానికం, ఇలా ప్రతి ఉపాధ్యాయుడు అధ్యాపకుడు స్థానిక చరిత్రల కథలను అక్షరబద్ధం చేయడం సముచితం.

ఊహలకు రెక్కలొ స్తే... (పిల్లల కథా సంకలనం), పేజీలు: 80, వెల:100/–రూ, ప్రతులకు: ముక్కామల జానకిరామ్ (సంపాదకుడు) సెల్:63053 93291.

## జ్ఞాపకాలు పాతవే



కాకి ఎంగిలి తిన్న
బెల్లపు ముక్క తీపి జ్ఞాపకం!
కళ్లు మూసి ఆడే ఆటన
ముక్కు గిల్లిన జ్ఞాపకం!
నెలవంకను చూసాననే వంకతో
ఆమె ముఖం చూసిన జ్ఞాపకం!
ఓణీ కొన పట్టుకొని
ఆనందపు అంచుకు చేరిన జ్ఞాపకం!
కబడ్డీ ఆటలో పడిపోయినా
పట్టు వీడని జ్ఞాపకం!
కళ్లలో కళ్ళు పెట్టి
కట్టి పడేసిన జ్ఞాపకం!
తన వేలు తెగితే
నోట్లో పెట్టుకొని రక్తం
ఆపిన జ్ఞాపకం!
తన కనుపాపల్లో
నా రూపం చూసిన జ్ఞాపకం!
ఆ రోజు ...
ఓ రోజా పూవు ఇచ్చి
నేను నిన్ను ప్రేమించానని
చెప్పినపుడుజి
నేను కూడా....
అని ఆమె చెప్పిన జ్ఞాపకం!
ఆమె పెళ్లి చేసుకొని
వెళ్ళిన రోజు
కన్నీటి చుక్క నీడన
ఆమె రూపం మసక మసకగా
ఇంకా జ్ఞాపకమే....
అన్నీ పాత జ్ఞాపకాలే
గుర్తుకొస్తున్నాయిజి
మళ్ళీ మళ్ళీ కొత్తగా!!

**జగయ్య.జి**
**9849525802**

# పరుగులు తీస్తున్న పసిడి

హైదరాబాద్ ... మరో రెండు నెలల్లో అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేటు భారీగా పెరిగింది. అయితే, లాభాల స్వీకరణ కొద్దిగా కిందకు దిగి వచ్చింది, %వి%2,500 దిగువన ఉంది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,486 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మన దేశంలో, ఈ రోజు బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అయినప్పటికీ, బిస్కట్ గోల్డ్ రేటు రూ.70,500 పైనే (పన్నులు లేకుండా) పలుకుతోంది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ? 70,580 వద్దకుబీ 22 క్యారెట్ల బం గారం ధర ? 64,700 వద్దకుబీ 18 క్యారె ట్ల బంగారం ధర ? 52,940 వద్దకు చేరిందాది. కిలో వెండి ధర హైదరాబాద్ మా ర్కెట్లో ? 90,900 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. ఆంధ్రప్రదేశ్లో బంగారం, వెండి ధరలు విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ? 70,580 వద్దకుబీ 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర ? 64,700 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర ? 52,940 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర ? 90, 900 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.



## ప్లాట్‌ఫామ్ ఫీజుతో జొమాటోకు రూ.83 కోట్ల ఆదాయం




ప్రముఖ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటో ప్లాట్ఫామ్ ఫీజు రూపంలో ఈ ఏడాది మార్చి నాటికి రూ.83 కోట్లు వసూలు చేసింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ రుసుమును కస్టమర్ల ఆర్డర్లపై విధిస్తున్న విషయం తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం పుంజుకోవడానికి ఈ ఫీజూ ఒక కారణమని కంపెనీ తెలిపింది. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక ఏడాదిలో జొమాటో సర్దుబాటు చేసిన ఆదాయం 27 శాతం పెరిగి రూ.7,792 కోట్లకు పెరిగింది.గోల్డ్ కస్టమర్లకు ఇచ్చే ఉచిత డెలివరీ వల్ల కొంత రాబడి తగ్గింది.అయితే అధిక ఆదాయం ప్లాట్ఫామ్ ఫీజు, ఆర్డర్ల సంఖ్య పెరగడం సహా ఇతర మార్గాల ద్వారా సమకూరిందని జొమాటో ) తెలిపింది. మరోవైపు గత ఏడాదిలో రాత్రి పొద్దుపోయాక వచ్చిన ఆర్డర్లలో అత్యధికం దిల్లీ నుంచేనని తెలిపింది. ఉదయం అల్పాహారం ఆర్డర్లు బెంగళూరు నుంచి ఎక్కువగా అందాయని వెల్లడించింది.జొమాటో గత ఏడాది ఆగస్టు నుంచి ఆర్డర్పై రూ.రెండుతో ప్లాట్ఫామ్ ఫీజు వసూలు చేయడాన్ని ప్రారంభించింది. క్రమంగా దాన్ని కీలక నగరాల్లో రూ.ఆరుకు పెంచింది. దీని ప్రత్యర్థి సంస్థ స్విగ్గీ సైతం ఈ తరహా రుసుము వసూలు చేస్తోంది. తద్వారా ఈ సంస్థలు తమ లాభదాయకతను పెంచుకునేందుకు యత్నిస్తున్నాయి.

## హైదరాబాద్‌లో వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా వాకథాన్




హైదరాబాద్ : జాతీయ వాస్కులర్ దే సందర్భంగా, అవయవ తొలగింపు నివారణ మరియు రక్త నాళ (వాస్కులర్) ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించటం కోసం వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (విఎస్ఐ) హైదరాబాద్లో వాకథాన్ ను నిర్వహించింది. ఈ వాకథాన్లో 350-400 మంది నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దుర్గం చెరువు లేక్ ఫ్రంట్ పార్క్ వద్ద ఈ వాక్ జరిగింది. హైదరాబాద్తో సహా 30 నగరాల్లో నిర్వహించిన ఈ జాతీయ వాక్థాన్లో 15,000 మందికి పైగా పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 1 మిలియన్ కు పైగా వ్యక్తులకు అవయవాలను తొలగించటం జరుగుతుంది. వీటిలో అధిక శాతం ముందస్తు జోక్యం మరియు ప్రమాద కారకాల సరైన నిర్వహణ ద్వారా నివారించబడుతుంది. భారతదేశంలో, దాదాపు 40-50% అవయవ తొలగింపు కేసులలో రక్తనాళాల వ్యాధులు, ముఖ్యంగా మధుమేహం కారణమవుతుంది. హై బ్లడ్ షుగర్, హైపర్టెన్షన్ మరియు అధిక కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాలను నిర్వహించడానికి అవగాహన మరియు నివారణ చర్యల యొక్క క్లిష్టమైన అవసరాన్ని ఇది వెల్లడి చేస్తుంది. వాక్థాన్ను ప్రారంభించిన, వాస్కులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ చెవుటూరు మాట్లాడుతూ, "అవయవాలను కోల్పోవటానికి పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్ ప్రధాన కారణం, ఇది గాయాల కారణముగా కోల్పోతున్న అవయవాలలో పోలిస్తే దాదాపు ఎనిమిది రెట్లు అధికంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో, అవయవ తొలగింపు-రహిత భవిష్యత్తు అనే భాగస్వామ్య లక్ష్యంతో జరిగిన ఈ వాక్థాన్లో పాల్గొన్న వ్యక్తులు ఫిట్నెస్ను ప్రోత్సహించడానికి మరియు వాస్కులర్ వ్యాధులకు వ్యతిరేకంగా ర్యాలీ చేయడానికి చేతులు కలిపారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రారంభించిన ఈ కార్యక్రమం అవయవ తొలగింపును నివారించడంలో ముందస్తు జోక్యం మరియు వాస్కులర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం యొక్క ఆవశ్యకతను నొక్కి చెప్పింది" అని అన్నారు. ఈ కార్యక్రమం పై వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ డాక్టర్ తపిష్ సాహు మాట్లాడుతూ, "అవయవ తొలగింపు రహిత భారతదేశం కోసం కృషి చేస్తూ, సమగ్ర వాస్కులర్ ఆరోగ్య సంరక్షణ కార్యాచరణను ఏర్పాటు చేయడం ద్వారా సమాజ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మా లక్ష్యం. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలకు వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ప్రోత్సాహకరంగా ఉంది. ఇంతటి మహోన్నత కారణం కోసం చాలా మంది కలిసి రావడం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ వాక్థాన్ వాస్కులర్ హెల్త్ యొక్క ప్రాముఖ్యతను వెల్లడించటమే కాకుండా మార్పును నడిపించడంలో సంఘం యొక్క శక్తిని కూడా నొక్కి చెబుతుంది..." అని అన్నారు. "భారతదేశంలో నివారించగల అవయవ తొలగింపు ను తగ్గించాలానే మా లక్ష్యంలో నేటి కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయి" అని వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పి సి గుప్తా అన్నారు. "దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తుల భాగస్వామ్యం, వాస్కులర్ ఆరోగ్యం పట్ల పెరుగుతున్న నిబద్ధతను మరియు అర్థవంతమైన మార్పును నడపడంలో సామూహిక చర్య యొక్క శక్తిని ప్రదర్శిస్తుంది" అని అన్నారు. వాస్కులర్ వ్యాధులను నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయటం మరియు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించడం వంటి బహుముఖ విధానం అనుసరించడం అవసరం. పండ్లు, కూరగాయలు మరియు తృణధాన్యాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానం మరియు అధిక మద్యపానానికి దూరంగా ఉండటం, రక్తనాళాల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, మందులు మరియు జీవనశైలి మార్పుల ద్వారా అంతర్లీన జీవనశైలి పరిస్థితులను నిర్వహించడం వాస్కులర్ సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ నివారణ చర్యలు మరియు వాస్కులర్ ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం మరియు చికిత్స చేయడం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడానికి అవగాహన ప్రచారాలు మరియు విద్యా కార్యక్రమాలు నిర్వహించటం చాలా అవసరం.వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ వాస్కులర్ సొసైటీస్ యొక్క ప్రముఖ విభాగం, వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా. వైద్య నిపుణులు, సర్జన్లు, ఇంటర్వెన్షనలిస్టు, నర్సులు మరియు అనుబంధ ఆరోగ్య నిపుణుల విస్తృత నెట్వర్క్తో ఇది భాగస్వామ్యం చేసుకుంది. వీరంతా అవయవాలను మరియు ప్రాణాలను రక్షించే కారణానికి అంకితం చేయబడి ఉన్నారు. దేశవ్యాప్తంగా 700 మందికి పైగా క్రియాశీల సభ్యులతో, విఎస్ఐ ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైన అధ్యాయాలలో ఒకటిగా నిలిచింది, నిరోధించదగిన అవయవ తొలగింపును తగ్గించడానికి మరియు వాస్కులర్ హెల్త్ డొమైన్లో రోగుల సంరక్షణను మెరుగుపరచడానికి స్థిరంగా పని చేస్తుంది

## వడ్డీరేట్లలో మార్పులు ఉండబోవు.. నిపుణుల అంచనా




న్యూఢిల్లీ : కీలకంగా పరిగణించే రెపోరేటు ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.5శాతం వద్దే యథాతథంగా కొనసాగించే అవకాశం ఉందని ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుతం వడ్డీ రేట్లను అలాగే ఉంచాలని నిర్ణయం తీసుకుంది. రానున్న నెలల్లో ద్రవ్య విధాన సడలింపులు ఉండనున్నట్లు సూచనలు జారీ చేసింది. దీంతో వడ్డీ రేట్లు పెరగక పోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వడ్డీరేట్ల సవరణ విషయంలో ఆర్బీఐ.. అమెరికా ద్రవ్య విధాన వైఖరిని నిశితంగా పరిశీలిస్తోంది. వడ్డీ రేటు 6.5శాతం వద్ద ఉన్నప్పటికీ ఆర్థిక వృద్ధి పుంజుకుంటున్నందున మానిటరీ పాలసీ కమిటీ కూడా రేటు తగ్గింపునకు దూరంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో 'ద్రవ్య పరపతి విధాన కిమిటీ ' ఆగస్టు 6- 8 మధ్య సమావేశం కానుంది. సమావేశ నిర్ణయాలను ఆగస్టు 8న దాస్ ప్రకటించనున్నారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## మార్కెట్లో తక్కువ ధరలోనే క్యూటెస్ట్ ఈవీ స్కూటర్



భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుంది. పెరుగుతున్న పెట్రోల్ ధరల దెబ్బకు సామాన్యులు ఈవీలను ఆశ్రయిస్తుంటే, ప్రభుత్వాలు కూడా కాలుష్యం నుంచి రక్షణకు ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు చాలా కంపెనీలు మార్కెట్లో ఈవీ వాహనాలను లాంచ్ చేస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలనే టార్గెట్ చేస్తూ స్టార్టప్ ఈవీ కంపెనీలు సూపర్ ఫీచర్లతో తక్కువ ధరలోనే ఈవీలనను అందుబాటులోకి తెస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ గోదావరి ఎలక్ట్రిక్ మోటర్స్ ఫ్యామిలీ ఈ-స్కూటర్కు సంబంధించిన కొత్త వేరియంట్ అయిన ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్సును మార్కెట్లోకి లాంచ్ చేసింది. కేవలం రూ.99,999 ఎక్స్-షోరూమ్ ధరతో రిలీజ్ చేసిన ఈ స్కూటర్ కచ్చితంగా మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకుంటుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్స్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్స్ గోదావరి ఎలక్ట్రిక్ మోటర్స్కు సంబంధించి రెండో మోడల్ అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్స్ మోడల్ స్కూటర్ను మొదటి సారిగా భారత్ గ్లోబల్ మొబిలిటీ ఎక్స్పో 2024 లో ఆవిష్కరించారు. ఈ స్కూటర్లో 28 లీటర్ల స్టోరేజ్ స్పేస్తో పాటు 2.36 కేడబ్ల్యూ బ్యాటరీతో 110 కిమీ పరిధిని అందిస్తుంది. ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్స్ స్కూటర్ కస్టమర్ల ఫీడ్ బ్యాక్ ఆధారంగా రిలీజ్ చేశామని గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ సీఈఓ హైదర్ ఖాన్ తెలిపారు. ఈ స్కూటర్ రైడర్లకు అత్యుత్తమ సౌకర్యాన్ని అందిస్తుందని వివరిస్తున్నారు. ఈ స్కూటర్ను భారతదేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. భారతదేశంలో ఇబ్లూ ఎఫ్ఈఓ ఎక్స్ స్కూటర్కు సంబంధించిన ప్రీ ఆర్డర్లు తీసుకుంటున్నామని వివరించారు. ముఖ్యంగా గోదావరి ఎలక్ట్రిక్ మోటర్స్ కంపెనీ తన డీలర్ నెట్వర్కును విస్తరించడానికి ప్రణాళికలను రచిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశవ్యాప్తంగా 74 డీలర్షిప్లను 100 డీలర్లకు పెంచాలని యోచిస్తోంది. గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ ప్రస్తుతం ఇబ్లూ ఎఫ్ఈఓ (ఈ2డబ్ల్యూ), ఇబ్లూ రోజ్ (ఈ3డబ్ల్యూ- ఎల్5ఎం), ఇబ్లూ స్పిన్, ఇబ్లూ థ్రిల్ వంటి ఈ-సైకిళ్లతో సహా అనేక రకాల ఎలక్ట్రిక్ వాహనాలను అమ్మకాలు సాగిస్తుంది.

## ఐఫోన్ 14 ప్లస్పై రూ. 24,000 తగ్గింపు



యాపిల్ ఐఫోన్.. ప్రపంచంలో అత్యంత డిమాండ్ ఉన్న ప్రీమియం స్మార్ట్ ఫోన్. మన దేశంలో అయితే ఈ ఐఫోన్ కలిగి ఉండటమే అదో స్టేటస్ సింబల్ గా ఫీల్ అయ్యే వారు ఉన్నారు. ఈ క్రమంలో యాపిల్ కూడా తన ఫోన్ల ను మిగిలిన అన్ని బ్రాండ్ల కన్నా ప్రత్యేకంగా ఉంచడంలో విజయవంతం అవుతోంది. ఈ క్రమంలో యాపిల్ సంస్థ వచ్చే సెప్టెంబర్ మాసంలో ఐఫోన్ 16 సిరీస్ ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే దాని కన్నా ముందు ఇప్పుడు ఐఫోన్ 15 సిరీస్, 14 సిరీస్ వంటి మోడళ్లపై మన దేశంలో భారీ డిస్కౌంట్లు అందుబాటులోకి వచ్చాయి. మన దేశంలోని పలు ఆన్ లైన్ ప్లాట్ ఫారం అంటే అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సంస్థలు భారీ ఆఫర్లను అందిస్తున్నాయి. ఆసక్తికరంగా, ఐఫోన్ 14 ప్లస్ ప్రస్తుతం ఇ-కామర్స్ ప్లాట్ఫామ్ ఫ్లిప్కార్ట్లో ఐఫోన్ 14 కంటే సరసమైన ధరకు లభిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. ఐఫోన్ 14 ప్లస్పై తగ్గింపు ఇలా..ఫ్లిప్ కార్ట్ లో యాపిల్ ఐఫోన్ 14 ప్లస్ పై భారీ డిస్కౌంట్ అందిస్తోంది. దీనిని మీరు ఇప్పుడు రూ. 56,000 కంటే తక్కువకే దక్కించుకోవచ్చు. అధికారిక యాపిల్ వెబ్సైట్లో ఐఫోన్ 14 ప్లస్ రూ. 79,600కి లిస్ట్ చేసి ఉంది. అయితే మీరు ఫ్లిప్కార్ట్ ద్వారా స్మార్ట్ఫోన్ కొనుగోలుపై కొనుగోలుదారులు రూ.23,101 వరకూ ఆదా చేసుకోవచ్చు. స్మార్ట్ఫోన్ బేస్ వేరియంట్ ఇ-కామర్స్ ప్లాట్ఫారమ్లో రూ. 56,499కి అందుబాటులో ఉంది.దీంతో పాటు యూపీఐ ద్వారా చెల్లింపు చేసేటప్పుడు కొనుగోలుదారులు రూ. 1,000 అదనపు తగ్గింపును కూడా క్లెయిమ్ చేయవచ్చు. ఈ ఆఫర్ తో కలిపి ఐఫోన్ 14 ప్లస్ ను మీరు కేవలం రూ.55,499కే కొనుగోలు చేయొచ్చు. ఐఫోన్ 14 ప్లస్ స్పెసిఫికేషన్స్.. ఐఫోన్ 14 ప్లస్ స్లిమ్ బెజెల్స్, వైడ్ కలర్ గామట్, హెచ్డీఆర్, 1200 నిట్స్ బ్రైట్నెస్తో పెద్ద 6.7-అంగుళాల స్క్రీన్ సూపర్ రెటినా ఎక్స్డీఆర్ ఓఎల్ఈడీ ఓఎల్ఈడీ డిస్ప్లేను కలిగి ఉంటుంది. డాల్బీ విజన్ను కూడా కలిగి ఉంది. డిస్ప్లే దెబ్బతినకుండా రక్షించడానికి, ఇది సిరామిక్ షీల్డ్ గ్లాస్ ప్రొటెక్షన్తో ఉంటుంది. ఏ15 బయోనిక్ చిప్సెట్ ద్వారా శక్తి పొందుతుంది. గ్రాఫిక్స్ కోసం 16-కోర్ ఎన్పీయూ 5-కోర్ జీపీయూతో జత చేసి ఉంటుంది. ఐఫోన్ 14 ప్లస్ వెనుక డ్యూయల్ 12-మెగాపిక్సెల్ కెమెరా సిస్టమ్తో వస్తుంది. సెల్ఫీలు, వీడియో కాల్ల కోసం ముందు భాగంలో 12-మెగాపిక్సెల్ కెమెరా ఉంటుంది. ఐఫోన్ 14 ప్లస్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే సులభంగా ఒక రోజంతా ఉంటుంది. ఐఫోన్ మోడల్లు మునుపటితో పోలిస్తే మెరుగైన బ్యాటరీ పనితీరును అందిస్తున్నాయని కంపెనీ పేర్కొంది.

## సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్

హైదరాబాద్ : హైదరాబాద్లో కిక్కిరిసిన ఆడిటోరియంలో ప్రేక్షకుల ఆనందోత్సాహాల నడుమ జరిగిన సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ అపూర్వ విజయం సాధించింది. హిందుస్థానీ కళ, సంస్కృతి మరియు సాహిత్యాన్ని వేడుక చేసుకునే అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాలలో ఒకటైన సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-ఆదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ (జిఓఐ) మరియు పర్యాటక మంత్రిత్వ శాఖ (జిఓఐ) సహకారంతో నిర్వహిస్తున్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ మద్దతుతో ఈ సాంస్కృతిక కార్యక్రమం హైదరాబాద్లో నిర్వహించబడింది.పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్ మానూ గౌరవనీయ వైస్-ఛాన్సలర్, ప్రొ. ఐనుల్ హసన్ బీ ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ సెయెద్ ఇ. హస్నైన్‌బీ తెలంగాణ కస్టమ్స్ మరియు జీఎస్టీ ప్రధాన కమిషనర్, సందీప్ ప్రకాష్ బీ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్, ఆంధ్ర మరియు తెలంగాణ శ్రీమతి మితాలి మధుమిత బీ జష్న్-ఎ-అదాబ్, అధ్యక్షుడు శ్రీ నవనీత్ సోనీ , మరియు కవి మరియు సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ సింగ్ తో సహా విశిష్ట అతిథులు హాజరు కాగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో దెక్కనీ ఉర్దూపై పర్షియన్ ప్రభావాన్ని అన్వేషిస్తూ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ మరియు అజ్మ్ షాకిరీలతో 'దెక్కనీ ఉర్దూ మే ఫార్సీ కే అస్రాత్'పై చర్చా కార్యక్రమం జరిగింది. మరో ప్యానెల్ చర్చ కార్యక్రమంలో కులీ కుతుబ్ షా, హైదరాబాద్, ఔర్ దక్కనీ అదాబ్ ఈ ప్రాంతంలోని గొప్ప కవిత్వ సంప్రదాయాన్ని ఎత్తిచూపారు.దక్షిణ భారతదేశానికి చెందిన లతీఫుద్దీన్ లతీఫ్, వాహెద్ పాషా క్వాద్రీ, షాహెద్ అదీలీ, మీర్ బిద్రీ, చాచా పాల్మూరి, ఫరీద్ సహర్ మరియు హమీద్ సాలీ వంటి ప్రముఖ కవులు చేసిన దక్కనీ షేరీ మెహఫిల్ అద్భుతమైన విజయాన్ని సాధించింది.డా.విద్యా షా ఆత్మీయ స్వరంలో దాద్రా, తుమ్రీ, గజల్తో కార్యక్రమం సంగీత మలుపు తిరిగడంతో ప్రజలు ఆనందోత్సాహాలతో ఊగిపోయారు. అత్యంత ప్రజాదరణ పొందిన వార్సీ బ్రదర్స్ యొక్క శక్తివంతమైన ఖవ్వాలీ ప్రదర్శనతో సాయంత్రం ముగిసింది.యువ కవిత్వ ఔత్సాహికులు మరియు ప్రతిభావంతు ఉర్దూ కవిత్వం యొక్క వేగవంతమైన ఆట ' బైత్బాజీ' లో పాల్గొన్నారు. డాక్టర్ మమతా జోషి తన అందమైన పాటల ద్వారా హృదయాన్ని కదిలించే సూఫీ కలామ్లకు వందనం సమర్పించారు. అహ్మద్ రషీద్ షేర్వానీ ఉర్దూలో శ్రీమద్ భగవద్గీత పఠనం మన గంగా-జమునీ తహజీబ్కు నిజమైన వందనంగా నిలిచింది. 'నృత్య ధార'తో జాతీయ అవార్డు గ్రహీత కూచిపూడి నృత్యకారిణి యామినీరెడ్డి హిందుస్థానీ నాట్య వైభవాన్ని ప్రదర్శించారు.ప్రముఖ నటీనటులు అమిల్ సియాల్, మను రిషి చద్దా మరియు ఫైసల్ మాలిక్ లతో జరిగిన 'సినిమా ఓటిటి మరియు థియేటర్: సమాజిక్ సరోకర్ యా మనోరంజన్' అనే ప్యానెల్ చర్చలో ప్రియమైన నటీనటులు చర్చను వినడానికి యువత ప్రత్యేకించి అధిక సంఖ్యలో వచ్చారు.



మెహ్ఫిల్-ఎ-సుఖన్: ముషైరా మరియు కవి సమ్మేళనం జరిగింది. ఇక్కడ పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్, మదన్ మోహన్ డానిష్, తాహిర్ ఫరాజ్, మోయెన్ షాదాబ్ వంటి లెజండరి కవులతో పాటుగా సుదీర్ఘమైన ఇతర భారతీయ కవులు మరియు షాయార్లు పాల్గొనటం తో వేడుక ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమం గురించి కవి మరియు సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ వ్యవస్థాపకుడు కున్వర్ రంజీత్ చౌహాన్ మాట్లాడుతూ, "సాహిత్యోత్సవ్ జష్న్-ఎ-అదాబ్ కల్చరల్ కార్వాన్ విరాసత్ మన సాంస్కృతిక వారసత్వం మరియు హిందుస్థానీ కళ యొక్క వైభవాన్ని వేడుక చేసుకోవటానికి నిర్వహించబడింది. ఈ రోజు మనం గడుపుతున్న అస్తవ్యస్తమైన జీవితాల్లో ఆత్మీయత మరియు శాంతిని నింపడంలో ఇవి ఎంత ఉపయోగకరంగా ఉన్నాయో భారతదేశంలో మరియు ప్రపంచం దాటిన ఎక్కువ మంది ప్రజలు గ్రహించడం చాలా ముఖ్యం. ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్ళటానికి మేము తీవ్ర ప్రయత్నాలను చేస్తున్నాము. సంస్కృతిని ఎంతో అందంగా పరిరక్షించడంలో పేరుగాంచిన హైదరాబాద్లో మా కార్యక్రమాన్ని నిర్వహించడం నిజంగా సంతోషంగా వుంది. ఈ కళాకారుల ప్రతిభను వీక్షించమని మేము ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నాము. భారతీయ యువతను మన హిందుస్థానీ కళ, సంస్కృతి మరియు సాహిత్యం యొక్క చైతన్యంతో అనుసంధానించడం మరియు అర్థవంతమైన కళకు చేరువ చేయటం మా లక్ష్యం. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ (జిఓఐ) మరియు పర్యాటక మంత్రిత్వ శాఖ %-% ఇన్క్రెడిబుల్ ఇండియా (జిఓఐ) యొక్క అమూల్యమైన మద్దతుకు మేము కృతజ్ఞులం. ఈ కార్యక్రమాన్ని సాధ్యం చేయడంలో మద్దతు ఇచ్చినందుకుమానూకి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము" అని అన్నారు.

## సమతుల ఆహారంతో హెపటైటిస్ నివారణ



ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. వైరల్ హెపటైటిస్ గురించి అవగాహన పెంచడం తో పాటుగా ఈ సంభావ్య ప్రాణాంతక వ్యాధిని నిరోధించడానికి మరియు నియంత్రించడానికి చర్యలను ప్రోత్సహించే లక్ష్యంతో ఇది రూపొందించబడిందని డాక్టర్ బి సందీప్ , గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, విజయవాడ అన్నారు. కాలేయ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం చాలా అవసరం. సంపూర్ణ ఆరోగ్యం పొందటం లో ఇది అత్యంత కీలకం. జీర్ణక్రియ, నిర్విషీకరణ మరియు పోషకాల నిల్వకు బాధ్యత వహించే శక్తివంతమైన అవయవం, కాలేయం. దాని ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, మీ జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుందని వివరించారు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు మరియు లీన్ ప్రోటీన్లతో కూడిన సమతుల్య ఆహారం కాలేయ పనితీరును మెరుగు పరుస్తుంది. మితిమీరిన ఆల్కహాల్ మరియు కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండటం వలన కాలేయ వ్యాధులైన ఫ్యాటీ లివర్ డిసీజ్ మరియు సిర్రోసిస్ వంటి వాటిని నివారించవచ్చు. తగినంతగా నీరు తాగడం , కాలేయ నిర్విషీకరణ ప్రక్రియలో సహాయపడుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం లో సహాయ పడటమే కాకుండా కాలేయ కొవ్వును సైతం తగ్గించటం లో సహాయ పడుతుంది, కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. హెపటైటిస్ %ూ% మరియు %దీ% ల బారిన పడకుండా నిరోధించుకోవడం కోసం టీకాలు వేయించుకోవడం మరియు సురక్షితమైన పరిశుభ్రతను పాటించడం వైరల్ హెపటైటిస్ను నివారించడంలో కీలకమైన అంశాలు. వైరల్ హెపటైటిస్ కారణంగా తీవ్రమైన రీతిలో కాలేయం దెబ్బతినే అవకాశాలు వున్నాని దీనితో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. రక్త పరీక్షలతో కాలేయ పనితీరు పరంగా సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించవచ్చు, చికిత్సలు కూడా మరింత ప్రభావవంతంగా ఉంటాయి. మీరు కామెర్లు, అలసట లేదా కడుపు నొప్పి వంటి లక్షణాలను అనుభవిస్తే, వెంటనే వైద్య సలహా తీసుకోండని వివరించారాయన . ఈ ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా, కాలేయం స్థిరంగా ఉంటుంది కానీ అజేయమైనది కాదని గుర్తుంచుకోండి. ఈరోజు కాలేయానికి అనుకూలమైన జీవనశైలిని అవలంబించడం వల్ల రేపు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. కాలేయ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి-ఇది సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన జీవితానికి కీలకమైన ముందడుగుగా నిలుస్తుంది.

## యాక్షన్ ఆఫర్లతో అమెజాన్ ఫ్రీడమ్ సేల్

ఆషాఢ మాసం వచ్చిందంటే డిస్కౌంట్ల ప్రవాహం కొనసాగుతుంటుంది. బట్టల దుకాణాల నుండి నగల దుకాణాల వరకు డిస్కౌంట్లు ప్రతిచోటా ఉన్నాయి. దీంతో దుకాణాల వద్ద జనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఈ మాసం ప్రారంభం కావడంతో పలు దుకాణాలు డిస్కౌంట్లను అందిస్తున్నాయి. ఇది పక్కన పెడితే, అమెజాన్ ఆగస్ట్ ఫ్రీడమ్ సేల్ ఆగస్టు 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఆషాఢ మాసం డిస్కౌంట్, అమెజాన్ ఫ్రీడమ్ సేల్ కలిసి రావడంతో తక్కువ ధరలకు ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రజలకు ఇది గొప్ప అవకాశం. **అమెజాన్ ఫ్రీడమ్‌ సేల్:** భారతదేశంలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. దీనిని పురస్కరించుకుని, ప్రతి సంవత్సరం ఆగస్టులో అమెజాన్ ఫ్రీడమ్ సేల్ను ప్రకటిస్తుంది. వివిధ ఉత్పత్తులు తక్కువ ధరలలో, గొప్ప తగ్గింపులతో లభిస్తాయి. కొద్ది రోజుల క్రితం అమెజాన్ ప్రైమ్ డే సేల్ జరిగింది. ఐఫోన్ల నుంచి గృహోపకరణాల వరకు అన్నీ సరసమైన ధరలకు విక్రయించబడ్డాయి. ఐఫోన్తో సహా ప్రముఖ మొబైల్ ఫోన్లు అద్భుతమైన ఆఫర్లతో విక్రయాలు కొనసాగాయి. అమెజాన్ ప్రైమ్ డే సేల్ ముగిసిన కొద్ది రోజులకే అమెజాన్ తన ఫ్రీడమ్ సేల్ను ప్రకటించింది. **అమెజాన్ ఫ్రీడమ్‌ సేల్ ఎప్పుడు?** అమెజాన్ ఫ్రీడమ్ సేల్ ఆగస్టు 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. కానీ దాని మొబైల్ యాప్, ప్లాట్ఫారమ్లో అమెజాన్ ఫ్రీడమ్ సేల్ 2024లో భారీ ఆఫర్లు ప్రకటించనుంది. ఈ అమెజాన్ ఫ్రీడమ్ సేల్లో అమెజాన్ ప్రముఖ కంపెనీల నుండి గృహోపకరణాల వరకు మొబైల్ ఫోన్లను గొప్ప ఆఫర్లతో విక్రయించబోతోంది.

## రూ.7 లక్షలకే కొత్త టాటా కారు



దేశంలోని అత్యధికంగా విక్రయమవుతున్న కార్లలో టాటా పంచ్ ఒకటి. ఈ కారుకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. . మీరు కూడా ఈ టాటా పంచ్ డిస్కౌంట్ ధరలో కొనుగోలు చేయవచ్చు. ఈ ఆగస్టు నెలలో టాటా మోటార్స్ సంస్థ టాటా పంచ్ కారుపై రూ.25 వేల డిస్కౌంట్ అందిస్తోంది. ఈ డిస్కౌంట్ అనేది పెట్రోల్ వేరియంట్ టాటా పంచ్ కార్లతో పాటు సీఎన్జీ వేరియంట్లపైనా లభిస్తుంది. మైక్రో ఎస్యూవీ కారుగా పేరు గాంచిన టాటా పంచ్ ఈ ఆర్థిక ఏడాదిలో నెల నెలకు సేల్స్ పెంచుకుంటూ దూసుకెళ్తోంది. దేశంలో పండగల సీజన్ మొదలవుతోంది. అంతకు ముందే టాటా మోటార్స్ తమ కస్టమర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. టాటా పంచ్ పెట్రోల్ వేరియంట్పై రూ.25 వేల తగ్గింపు ఇస్తోంది. అలాగే సీఎన్జీ పై రూ.20 వేల డిస్కౌంట్ ఇస్తోంది. దీంతో తమ సేల్స్ మరింత పెరుగుతాయని టాటా మోటార్స్ భావిస్తోంది. అలాగే జులై డిస్కౌంట్ ఆఫర్తో పోలిస్తే ఆగస్టులో అదనంగా మరో రూ.7 వేల డిస్కౌంట్ కల్పిస్తుండడం గమనార్హంఈ ఆఫర్లు 2023తో పాటు 2024లో తయారైన కార్లపై ఉంటాయని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. పెట్రోల్ వేరియంట్ పై ఇస్తున్న ఈ డిస్కౌంట్ ఆఫర్లో రూ.20 వేలు నేరుగా క్యాష్ డిస్కౌంట్ ఇస్తుండగా.. రూ.5 వేలు కార్పొరేట్ డిస్కౌంట్ ఇస్తోంది. అలాగే టాటా పంచ్ సీఎన్జీ డిస్కౌంట్లో రూ.15 వేల క్యాష్ డిస్కౌంట్ వస్తుండగా రూ.5 వేలు కార్పొరేట్ రిబేట్ లభిస్తోంది. టాటా పంచ్లో 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ రివొట్రాన్ ఇంజిన్ ఉంది. ఇది 5 స్పీడ్ మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లలో లభిస్తోంది.టాటా పంచ్ ధరల విషయానికి వస్తే పెట్రోల్ వేరియంట్ ధర రూ. 7 లక్షలు (ఎక్స్ షోరూమ్) నుంచి మొదలవుతుంది. గరిష్ఠంగా రూ.10.20 లక్షల వరకు ఉంది. అలాగే సీఎన్జీ వేరియంట్ టాటా పంచ్ కారు ధర రూ. 7.23 లక్షల నుంచి మొదలై రూ. 9.85 లక్షల మధ్య ఉంది.

# ప్రభుదాస్ లిల్లాధర్ గ్రూప్ 80వ వార్షికోత్సవం

### కంపెనీ కొత్త బ్రాండ్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్

ముంబై -ప్రభుదాస్ లిల్లాధర్ గ్రూప్, ఇప్పుడు పిఎల్ క్యాపిటల్గా పిలువబడుతుంది, దాని 80వ వార్షికోత్సవం సందర్భంగా గర్వంగా తన కొత్త బ్రాండ్ గుర్తింపును ఆవిష్కరించింది. వక్త్ హుమారా హై - ఇండియాస్ గోల్డెన్ డికేడ్ అనే అంశంపై జరిగిన అద్భుతమైన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ డైనమిక్ లోగోను ప్రవేశపెట్టారు.1,500 మంది ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ, శ్రీ పీయూష్ గోయల్ ఇలా అన్నారు,"పిఎల్ గ్రూప్ దివంగత ప్రభుదాస్ లిల్లాధర్ షేత్ స్థాపించిన స్థాపక సూత్రాలకు కట్టుబడి ఉంటూనే, గత 80 సంవత్సరాలుగా బుల్ రన్ మరియు బేర్ క్లాలతో సహా మార్కెట్ యొక్క హెచ్చు తగ్గులను విజయవంతంగా నావిగేట్ చేసింది." గ్రూప్ విలువలైన సమగ్రత, విశ్వాసం మరియు నిష్పటం సూత్రాలు ప్రామాణిక స్వదేశీ స్ఫూర్తిని మరియు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. మనం చూడాలనుకుంటున్న భారతదేశానికి పిఎల్ క్యాపిటల్ స్ఫూర్తిదాయకంగా పనిచేస్తుంది." "భవిష్యత్తు దిశగా మేము ఇప్పుడు 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుండి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మారడంపై దృష్టి పెట్టాలి, రాబోయే 3.5 సంవత్సరాలలో దీనిని సాధించవచ్చని నేను నమ్ముతున్నాను" అని శ్రీ గోయల్ అన్నారు. %వి%5 ట్రిలియన్ మార్కును తాకిన తర్వాత %వి%10 ట్రిలియన్ల %+ఞూ% మార్కును సాధించడానికి కేవలం ఎనిమిది సంవత్సరాలు పడుతుంది. భారతదేశ మూలధన మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాలలో పబ్లిక్ సెక్టార్ అండర్టేకింగ్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ నాలుగు రెట్లు పెరగడంతో ఇటీవలి పెరుగుదల గమనించదగినది. మంచి రాజకీయాలకు గొప్ప ఆర్థిక శాస్త్రం తప్పనిసరి అని, మంచి రాజకీయాలకు ఎల్లప్పుడూ మంచి ఆర్థిక శాస్త్రం అవసరమని మోడీ ప్రభుత్వం అభిప్రాయపడింది, కాబట్టి ఈ ఊపు కొనసాగుతుందని భావిస్తున్నారు. పెట్టుబడిదారులకు సలహాగా, "స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టండి కానీ దీర్ఘకాలికంగా పెట్టండి, స్వల్పకాలికంగా కాదు" అని అన్నారు.సజావు కస్టమర్ సర్వీసు మరియు మంచి ఆర్థిక సలహాలతో అద్భుతమైన పనితీరును చేరుకునే సమీకృత ఆర్థిక సేవల ఎకోసిస్టంను రూపొందించే బృందం యొక్క భాగస్వామ్య లక్ష్యాన్ని ఈ సందర్భంగా గౌరవించింది. ఈ ప్రాథమిక లక్ష్యం కొత్త గుర్తింపు ద్వారా శక్తివంతంగా మరియు డైనమిక్గా ప్రాతినిధ్యం వహిస్తుంది. శ్రీమతి అమీషా వోరా, చైర్పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, పిఎల్ క్యాపిటల్, వైస్ చైర్మన్ ధీరేన్ షేత్తో కలిసి 1944లో ముంబైలోని బిఎస్ఇ రోటుండా భవనంలో స్వాతంత్ర్యానికి ముందు ప్రారంభమైనప్పటి నుండి పాన్-ఇండియా ఉనికిని కలిగి ఉన్న ప్రముఖ ఆర్థిక సంస్థగా ప్రస్తుత స్థానం వరకు కంపెనీ చరిత్రను గుర్తుచేసుకుంది. 1970వ దశకంలో, గ్రూప్ వ్యవస్థాపకుడు ప్రభుదాస్ లిల్లాధర్ షేత్ యుఎస్ కు వెళ్లి యుఎస్




ఎక్స్ఛేంజీల స్టాక్ బ్రోకింగ్ మరియు మార్కెట్ పద్ధతులను అధ్యయనం చేశారు. అతను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్కి ర్మన్ ఫిరోజ్ జంషెడ్జీ జీజీబోయ్కి విలువైన అంతర్దృష్టులను అందించాడు, భారతదేశ స్టాక్ మార్కెట్ను మాన్యువల్ అవుట్క్రై ట్రేడింగ్ నుండి కంప్యూటర్ ఆధారిత వ్యవస్థలుగా మార్చడానికి దోహదం చేసింది. అతని అడుగుజాడలను అనుసరించి, పిఎల్ గ్రూప్ 1981లో కంప్యూటర్ను కొనుగోలు చేసిన మొదటి బ్రోకింగ్ సంస్థగా అవతరించింది, పరిశ్రమలో ఆటోమేషన్ను ప్రారంభించింది. ఇంకా, సమగ్ర మార్కెట్ రేట్లు, బ్రోకరేజ్ మరియు మొత్తం రేట్లతో ముద్రించిన ఒప్పంద నోట్లను అందించడం ద్వారా, పిఎల్ ఆవిష్కరణలో ముందంజలో ఉంది. ఈ విధంగా, పరిశ్రమలో పారదర్శకతను పెంచే దిశగా పిఎల్ మొదటి అడుగును ప్రారంభించింది.మిస్టర్ సిద్ధార్థ్ వోరా, క్వాంట్ ఇన్వెస్ట్మెంట్ స్ట్రాటజీస్ హెడ్ మరియు ఫండ్ మేనేజర్, పిఎల్ అసెట్ మేనేజ్మెంట్, తన మార్గంతో అసెట్ మేనేజ్మెంట్ స్పేస్ను ఎలా విప్లవాత్మకంగా మార్చాలని ప్లాన్ చేస్తుందో - క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్లో బ్రేకింగ్ వర్క్ను ప్రదర్శించారు. ఆక్వా పిఎల్ అసెట్ మేనేజ్మెంట్ యొక్క ఫ్లాగ్షిప్ క్వాంట్ ఈక్విటీపిఎంఎస్ , గత 1 సంవత్సరంలో 76% రాబడితో దాని ప్రక్రియ మరియు ఫలితాలు ఎలాంటి దృశ్య శైలికి అనుకూలంగా ఉంటాయి మరియు అనుకూల విధానం ద్వారా కొత్త పరిశ్రమ బెంచ్మార్క్ను ఎలా సెట్ చేసిందో ఆయన హైలైట్ చేశారు.శ్రీమతి అమీషా వోరా, చైర్పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, పిఎల్క్యాపిటల్ ఇలా పేర్కొన్నారు, " పిఎల్ క్యాపిటల్లో, పొదుపులను స్థిరమైన సంపదగా మార్చడం ద్వారా వ్యక్తులకు సాధికారత కల్పించడానికి మేము అంకితభావంతో ఉన్నాము. మా ఖాతాదారులకు బాధ్యతాయుతమైన, విశ్వసనీయమైన మరియు ప్రతిస్పందించే విశ్వసనీయ భాగస్వాములుగా ఉండటానికి మేము కట్టుబడి ఉన్నాము. ప్రధానమైన అంశాలను నొక్కిచెప్పడానికి మా కొత్త బ్రాండ్ గుర్తింపు గురించి గొప్పగా ఆలోచించామన్నారు. మా విజయం యొక్క మూడు సిద్ధాంతాలు 1) స్థిరమైన సంపద సృష్టితో మా ఖాతాదారులకు విలువను సృష్టించడం, 2) మా లోతైన నైపుణ్యంతో విలువను జోడించడం మరియు 3) విశ్వాసం, పారదర్శకత మరియు సమగ్రత యొక్క మా విలువలకు కట్టుబడి ఉండటం. ఈ రోజు, మేము 160,000 క్లయింట్లు, 250కి పైగా ప్రముఖ కార్పొరేట్లు, 100 కంటే ఎక్కువ విదేశీ మరియు దేశీయ సంస్థలు మరియు 4,000 మంది సంపన్న మరియు అధిక-నికర-విలువ గల వ్యక్తులు మరియు 200ం నగరాల్లోని 900 మంది ఫ్రాంఛైజీ భాగస్వాములు, నిర్వహణలో ఉన్న ఆస్తులతో ?26,000 కోట్లు, 500ం నిపుణుల బృందం మద్దతు ఇస్తుంది." "ఆధునిక భారతదేశంలో సంపద సృష్టి" అనే అంశంపై ఒక ఉత్తేజకరమైన ప్యానెల్ చర్చ కార్యక్రమం మరొక హైలైట్. ఇది ఈటి నౌమేనేజింగ్ ఎడిటర్ నికుంజ్ దాల్మియాచే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మిస్టర్ భరత్ షా, ఏఎస్కె గ్రూప్, మిస్టర్ నీలేష్ షా, మేనేజింగ్ డైరెక్టర్ కోటక్ మహీంద్రా ఏఎంసి, మిస్టర్ నవనీత్ మునోత్, ఎండి - సిఈఓ హెచ్డిఎఫ్సి ఎండి సునీల్ సింఘానియా, వ్యవస్థాపకుడు, అబాక్కస్ అసెట్ మేనేజర్ పాల్గొన్నారు ఈ గ్రాండ్ ఈవెంట్కు అతిథులు గా కృష్ణన్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, మిస్టర్ రాజేష్ కుమార్ సింగ్, పరిశ్రమల ప్రోత్సాహక విభాగం కార్యదర్శి మరియు ఇంటర్నల్ ట్రేడ్, మిస్టర్ అమిత్ సింగ్ సిఈఓ, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కూడా పాల్గొన్నారు. మిస్టర్ సుందరరామన్ రామమూర్తి, %వీణ% మరియు %జజూ%, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ కూడా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, %ూ% గేమ్ ఛేంజర్ అవార్డ్స్ 2024లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకుగానూ ఎంపిక చేసిన భాగస్వాములు, ఉద్యోగులు మరియు పంపిణీదారులను సత్కరించారు. 400 మంది %ూ% క్యాపిటల్ యొక్క అగ్ర ఫ్రాంఛైజీ భాగస్వాములతో పాటు మ్యూచువల్ ఫండ్స్ మరియు ఇన్సూరెన్స్ హౌస్ల %జజూ%లు మరియు %జ×ూ%లు, %ఎచీ×%లు మరియు ఫ్యామిలీ ఆఫీస్లతో సహా కార్పొరేట్ ఇండియా యొక్క అగ్రశ్రేణి ప్రముఖులు హాజరయ్యారు. ఈవెంట్ యూట్యూబ్లో ప్రత్యక్ష ప్రసారం చేయబడింది, 5000 కంటే ఎక్కువ వీక్షణలను పొందింది, ఇంకా వీక్షణలను పొందుతుంది.క్యాపిటల్ తన క్లయింట్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి దాని విస్తృతమైన అనుభవాన్ని మరియు అత్యాధునిక పరిష్కారాలను ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉంది. దాని కొత్త లోగో మరియు గుర్తింపు పరిచయంతో, %ూ% క్యాపిటల్ తన లెగసీ ఆఫ్ ఎక్సలెన్స్ను కొనసాగించడానికి సిద్ధంగా ఉంది.

# అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ... బిజీ...




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంతడ్డి అమెరికాలో పర్యటిస్తున్నారు. న్యూయార్క్ చేరుకున్న రేవంత్ బృందానికి ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో అమెరికాలోని పలు నగరాలు సహా దక్షిణ కొరియాలోని సియోల్లు సందర్శించనున్నారు. ఎనిమిది రోజుల అమెరికాలో, రెండు రోజులు దక్షిణ కొరియాలో సీఎం బృందం పర్యటిస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించనున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటించి పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ అవుతారు. ఇవాళ ప్రవాస భారతీయులతో సీఎం రేవంత్ సమావేశమవుతారు. రేపు న్యూయార్క్లో కాగ్నిజెంట్ సీఈవో, సహా ఆర్పీఎం, టీబీసీ, కార్నింగ్, జోయిటస్ సంస్థల ప్రతినిధులతో భేటీ కానున్నారు. అలాగే ఆర్గా సీఈవో రామకృష్ణ, పీ అండ్ వో సంస్థ సీవోవో శైలేష్ జెజురికర్, ర్యాపిడ్ ఏడుగురు ప్రతినిధులతో సమావేశమవుతారు. ఈనెల 6న పెప్సికో, హెచ్సీఏ ఉన్నతాధికారులతో సమావేశమైన తరువాత న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ చేరుకుంటారు.

# వణుకుతున్న ఉత్తరాది

● ఎడతెరిపిలేని వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు ● వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైంది

న్యూఢిల్లీ .... దేశవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు కొనసాగుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలతో ఉత్తరాది వణికిపోతోంది. జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్లో కురుస్తున్న భారీ వర్షాలతో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోవైపు వరదలు ముంచెత్తడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.
మధ్యప్రదేశ్లో భీకర వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల గోపాద, నర్మదా నదుల ఉగ్రరూపంగా దాల్చి.. ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. నర్మదా నది ప్రవాహంలో ఘాట్లు, మందిరాలు నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. వరద ముప్పుతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది ప్రభుత్వం. మరోవైపు భోపాల్లో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ముంచెత్తింది. కాలనీలు అన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోని వరదనీరు చేరడంతో జనం అవస్థలు పడుతున్నారు. రోడ్లపై భారీగా వరద నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. పుణేలో ముఠా, పావన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరదల వల్ల పుణేలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అపార్ట్మెంట్లలోని వరద నీరు చేరడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఏక్తా నగర్కు సైన్యాన్ని రప్పించారు అధికారులు. వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని బోట్ల సహాయంతో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు ఆర్మీ, ఫైర్ సిబ్బంది. ముంబై వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మెరైన్ డ్రైవ్లోని సముద్ర తీరంలో అధిక ఆటుపోట్లతో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. ముంబైకి ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది ఐఎండీ. ముంబైలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాలలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అటు ముంబైకి నీటిని అందించే.. వైతర్ణ రిజర్వాయర్ పొంగిపొర్లుతోంది. ప్రాజెక్టు రెండు గేట్లను తెరిచి 706.30 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.
క్లౌడ్ బరస్ట్ కారణంగా జమ్ము కశ్మీర్లో భారీ వర్షాలు కురిశాయి. గందేర్బాల్ జిల్లాలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. చెట్లు నేలకొరిగాయి. పంటపొలాలన్నీ బురదతో నిండిపోయాయి. పలు వాహనాలు వరదలో చిక్కుకున్నాయి. రంగంలోకి దిగిన ఆర్మీ బలగాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. మరవైపు జమ్ముకశ్మీర్లో కొండచరియలు విరిగిపడడంతో.. శ్రీనగర్–లేహ్ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్పందించిన అధికారులు శిథిలాలను తొలగించే పనులు చేపట్టారు.
హిమాచల్ ప్రదేశ్లో క్లౌడ్ బరస్ట్ కారణంగా లాహౌల్, స్పితి జిల్లాలో రెండు వంతెనలు కొట్టుకుపోయాయి. మనాలీ–లడఖ్ రోడ్లో ఉన్న కోఫ్రా బ్రిడ్జి వరద ఉధృతికి తెగిపోయింది. ఇందులో ఒక వంతెనను ఇటీవలే నిర్మించారు. బుల్డోజర్లతో బండరాళ్లు తొలగించి రోడ్డును క్లియర్ చేస్తున్నారు ఆర్మీ సిబ్బంది. రెండు రోజుల్లో వంతెనను తిరిగి నిర్మిస్తామని చెబుతున్నారు. క్లౌడ్ బరస్ట్, వర్షాలు, వరదలతో అల్లాడిపోయిన హిమాచల్ప్రదేశ్లో సహాయక చర్యలు ముమ్మరం అయ్యాయి. ఇప్పటిదాకా ఆరుగురు చనిపోయారు. 50 మందికి



పైగా గల్లంతు అయ్యాయి. అయితే షీలాభావి అనే గ్రామంలో చిక్కుకుపోయిన ఒక కుటుంబాన్ని సైన్యం రక్షించింది. చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు తాత్కాలిక వంతెనలు నిర్మించారు. క్లిష్టమైన ప్రాంతాల నుంచి వారిని ఆ తాత్కాలిక వంతెనల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
హిమాచల్ ప్రదేశ్ సహాయకచర్యల్లో డాగ్ స్క్వాడ్ను రంగంలోకి దించింది సైన్యం. సిమ్లాలోని గాన్వి అనే గ్రామంలో రెస్క్యూ ఆపరేషన్లో డాగ్ స్క్వాడ్ను భాగం చేశారు. బండరాళ్ల కింద ఆనవాళ్లు దొరుకుతాయా అనే కోణంలో అన్వేషణ చేపట్టారు. గల్లంతైన వారి ఆచూకీకోసం అన్వేషణలో భాగంగానే స్నిఫర్ డాగ్స్ను రెస్క్యూ ఆపరేషన్లో వినియోగిస్తున్నారు. ఉత్తరాఖండ్లోని సోన్ప్రయాగ్లో చిక్కుకున్నారు వెయ్యిమంద్రి యాత్రికులు. సోన్ప్రయాగ్ నుంచి కేదార్ఘాటికి యాత్రికుల తరలింపు ప్రారంభించారు. క్లౌడ్ బరస్ట్ తర్వాత రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో సోన్ప్రయాగ్తో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. రెస్క్యూలో భాగంగా సోన్ప్రయాగ్లో హెలిప్యాడ్ నిర్మించింది ఆర్మీ. ప్రజలను కాపాడేందుకు 6 హెలికాప్టర్లను ఏర్పాటుచేసింది ప్రభుత్వం. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో.. పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్, గుజరాత్, కొంకణ్, గోవా, మహారాష్ట్రలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఆయా ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

# చైనా కుయుక్తులు.. భారత్‌కు ప్రమాద ఘంటికలు

● బ్రహ్మపుత్రపై భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు ● మరోసారి నిర్మించేందుకు పావులు కదుపుతున్న చైనా

న్యూఢిల్లీ : భారత్పై పొరుగు దేశం చైనా అవకాశం దొరికినప్పుడల్లా విషం చిమ్ముతూనే ఉంది. వ్యూహాత్మక ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తూర్పు లద్దాఖ్లోని గల్వాన్ ఘటన తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇదే సమయంలో సమస్యాత్మక సరిహద్దు ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేయడం, అరుణాచల్ ప్రదేశ్ను తమ భూభాగంలో చూపించడం లాంటి విపరీత చర్యలకు డ్రాగన్ పాల్పడింది. భారత్కు నష్టమని తెలిసినప్పటికీ.. బ్రహ్మపుత్ర నదిపై భారీ జలవిద్యుత్ కేంద్రం (సూపర్ డ్యామ్) నిర్మాణానికి సిద్ధమైంది. గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారం స్తబ్దుగా ఉంది. కానీ, తాజాగా మరోసారి ఆ దిశగా చైనా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్స్టిట్యూట్ ఓ నివేదిక విడుదల చేసింది. భారత్కు ముంచి ఉన్న ముప్పు గురించి ప్రమాద ఘంటికలు మోగించింది.

ఏఎస్పీఐ నివేదిక ఏం చెప్పింది?

చైనా ఎత్తుగడలకు సంబంధించిన కీలక అంశాలను ఏఎస్పీఐ తన నివేదికలో పొందుపరిచింది. బ్రహ్మపుత్ర నది భారత్లోకి ప్రవేశించే ముందు.. అర్ధచంద్రాకారంలో వంగి ప్రవహిస్తుంది. ఈ వంపు ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మించేందుకు చైనా పావులు కదుపుతోంది. మరోవైపు ఈ నది ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ప్రదేశ్లో ప్రవేశించడానికి ముందు సుమారు 3,000 మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే భౌగోళికంగానూ చైనాకు అనుకూలంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ను ఉత్పత్తి చేసే వీలుండటంతో ఇక్కడే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని చైనా భావిస్తోంది. ప్రపంచలోనే అత్యంత శక్తివంతమైన జలవిద్యుత్ ప్రాజెక్టుగా దీనిని డ్రాగన్ అభివర్ణిస్తోంది.

భారత్కు ముప్పేంటి?

టిబెట్లో జన్మించే బ్రహ్మపుత్ర నది (దీనిని టిబెట్లో యార్లుంగ్ జాంబ్పోగా పిలుస్తారు) భారత్ గుండా బంగ్లాదేశ్లోకి ప్రవహిస్తుంది. అక్కడ గంగానది దీంతో కలుస్తుంది. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు బ్రహ్మపుత్ర వరదాయిని. ఈ నదీ జలాల ప్రవాహతీరు, పంపిణీ, నాణ్యత సమాచార మార్పిడిపై భారత్–చైనా మధ్య ఒప్పందం ఉంది. వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి విపరీతంగా వరదలు వస్తుంటాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్లో అపారనష్టాన్ని కలగజేస్తుంటాయి. ఒప్పందం ప్రకారం మే 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు బ్రహ్మపుత్ర జలసంబంధ (హైడ్రలాజికల్) విషయాల్ని ఎగువనున్న చైనా దిగువనున్న భారత్తో పంచుకోవాల్సి ఉంది.
ముఖ్యంగా వరదలొచ్చే అవకాశం ఉన్నప్పుడు నదీ మట్టాల్ని దిగువనున్న దేశాలకు తెలియజేయాలి. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత చైనా ఆ సమాచారాన్ని భారత్కు సరిగా ఇవ్వడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో అప్పటిపరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరి సారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ తర్వాత కొత్త ఒప్పందం జరగలేదు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవుతుండటం కలవర పెడుతోంది.

చైనా కుటిల బుద్ధి

ఒక వేళ చైనా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్కు పక్కలో బల్లెంలా మారే



ప్రమాదముంది. ఎండాకాలంలో బ్రహ్మపుత్ర నీటిని మళ్లించేందుకు చైనాకి అవకాశం ఏర్పడుతుంది. దీంతో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదముంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా నీటి ప్రవాహం ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా నిర్మించదలచుకున్న ప్రాజెక్టు భారత్–చైనా సరిహద్దుకు కేవలం 30కి.మీ దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒక వేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే.. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి.. చైనా వాటర్ బాంబ్గా ఉపయోగించుకునే వీలుంది.

# ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా

● వేల ఎకరాలను సేకరించి దోచుకునే కుట్ర ●ధరణిపై భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయండి
● ధరణిపై వేసిన కమిటీ ఏం తేల్చింది? ● కేసీఆర్ కుటుంబ భూదోపిడీపై చర్యలేవి?
● కాంగ్రెస్‌కు హిందూ పండగలంటే అంత చులకనెందుకు? ● బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
● బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరుతో చేసిన ప్రకటన వెనుక పెద్ద ఎత్తున భూదందా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి... రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు సిద్ధమయ్యారని అన్నారు.ధరణి పేరుతో దాదాపు రూ.2 లక్షల కోట్ల స్కాం జరిగిందన్నరు. దేశంలోనే అతిపెద్ద స్కాం ధరణి అని పేర్కొన్న బండి సంజయ్ కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తూ వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధమైందన్నారు. ఈరోజు మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్రంగూడలో బోనాల ఉత్సవాలకు హాజరైన బండి సంజయ్ కుమార్ చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు.
తెలంగాణ అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం. కలిసికట్టుగా పనిచేసి నిధులు తీసుకొద్దాం. అంతే తప్ప ప్రధానమంత్రిని అదే పనిగా తిట్టడంవల్ల నష్టమే తప్ప లాభం లేదనే అంశాన్ని గుర్తుంచుకోవాలి. మహేశ్వరం ను ఫోర్త్ సిటీగా మారుస్తామనే సర్కార్ ప్రకటన వెనుక పెద్ద భూదందా నడుస్తోంది. కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను అగ్గువకు కొని ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నరు. బీఆర్ఎస్ మాదిరిగానే భూదందాతో వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు ఫోర్త్ సిటీ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. దీనివల్ల కాంగ్రెస్ నేతలకు తప్ప ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదు... పెద్ద ఎత్తున ఆస్తులు సంపాదించేందుకు భూ దందాను తెరపైకి తేవడమే కాకుండా మహేశ్వరం కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకుడికే భూములను సేకరించే బాధ్యతను అప్పగించారు. 6 గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేసేందుకు కాంగ్రెస్ నేతలకు ఏదో ఒక కొత్త అంశాన్ని తెరపైకి తీసుకురావడం, ప్రజల దృష్టిని మళ్లించడం అలవాటైపోయింది. రాబోయే స్థానిక సంస్థల్లో గెలిచేందుకు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. రుణమాఫీ సహా 6 గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులుసహా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీ పోరుబాటకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కార్యచరణ రడీ అవుతోంది.
ధరణి పేరును భూమాతగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం భూమాతను భూమేతకు ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద స్కాం జరిగింది. తెలంగాణ ఏర్పడిన 2014 నాటికి రాష్ట్రంలో 24 లక్షల అసైన్డు భూములుంటే నేడు ఆ భూములు ఐదు లక్షలకు ఎలా తగ్గాయి. అసైన్డు భూములను, శిఖం భూములను, దేవాదయ, అటవీ, భూదాన భూములతోపాటు పేదల భూములను కూడా ధరణి పేరుతో బీఆర్ఎస్ లీడర్లు దండుకున్నరు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వివరాలేవి? వాటిని ఎందుకని రేవంత్ సర్కారు బయట పెట్టడం లేదు. ఆ భూముల విలువ రెండు లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. కేసిఆర్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ధరణిని అడ్డుపెట్టుకుని దోచుకున్నారని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదు? అధికారంలోకి రాగానే ధరణిపై ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక ఏది? ధరణి పేరుతో దోపిడీ చేసిన దోషులెవరో ఎందుకు తేల్చడం లేదు? ధరణిపై వేసిన కమిటీ బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ నేతలు ఏ విధంగా దోచుకోవాలా? అనే అంశంపై రహస్య నివేదిక ఇచ్చినట్లుంది. అందుకే ఫోర్త్ సిటీ, భూమాత పేరుతో భూములను దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే భవిష్యత్తులో గజం భూమి కూడా మిగిలే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ధరణి భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయాలి. గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డు వీటన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయాలనే ప్రతిపాదన అర్థం లేనిది. ప్రజలపై పన్నుల భారం మోపేందుకే విలీన కుట్ర చేస్తున్నారు. 15 ఏళ్ల కిందట హైదరాబాద్ శివారులోని విలీనమైన ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. వాటిని అభివృద్ధి చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలను విలీనం చేస్తామనడం అర్థం లేనిది. దీనిపై బీజేపీ నాయకత్వం చర్చించి తగిన కార్యాచరణను ప్రకటిస్తుందన్నారు.

# మీడియాకు విలువలు ప్రధానం

● సత్యాన్ని వెలుగు తీయాల్సిన బాధ్యత జర్నలిస్టులదే ● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



న్యూఢిల్లీ, బ్యూరో ప్రతినిధి: హరియాణా రాష్ట్రం పంచకులలో ఆగస్టు 3, 4 తేదీల్లో జరుగుతున్న ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ముగింపు సెషన్ ఆదివారం హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఐజేయు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ మీడియా మన ప్రజాస్వామ్యానికి మూల స్థంభమని , మీడియా పటిష్టం గా ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు. ప్రభుత్వాలు వస్తూ పోతూ ఉంటాయి, పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి , కానీ దేశం శాశ్వతమని, దేశం వికాసం చెందాలంటే ప్రజాస్వామ్యం కీలకమని, అందుకు బలమైన మీడియా అవసరమని దత్తాత్రేయ అన్నారు.ప్రభుత్వాలు చేసే మంచిని, చెడును ప్రజల ముందుకు తెచ్చే బాధ్యత మీడియాదేనని వారు స్పష్టం చేశారు. నిబద్ధతతో జర్నలిజం చేసే పాత్రికేయులను చూసి ముఖ్యమంత్రులు సైతం భయపడటం తనకు తెలుసునని, అలాంటి పాత్రికేయులను పిలిచి వారు లేవనెత్తిన సమస్యలపై మాట్లాడుకోవడం జరిగేదని దత్తాత్రేయ అన్నారు. తన దృష్టిలో పాలకులకంటే నిజం చెప్పే జర్నలిస్టే ఉన్నతమైన వారని బండారు దత్తాత్రేయ అన్నారు. సత్యం చెప్పడానికి , వాస్తవాలను వెలుగులోనికి తేవడానికి మీడియా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నో కుంభకోణాలను, అక్రమాలను, అవినీతిని వెలుగులోకి తేవడంలో పరిశోధనాత్మక జర్నలిజం ముఖ్య భూమిక పోషించిందని శ్రీ దత్తాత్రేయ గుర్తు చేశారు. అయితే వాస్తవాలను వెలుగులోనికి తెస్తే సహించలేని దుష్ట శక్తులు మీడియాపై దాడులు చేస్తుంటాయని దత్తాత్రేయ అన్నారు. సత్యాన్ని వెలుగులోకి తేవాలంటే జర్నలిస్టు నిర్భీతితో, సాహసంతో, నిబద్ధతతో విధి నిర్వహణ చేయాల్సి ఉంటుందని దత్తాత్రేయ పేర్కొన్నారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చే పాత్రికేయులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలన్న ఐ.జే.యు. డిమాండు న్యాయబద్ధమేనని, ప్రత్యేక భద్రతా చట్టం డిమాండును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. భువనేశ్వర్ లో జరిగిన ఐజేయూ ప్లీనరీకి కేంద్ర కార్మికశాఖ మంత్రి హోదాలో తాను హాజరయ్యానని, వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల గురించి తనకు అవగాహన కలిగిందని, వర్కింగ్ జర్నలిస్టుల వేజ్ బోర్డు నియమించాలన్న అంశాన్ని యూనియన్ నేతలు తన దృష్టికి తెచ్చారని, వెంటనే యూనియన్ల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసానని శ్రీ దత్తాత్రేయ గారు గుర్తు చేశారు. ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని రద్దు చేయడంతో జర్నలిస్టుల వేజ్ బోర్డు కూడారద్దయ్యిందని తెలిపారు. అయితే వర్కింగ్ జర్నలిస్టులకు వేతన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు వేజ్ బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను తన స్థాయిలో కేంద్రం దృష్టికి తీసుకు వెళతానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో సాంకేతికత పెరుగుదల, కృత్రిమ మేధ ప్రవేశంతో మీడియా రంగంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.మీడియాకు విలువలు ప్రధానమని, విలువలు లేని మీడియాకు విశ్వసనీయత ఉండదని, విశ్వసనీయత లేని మీడియాకు గౌరవం ఉండదని, పాత్రికేయులు సమాచారాన్ని సమాచారంగా ఇవ్వాలని, న్యూస్ బదులు వ్యూస్ ఇవ్వడం మంచి పద్ధతి కాదని దత్తాత్రేయ అన్నారు. ఐజేయు అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి తనకు నాలుగున్నర దశాబ్దాలుగా తెలుసునని, విలువలు కలిగిన జర్నలిస్టుగా, నిబద్ధత కలిగిన యూనియనిస్టుగా ఆయనంటే తనకు అపార గౌరవమని దత్తాత్రేయ పేర్కొన్నారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఆలయ్ బలయ్ కార్యక్రమం పొందుతున్న ప్రాచుర్యాన్ని వివరించారు. ఉత్తర తెలంగాణా జిల్లాల్లో శ్రీ అటల్ బీహారీ వాజపేయి గారు పాల్గొన్న సభల నిర్వాహకునిగా దత్తాత్రేయ వార్తా సేకరణకు తానూ కొన్ని రోజులపాటు చేసిన పర్యటనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్. సిన్హా మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని రద్దు చేయడంతో ఏర్పడిన పరిస్థితులను దత్తాత్రేయ గారి దృష్టికి తెచ్చారు. ఐజేయు సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ , చండీఘర్ హర్యానా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రామ్ సింగ్ బ్రార్, చైర్మన్ బల్వంత్ తక్షీ, చండీ ఘర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నళినీ ఆచార్య, ఐజేయూ జాతీయ కార్యదర్శి బల్బీర్ సింగ్ ఝూండు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయను ఐజేయు నాయకులు ఘనంగా సత్కరించడం జరిగింది.

# మితిమీరిన డిజిటల్ విద్య ప్రతికూలం

● అవసరమైనప్పుడు మాత్రమే తరగతుల్లో ప్రాధాన్యం
● ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక



డిల్లీ: పాఠశాల స్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం సానుకూల అంశమే అయినప్పటికీ దాన్ని మితిమీరిన రీతిలో వినియోగించడం ప్రమాదకర పరిణామమేనని అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్న విషయం తెలిసిందే. మొబైల్ డివైజ్లతో ఎక్కువ సమయం గడపడం విద్యార్థి దృష్టి మరల్చుతుందని, వారి అభ్యసనపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని తాజా నివేదిక వెల్లడించింది. టెక్నాలజీపైనే తీవ్ర దృష్టి పెట్టడమనేది భారీ మూల్యం చెల్లించుకోవడమేనని, అభ్యసన ప్రక్రియకు అసరమైనప్పుడు మాత్రమే దాన్ని తరగతుల్లో ఉపయోగించాలని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. ఈ క్రమంలోనే దాదాపు 14 దేశాలు పాఠశాలల్లో స్మార్ట్ఫోన్ల వినియోగాన్ని నిషేధించాయని తెలిపింది. విద్యలో సాంకేతికత అనే అంశానికి సంబంధించి యునెస్కో తాజా నివేదికలో పలు విషయాలు వెల్లడించింది. మితిమీరిన సాంకేతికత వినియోగం, విద్యార్థుల పనితీరు మధ్య ప్రతికూల సంబంధాన్ని చూపిస్తుందని ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్మెంట్ విశ్లేషణలో తేలింది. మొబైల్ డివైజ్లతో ఎక్కువ సమయం గడపడం వల్ల అభ్యసన ప్రక్రియలో ప్రతికూల ప్రభావాలు వచ్చినట్లు అనేక దేశాల నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో పాఠశాలల్లో స్మార్ట్ఫోన్ల వినియోగంపై ఇప్పటికే 14 దేశాలు నిషేధం విధించాయి అని తాజా నివేదిక పేర్కొంది. తరగతి గది, ఇంట్లో చిన్నారుల చదువులపై స్మార్ట్ఫోన్లు, కంప్యూటర్లు తీవ్ర అంతరాయం కలిగిస్తాయని యునెస్కో అప్రమత్తం చేసింది. డిజిటల్ టెక్నాలజీని అలవరచుకోవడం వల్ల విద్య, అభ్యసన ప్రక్రియలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రాథమిక నైపుణ్యాలను నేర్పే క్రమంలో అనేక సంపన్న దేశాలు డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. పేపర్ స్థానంలో స్క్రీన్లు, పెన్నుల స్థానంలో కీబోర్డులు వచ్చేశాయి. కొవిడ్–19తో రాత్రికి రాత విద్యావ్యవస్థలు ఆన్లైన్లోకి మారిపోయాయి అని ఐరాస విద్యా బృందానికి చెందిన ఓ నిపుణుడు పేర్కొన్నారు.

# ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మృతి

● టెల్అవీవ్ శివార్లలో కత్తిపోట్ల కలకలం!
● గాజాపై మరోసారి విరుచుకుపడిన ఇజ్రాయెల్



హమాస్ : హమాస్, హెజ్బొల్లాల కీలక నేతల హత్యలతో ఇజ్రాయెల్పై ఏ క్షణమైనా దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉండటంతో.. పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఈ పరిణామాల నడుమ గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. ఆదివారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో 18 మంది మృతి చెందారు. మరోవైపు.. టెల్అవీవ్ శివార్లలో ఓ పాలస్తీనా మిలిటెంట్ కత్తితో జరిపిన దాడుల్లో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.
ఇజ్రాయెల్ దాడిలో అల్–అక్సా ఆస్పత్రి ప్రాంగణంలో టెంట్ క్యాంప్లో తలదాచుకుంటున్న నలుగురు మృతి చెందినట్లు గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. తాము ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకున్నట్లు టెల్అవీవ్ సైన్యం తెలిపింది. ఘటనాస్థలంలో రెండో పేలుడు కూడా సంభవించిందని, దానర్థం అక్కడ ఆయుధాలు నిల్వ ఉన్నట్లని పేర్కొంది. ఉత్తర గాజాలో ముగ్గురు చిన్నారులు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. దేర్ అల్ బలాహ్లో ముగ్గురు, గాజా సిటీలో ఓ వాహనంపై జరిపిన దాడిలో మరో ముగ్గురు మృతి చెందారు. శనివారం ఇదే ప్రాంతంలోని ఓ శిబిరంపై జరిగిన దాడిలో 16 మంది మరణించారు. ఇటీవల లెబనాన్లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో హెజ్బొల్లా సీనియర్ సైనిక కమాండర్ ఫాద్ షుకర్ మృతి చెందారు. మరోవైపు.. ఇరాన్ రాజధాని టెహ్రాన్లో హమాస్ పొలిటికల్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురయ్యారు. ఈ వరుస పరిణామాలతో యుద్ధ విస్తరణ భయాలు మరింతగా పెరిగాయి. హెజ్బొల్లా గ్రూపు ఇజ్రాయెల్లోని పౌర ఆవాసాలపై దాడులు చేసే అవకాశముందని ఇరాన్ ఇప్పటికే వెల్లడించింది. దీంతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. పశ్చిమాసియాకు అమెరికా తన యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపిస్తోంది.

# హిమాచల్‌లో వరదలు ఉధృతం

11కు చేరిన మరణాలు, 40మంది గల్లంతు



శిమ్లా: హిమాచల్లో ఆకస్మిక వరదల కారణంగా గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 11 మంది చనిపోయినట్లు గుర్తించగా.. 40 మంది ఆచూకీ ఇంకా లభించలేదు. గల్లంతైన వారి కోసం భారత సైన్యంతో పాటు ఎన్డీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్డీఆర్ఎఫ్కు చెందిన 410 మందితో గాలింపు చర్యలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. జాగిలాలు, డ్రోన్లు సహా ఇతర పరికరాలతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.
భారీ వర్షాల కారణంగా కులులోని నిర్మాండ్, సాయింజ్, మలానాతోపాటు మండీలోని పధార్, శిమ్లాలోని రాంపుర్ డివిజన్లలో వరదలు సంభవించాయి. మణికరన్ ప్రాంతంలోని మలానా–2 పవర్ ప్రాజెక్టో 33 మంది చిక్కుకోగా వారిని రెస్క్యూ బృందాలు రక్షించాయి. శిమ్లాలోని రాంపుర్లో దాదాపు 20 నుంచి 25 ఇళ్లు కొట్టుకుపోగా, 30 మంది గల్లంతయ్యారు. మొత్తంగా 40మంది ఆచూకీ ఇంకా లభించలేదు.వరద నీరు కాస్త తగ్గడంతో రెస్క్యూ ఆపరేషన్ను ముమ్మరం చేశారు. మరోవైపు రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నెల రోజుల్లోనే భారీ వర్షాల కారణంగా దాదాపు రూ.662 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. వర్ష సంబంధిత ఘటనల్లో ఇప్పటివరకు 79 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.

# వచ్చే ఏడాది మార్చి నాటికి

● యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలి ● సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలవండి ● దామరచర్ల నుండి పవర్ ప్లాంట్‌కు ఫోర్ లైన్ బైపాస్ రోడ్డుపై వారంలో నివేదిక ఇవ్వండి ● యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: వచ్చే ఏడాది మార్చి కల్లా ఎట్టి పరిస్థితిలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సిందేనని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని జెన్కో అధికారులను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన జెన్కో ఉన్నతాధికారులతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి యూనిట్ అక్టోబర్ 30 కల్లా, రెండో యూనిట్ అక్టోబర్ 15 కల్లా, మూడో యూనిట్ వచ్చే ఏడాది ఫిబ్రవరి, నాలుగో యూనిట్ ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి, 5వ యూనిట్ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంట్లో పనిచేసే కొద్దిమంది అధికారులు, సిబ్బంది జ్వరాలతో బాధపడుతున్నారు ఫలితంగా పనుల్లో కొంత జాప్యం జరుగుతున్నట్టు సమావేశంలో జెన్కో అధికారులు వివరించారు. సిబ్బంది సంక్షేమమే ప్రధానం వెంటనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయండి, దోమల బారి నుంచి అధికారులు, సిబ్బందిని కాపాడేందుకు నిద్రించే క్యాంపుల్లో దోమతెరలు సరఫరా చేయండి, పని ప్రదేశాల్లో పెద్ద ఎత్తున ఫాగింగ్ చేయండి అని ఆదేశించారు. అధికారులు, కార్మికుల భద్రతకు ఎన్ని నిధులు ఖర్చు చేసేందుకైనా వెనుకాడ వద్దని తెలిపారు. అధికారులు, కార్మికులు స్థానికంగా నివసించేందుకు వేను వెంటనే క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆదేశించారు. స్థానికంగా నివసించేందుకు ఇబ్బందులు ఉన్నందున క్వార్టర్లు నిర్మించే వరకు మిర్యాలగూడ, దామరచర్ల నుంచి సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేక బస్సులు అధికారులు సిబ్బందికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి బూడిద తరలింపునకు తాళ్ల వీరప్పగూడెం, దామరచర్లకు నాలుగు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రగతిపై వారంలోగా తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆగస్టు మాసంలో తాను ప్లాంటును సందర్శించి, అధికారులు, సిబ్బందితో భేటీ అవుతానని తెలిపారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రాస్, జన్కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య,ట్రాన్స్కో శ్రీనివాస్ డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి



# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ సారె కార్యక్రమం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై పవిత్ర ఆషాఢసారె కార్యక్రమం వైభవంగా ముగిసింది. ఆషాఢమాసం నెలరోజులూ దుర్గాదేవికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సారె పేరుతో రకరకాల కానుకలు అర్పించారు. జగన్మాతకు సారెను ఇవ్వడం వల్ల సౌమాంగళ్యం సిద్ధిస్తుందని, పంటలు బాగా పండుతాయని, ఆరోగ్యంగా ఉంటామని భక్తుల నమ్మకం. ఇంద్రకీలాద్రిపై స్వర్ణాభరణాలతో పసిడికాంతులు వెదజల్లే కనకదుర్గమ్మను ఆడపడుచుగా భావించి పిల్లాపాపలతో సహా తరలివచ్చి భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీక్రోధి నామసంవత్సరం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గత నెల ఆరోతేదీ నుంచి ప్రారంభమైన ఈ పవిత్రసారె కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. తొలిరోజు ఆలయ సంప్రదాయం ప్రకారం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వైదిక కమిటీ, అర్చకులు కుటుంబ సమేతంగా అమ్మవారికి ఆషాఢ పవిత్రసారెను సమర్పించగా.. చివరి రోజున ఆలయ ఈవో రామారావు, ఆలయ సిబ్బంది, పండితులు, ఇతర విభాగాల యంత్రాంగం కుటుంబ సమేతంగా సారె సమర్పించారు. ఆషాఢ సారె కార్యక్రమం దుర్గా నవరాత్రుల తర్వాత అంత పెద్ద ఉత్సవంగా మారింది. సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు ఈ సారె సమర్పణలో పాల్గొన్నారు.



# ఏడాదిలోగా 25 వేల ఉద్యోగాలు

**● ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా ఉపాధి ● ప్రతి జిల్లాలోనూ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు ● మంత్రి సవిత కీలక ప్రకటన**

అమరావతి.. నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా ఏడాది లోగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రకటించారు. దీనికోసం ప్రతి జిల్లాలోనూ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎనిమిదో తరగతి అర్హతతో గ్రామీణ ప్రాంత యువతకు రూ.5 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకూ రుణాలిస్తామన్న సవిత.. గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.ఏపీలో అధికార పగ్గాలు చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టిపెట్టింది. హామీల అమలుతో పాటుగా పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనపైనా ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోగా ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పనే తమ ప్రభుత్వం లక్ష్యమన్న మంత్రి.. ఈ క్రమంలోనే ఏడాదిలోపు 25 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. మంగళగిరిలోని ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ కార్యాలయంలో మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆప్కో దుకాణాల్లో ఉన్న చీరలను పరిశీలించారు. గోదాముల్లో ఉన్న చేనేత వస్త్రాలను పరిశీలించిన మంత్రి సవిత.. అమ్ముడుపోని చీరలను డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించి విక్రయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఖాదీ బోర్డు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన గురించి మాట్లాడారు. ఖాదీ బోర్డు ద్వారా ఏడాది లోగా 25 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్న మంత్రి.. ఇందుకోసం ప్రతి జిల్లాలో ట్రైనింగ్ సెంటర్లు తెరుస్తామని చెప్పారు. ఉపాధి లేని కారణంగా యువత పక్కదారులు పడుతున్నారని, వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు గానూ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. 8వ తరగతి అర్హతతో 5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ రుణాలు అందించి యువతకు ఉపాధి కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో మరిన్ని నిధులు తీసుకువస్తామని అన్నారు. మరోవైపు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా ప్రతి జిల్లాలోనూ ట్రైనింగ్ సెంటర్లు ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఈ 26 సెంటర్ల ద్వారా ఆయా జిల్లాల్లోని గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ రకంగా వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇక చదువుతో సంబంధం లేకుండా రుణాలు అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

## ఆత్మకూరులో రూ.100 కోట్లతో

# తాగునీటి ప్రాజెక్టు



ఆత్మకూరు: గత పాలకుల నిర్లక్ష్యం తోనే తాగునీరు సరిగా ఇవ్వలేక పోతున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఆదివారం ఆయన పర్యటించారు. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఆత్మకూరులో రూ. వంద కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రూ. 9.04 కోట్ల అమృత్ నిధులతో తాగునీటి పథకం పనులు ప్రారంభిస్తామన్నారు. ఆత్మకూరులో 5 సువేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లకు రూ.3.18 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# భారత రక్షణ ఎగుమతులు త్వరలో రూ. 80 వేల కోట్లు

**● ఘనంగా మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలు ● తెలుగు వైభవ పురస్కారాన్ని అందుకున్న రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జీ.సతీష్ రెడ్డి**



అవని గడ్డ : రక్షణ రంగ ఎగుమతుల్లో భారతదేశం త్వరలో 50 వేల కోట్ల నుంచి 80 వేల కోట్ల రూపాయిల స్థాయికి ఎదిగే అవకాశం ఉందని భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జీ.సతీష్ రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలి వెంకట కృష్ణారావు స్మారక తెలుగు వైభవ పురస్కారాన్ని డాక్టర్ సతీష్ రెడ్డి అందుకున్నారు. భారత రక్షణ శాస్త్రవేత్త జి. సతీష్ రెడ్డికి మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని మండలి ఫౌండేషన్ అధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్ ప్రధానం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందిన సతీష్ రెడ్డి తెలుగువాడు కావడం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో తెలుగు జాతి తలెత్తుకుని తిరిగేలా చేసిన సతేష్ రెడ్డి పురస్కారం పొందడానికి అవనిగడ్డకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. 140 కోట్లు ఉన్న భారత దేశ ప్రజలు హాయిగా నిద్ర పోవాలంటే సతేష్ రెడ్డి లాంటి శాస్త్రవేత్తలు చాలా అవసరమని కొనియాడారు.

భారతరక్షణ శాస్త్రవేత్త సతీష్ రెడ్డి మాట్లాడుతూ, మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం తనకు అందించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు. ఈ పురస్కారాన్ని తనకు అందించటం శాస్త్రవేత్తలు అందరికి దక్కిన గౌరవమని అన్నారు. తెలుగువారి కోసం తెలుగు భాష, అభివృద్ధి కోసం మండలి కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. రాబోయే రోజుల్లో నిమ్మకూరు దగ్గర ఏర్పాటు చేస్తున్న బెల్ కంపెనీ, నాగాయలంకలో ఏర్పాటు చేస్తున్న క్షిపణి పరీక్ష కేంద్రం ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదం పడుతాయని పేర్కొన్నారు. మండలి పురస్కారాన్ని తనకు అందించినందుకు మండలి ఫౌండేషన్కు, బుద్ధ ప్రసాద్కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సతీష్ రెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదరావు, ఆత్మీయ అతిథులు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకులు కూచిభోట్ల ఆనంద్, జమీన్ రైతు సంపాదకులు డోలేంద్ర ప్రసాద్, అవనిగడ్డ బస్టాండ్ సెంటరులో అదే విధంగా గాంధీ క్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజయలక్ష్మి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి డాక్టర్ జి. సతీష్ రెడ్డిని ఘనంగా సత్కరించి, మండలి వెంకట కృష్ణారావు స్మారక తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేశారు.

# ఇంటర్ తర్వాత ఉజ్వల భవిష్యత్

**● ఇంటర్ మీడియట్ తర్వాత ఐటి రంగంలో విద్య మరియు ఉపాధి ● టెక్బీ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు హెచ్‌సిఎల్ టెక్ డిజిటల్ సపోర్ట్ విద్యను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పన ● రాష్ట్రంలోని జిల్లాల వారీగా ప్రత్యేకమైన డ్రైవ్‌ల ద్వారా విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక.. ● ఇంటర్ మీడియట్‌లో ఒకేషనల్, సిఇసి, హెచ్ఇసి, బైపీసీ విద్యార్థులకు అర్హత ● ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సిఇఓ ఎన్. సుర్జీత్ సింగ్**

ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్ మీడియట్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఐటి సేవలకు తోడ్పడే డిజిటల్ సపోర్ట్ విద్యను ఒక సంవత్సరం కాలం పాటు అందజేయనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సిఇఓ ఎన్. సుర్జీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు భారత దేశంలో పేరొందిన ఐటి కంపెనీల్లో ఒకటైన హెచ్ సి ఎల్ కంపెనీ డిజిటల్ విద్యను అందించి ఉపాధి కల్పించడం జరుగుతుందని ఉపాధి పొందుతూనే విద్యార్థులు ఉన్నత విద్యను సైతం పొందవచ్చునని అయన తెలిపారు. ఈ ఐటి విద్యను పొందడానికి విద్యార్థులు ఇంటర్ మీడియట్ తత్సమాన కోర్సు ను 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో పూర్తి చేసి ఉండాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు తప్పనిసరిగా ఒకేషనల్, సిఇసి, హెచ్ ఇ సి, బైపీసీ గ్రూప్ లలో చదివి ఉండాలన్నారు. ఏడాది కాలం పాటు టెక్బీ ప్రోగ్రాం కు ఎంపిక అయిన అభ్యర్థులు శిక్షణ అనంతరం 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ఉపాధి పొందుటకు అర్హులుగా నిర్దేశించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మొదట హెచ్ సి ఎల్ కెరీర్ ఆప్టి ట్యూడ్ టెస్ట్ ఉంటుందని, అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇంటర్ వ్యూ ఉంటుందన్నారు.

ఇంటర్ వ్యూ లో ఎంపికైన అభ్యర్థులకు వర్సట్ కమ్యూనికేషన్ టెస్ట్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియల్లో విజయం సాధించిన విద్యార్థులకు నియామక పత్రం అందించడం జరుగుతుందని సిఇఓ చెప్పారు. అభ్యర్థులకు ఏడాదికాలం పాటు మధురై, చెన్నై నగరాల్లో నెలకొన్న హెచ్ సి ఎల్ కేంద్రాల్లో శిక్షణను అందించడం జరుగుతుందని చెప్పారు. మూడు నెలల పాటు తరగతి గదుల శిక్షణ, మిగిలిన 9 నెలలు ఇంటర్న్ షిప్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులకు నెలకు 10 వేల రూపాయలు స్టైఫండ్ చెల్లిస్తారని చెప్పారు. పూర్తి స్థాయి ఉద్యోగులుగా ఎంపిక అయిన వారికి సంవత్సరానికి రూ. 1.7 లక్షల వేతనం ఉంటుందని పనితీరు ఆధారంగా ప్రతీ సంవత్సరం వేతనంలో పెంపు ఉంటుందని చెప్పారు. హెచ్ సి ఎల్ లో ఉద్యోగం చేస్తూనే శాస్త్ర, అమిటీ, కెఎల్ యూనివర్సిటీలలో ఉన్నత విద్య చేసుకునే అవకాశం సైతం ఉన్నదని చెప్పారు. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ కోసం .. ను వీక్షించాలని చెప్పారు. 2024 విద్యా సంవత్సరానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయినదని సిఇఓ చెప్పారు. ఇతర వివరాలకు 9642973350, 7780323850, 7780754278, 6363095030 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చున్నారు. జిల్లాల వారీగా కృష్ణా ఆగష్టు 6న, నెల్లూరు ఆగష్టు 8న, గుంటూరు, ప్రకాశం, చిత్తూర్ లలో ఆగష్టు 9న, కడప ఆగష్టు 10న, కర్నూలు ఆగష్టు 13న, అనంతపురం ఆగష్టు 17న, పశ్చిమ గోదావరి ఆగష్టు 19న, తూర్పు గోదావరి ఆగష్టు 20న, విశాఖ ఆగష్టు 22న, విజయనగరం ఆగష్టు 23న, శ్రీకాకుళం ఆగష్టు 24 తేదీలలో ఐటి కోర్సు లలో ఎంపికకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని సిఇఓ తెలిపారు.

**ఇంటర్ తర్వాత ఏడాది శిక్షణ – డిజిటల్ సపోర్టు ఉద్యోగం:**

ఈ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు కొర్నాని యామిని, షేక్ అర్షద్, పడవల వినోద్ రాజ్, ఉప్పల వెంకట కావ్య లు మాట్లాడుతూ తాము హెచ్ సి ఎల్ లో ఉద్యోగం చేస్తూనే ఉపాధి పొందడంతో పాటుగా ఉన్నత విద్యను సైతం అభ్యసిస్తూ జీవితంలో రాణించామని చెప్పారు. ఈ కోర్సును పూర్తి చేయడం వలన మెరుగైన ఫలితాలను పొందడంతో పాటుగా ఉన్నత విద్య మరియు ఉన్నత ఉద్యోగం ఎక్కువ వేతనం పొంది జీవితాన్ని సార్ధకత చేసుకున్నామని తమ మాటల్లో చెప్పారని ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సిఇఓ ఎన్. సుర్జీత్ సింగ్ ఆ ప్రకటనలో చెప్పారు.

# అపర భగీరథుడు చంద్రబాబు

**● రాయలసీమ మొనగాడు ● పెన్నా-గోదావరినదుల అనుసంధానానికి యత్నం ● ఐకాన్ బ్రిడ్జ్‌గా సిద్ధేశ్వరం బ్యారేజ్ ● బిజేపీ నేత టి.జి.వెంకటేష్**

సిద్దేశ్వరం : చంద్రబాబు అపర భగీరథుడని..రాయలసీమ మొనగాడు అంటూ మాజీ మంత్రి టీజీ వెంకటేష్ కొనియాడారు. ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కోటి శివలింగాలను మట్టితో తయారుచేసి కాశికి తీసుకుని వెళ్తున్న నేపథ్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమనే కాదు రాష్ట్రం మొత్తాన్ని అభివృద్ధి చేయగలిగిన సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని టీజీ వెంకటేష్ అభిప్రాయపడ్డారు. రాయలసీమలో పెండింగ్లో ఉన్న సాగు నీరు, తాగునీటి ప్రాజెక్టులు త్వరలో పూర్తి కానున్నాయని ఆయన స్పష్టం చేశారు. పెన్నా-గోదావరి నదుల అనుసంధానానికి సీఎం భగీరథ యజ్ఞం చేస్తున్నారని తెలిపారు. సిద్ధేశ్వరం బ్యారేజ్ను ఐకాన్ బ్రిడ్జ్గా మార్చాలన్న ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. విభజన హామీల్లో వచ్చింది తీసుకోవాలి.. లేని దాని కోసం పాకులాడకూడదన్నారు. విభజన హామీలు వచ్చే వాటిపై కామెంట్ చేస్తే మనకే నష్టమంటూ పేర్కొన్నారు. ఫ్యాక్షన్ను అణచి వేయడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందని టీజీ వెంకటేష్ తెలిపారు. మోదీ ఆశీస్సులు మనకు మెండుగా ఉన్నాయి.. మోదీ ఆశీస్సులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. మదనపల్లి దగ్ధం కేసులో చట్టం తన పని తాను చేస్తోందని.. తప్పు చేసి ఉంటే ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఒకటిన్నర నెలకే జగన్ ఎన్డీయే ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు హాస్యాస్పదం అన్నారు. జగన్ చేష్టలతో ప్రజల్లో ఉన్న కాస్త విశ్వాసాన్ని కోల్పోతున్నాడని టీజీ వెంకటేష్ తెలిపారు.

**ఎన్నికల ముందే జోస్యం చెప్పిన టీజీ వెంకటేష్..**

అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం అధికారం టీడీపీ అధినేత చంద్రబాబుదేనని టీజీ వెంకటేష్ అప్పుడే జోస్యం చెప్పారు. వెనుకబడిన రాయలసీమ హక్కుల సాధనే లక్ష్యంగా రాయలసీమ హక్కుల ఐక్యవేదికను ప్రారంభించారు. రాయలసీమలో సమ్మర్, వింటర్ క్యాపిటల్, మినీ సెక్రటేరియట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రాజకీయాల్లో



ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న నేతగా ఆయన ఎదిగారు. 1999లో టీడీపీ తరఫున కర్నూలులో ఎమ్మెల్యేగా గెలిచారు. పార్టీలు మారి ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. కానీ ఆయన కొడుకు మాత్రం టీడీపీనే అంటి పెట్టుకుని ఉన్నారు. గత రెండు దశాబ్దాలుగా కర్నూలు సిటీ రాజకీయాల్లో తండ్రీ కొడుకులది చెరగని ముద్ర. 2014 , 2019 ఎన్నికలలో స్వల్ప తేడాతోనే ఓడిపోయారు. 2014లో టీజీ వెంకటేష్ మూడు వేల ఓట్ల తేడాతో.. 2019లో టీజీ భరత్ వైసీపీ వేవ్లోనూ ఐదు వేల ఓట్ల తేడాతోనూ పరాజయం పాలయ్యారు. ఈ సారి ఎమ్మెల్యేగా గెలిచి, పరిశ్రమల శాఖ మంత్రి అయ్యారు.

## సీఎం చంద్రబాబు పాలనలో

# ఏపీ అభివృద్ధి పరుగులు

**కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ**



తిరుపతి: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో కేంద్రమంత్రికి అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం శ్రీనివాసవర్మ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని కేంద్ర మంత్రి చెప్పారు. గత ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెన్నకి పోయిందని ఆయన మండిపడ్డారు. జగన్ అనే గ్రహణం కారణంగా ఏపీలో దేవాలయాలను కూడా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఏపీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసవర్మ చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన బడ్జెట్లోనూ ఏపీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. అమరావతి అభివృద్ధికి రూ.15వేల కేటాయించారని, ఇచ్చిన హామీ మేరకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

రానున్న రోజుల్లో ఏపీ కష్టాలు మరిన్ని తీరనున్నాయని వెల్లడించారు. వైసీపీ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలతోపాటు కొత్త పరిశ్రమలను సైతం ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటించారు.

# ఇంటి దగ్గరికే రైతు బజార్



**● ఆంధ్రాలో కూటమి సర్కార్ కొత్త ప్రయోగం**

అమరావతి.... రాష్ట్రంలో రైతు బజార్ల బలోపేతం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా శ్రమిస్తోంది. పలు నూతన ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు చేర్పాటు చేసి బియ్యం సహా పలు నిత్యావసర సరుకులను రాయితీకే ప్రజలకు అందిస్తోంది. తాజాగా రైతు బజార్ల బలోపేత అంశంలో కూటమి సర్కార్ మరో అడుగు ముందుకేసింది. అదే మొబైల్ రైతు బజార్లు. ఈ విషయం ఎప్పటి నుంచో చర్చల్లో ఉన్నా అమల్లోకి మాత్రం రాలేదు. అమలు చేసేలా చర్యలు కూడా వేగవంతం కాలేదు. కాగా ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రజల చెంతకే రైతు బజార్లను తీసుకెళ్లాలని నిశ్చయించుకుంది. అందుకోసమే ఈ ప్రణాళిక అమలును వేగవంతం చేసింది. వీలైనంత త్వరగా పలు జిల్లాల్లో మొబైల్ రైతు బజార్లను ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రైతు బజార్ల సీఈఓ శేఖర్ బాబు వెల్లడించారు. తొలి విడత మొబైల్ రైతు బజాలర్లలో భాగంగా విశాఖ, రాజమండ్ర, విజయవాడ, తిరుపతి, కర్నూలు వరి నగరాల్లో అపార్ట్మెంట్లు, శివారు కాలనీల్లో ఉండే ప్రజలకు రైతు బజారు సేవలను అందుబాటులోకి తీసుకెళ్లాలని, అందుకోసం 100 మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు శేఖర్ వివరించారు.

ఈ మేరకు తాము చేసిన ప్రతిపాదనపై ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం గుంటూరు, విజయవాడలో కలిసి మొత్తం 16 రైతు బజార్లు మాత్రమే ఉన్నాయని, ఇక రాష్ట్రవ్యాప్తంగా 111 రైతు బజార్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. వాటి సంఖ్యను గణనీయంగా పెంచడానికి కసరత్తులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అంగర, రాయవరం, బాపట్ల, వేంపల్లి, వెలుగోడు, ఆత్మకూరు. పొద్దుటూరు, అనపర్తి, సాలూరు, ఆళ్లగడ్డ, పత్తికొండ, మదనపల్లిలో నిర్మించిన కొత్త రైతు బజార్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటుగా మొబైల్ రైతు బజార్ల ప్రణాళికతో ప్రజల ఇంటికే కూరగాయలు చేరవేసేలా కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్నా సమాచారం. మొబైల్ రైతు బజార్ల ద్వారా రైతులకే కాకుండా ప్రజలకు కూడా మేలు చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. నాణ్యమైన, తాజా కూరగాయాలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా వారి జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చవచ్చని ప్రభుత్వ యోచిస్తోంది. కాగా కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులను ఈ మొబైల్ రైతు బజార్లుగా మార్చాలని గతంలో కూడా చర్చలు జరిగాయి. మరి ఇప్పటి ప్రభుత్వం అదే మార్గంలో వెళ్తుందా లేదంటే వేరే వాహనాలను ఏమైనా సమకూరుస్తుందా అనేది చూడాలి.

## వృద్ధుల దర్శనంపై సోషల్ మీడియా

# తప్పుడు ప్రచారం

**నమ్మవద్దని భక్తులకు తితిదే విజ్ఞప్తి**



తిరుమల: వృద్ధుల దర్శనంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది. రోజూ వెయ్యి మంది వృద్ధులు, దివ్యాంగులకు దర్శనం కల్పిస్తున్నామని తెలిపింది. మూడు నెలల ముందే ప్రతినెలా 23న ఆన్లైన్ కోటా విడుదల చేస్తున్నామని పేర్కొంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్/పీహెచ్సీ లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వెల్లడించింది. భక్తులు సరైన సమాచారానికి తితిదే అధికారిక వెబ్సైట్ను మాత్రమే సంప్రదించాలని సూచించింది.

## కేదార్‌నాథ్‌లో తెలుగు యాత్రికుల

# తరలింపునకు సన్నాహాలు

న్యూఢిల్లీ.... తెలుగు రాష్ట్రాలకు చెందిన 15 మంది యాత్రికులు కేదార్నాథ్లో చిక్కుకున్నారు. గత నెల 31న అక్కడికి వెళ్లిన వారు వర్షాలకు రహదారులు తెగిపోవడంతో తిరిగి రాలేకపోయారు. ఏపీకి చెందిన అడప సత్యనారాయణ్... కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా మంత్రి స్పందించారు. యాత్రికులను తరలించడానికి చర్యలు చేపట్టాలని రుద్రప్రయాగ్ కలెక్టర్కు సూచించారు. శనివారం హెలికాప్టర్ ద్వారా 12 మంది యాత్రికులను ఉత్తర కాశీకి తరలించారని, తెలంగాణకు చెందిన ముగ్గురు యాత్రికులు అక్కడే ఉన్నారని సత్యనారాయణ్ తెలిపారు.

గుండెలను మెలిపెడుతున్న చిన్నారి లేఖ ప్రకృతి విలయంతో అల్లకల్లోలమైన వయనాడ్లో ఇండియన్ ఆర్మీ సహాయ చర్యలు చేపట్టింది. ఆర్మీ ధైర్యసాహసాలను చూసి చలించిపోయిన మూడో తరగతి విద్యార్థి రాసిన లేఖ అందరి హృ



ఎదయాలను కదిలిస్తోంది. డియర్ ఇండియన్ ఆర్మీ వయనాడ్లో మీరు చేస్తున్న సాహసాలను చూసి చలించిపోయాను. ఏదో ఒక రోజు సైన్యంలో చేరాలని కోరుకుంటున్నా. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది అని మలయాళంలో విద్యార్థి రేయాన్ లేఖ రాశాడు.

# ఒరిగిన నృత్య శిఖరం

- అంతర్జాతీయ వేదికలపై తెలుగు కీర్తిపతాకం
- నృత్య కళకే జీవితం అంకితం చేసిన యామిని కృష్ణమూర్తి

**ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నర్తకి యామినీ కృష్ణమూర్తి కన్నుమూశారు. 84 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె.. ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. భరత నాట్యం, కూచిపూడి నృత్యంతో భారత దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేసిన యామినీ కృష్ణమూర్తి.. పదహారణాల తెలుగింటి ఆడపడుచు. క్షీరసాగర మథనంలో మోహినీగా, భామాకలాపంలో సత్యభామ, ఉషాపరిణయంలో ఉషగా, శశిరేఖాపరిణయంలో శశిరేఖగా ఎన్నో నృత్యరూపకాల్లో పలు పాత్రలను పోషించి ప్రశంసలు అందుకున్నారు.**





ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి కళాకారిణి యామినీ కృష్ణమూర్తి కన్నుమూశారు. ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యామినీ కృష్ణమూర్తి శనివారం తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం ఆమె వయసు 84 ఏళ్లు కాగా, గత కొంతకాలం నుంచి యామిని కృష్ణమూర్తి వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గత ఏడు నెలలుగా ఐసీయూలో ఉండి చికిత్స పొందుతున్న ఆమె కన్నుమూశారని యామిని కృష్ణ మూర్తి మేనేజర్, సెక్రటరీ గణేష్ పిటిఐతో మాట్లాడుతూ తెలిపారు. యామినీ కృష్ణమూర్తి ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబర్ 20వ తేదీన యామినీ కృష్ణమూర్తి జన్మించారు. పౌర్ణమి రోజు జన్మించడంతో ఆమెకు యామినీ పూర్ణ తిలక అనే పేరును ఆమె తాతగారు నామకరణం చేశారు. యామినీ కృష్ణమూర్తి భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలు. కూచిపూడి నృత్యానికి దేశవిదేశాలలో ఎంతో పేరు తెచ్చి పెట్టారు. కర్ణాటక సంగీతం నేర్చుకుని, పాటపాడుతూ నృత్య ప్రదర్శనలు ఇచ్చేవారు

## ఐదేళ్ల వయసులోనే..

తన తండ్రి ప్రోత్సాహంతో 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. అనంతరం కూచిపూడి, ఒడిస్సీ కూడా అభ్యసించారు. చెన్నైలోని కళాక్షేత్ర స్కూల్ ఆఫ్ డ్యాన్స్లో ప్రముఖ డ్యాన్సర్ రుక్మిణీ దేవి అరుండేల్ ఆధ్వర్యంలో భరత నాట్యం నేర్చుకున్నారు. 1956లో తొలి ప్రదర్శన ఇచ్చిన యామినీ కృష్ణమూర్తి.. కాంచీ పురం ఎల్లప్ప పిళ్లై, తంజావురు కిట్టప్ప పిళ్లై వద్ద భరత నాట్యానికి మెరుగులు దిద్దుకున్నారు. ఎండీ రామనాథన్ వద్ద కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకున్నారు. యామిని తన తొలి ప్రదర్శనను తన 17వ ఏట 1957లో చెన్నైలో ఇచ్చారు. 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడ మద్రాసులోని వేదాంతం లక్ష్మినారాయణ శాస్త్రి దగ్గర యామినీ కూచిపూడి నేర్చుకున్నారు. ఆ తర్వాత పంకజ్ చరణ్ దాస్, కేలుచరణ్ మోహపాత్ర వంటి వారి వద్ద ఒడిస్సీ నేర్చుకున్నారు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీలతో పాటుగా కర్ణాటక గానం, వీణలో శిక్షణ పొందారు.భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలను నేర్చుకుని ప్రదర్శణలు ఇస్తూ నిష్ణాతురాలు అయ్యారు. కర్ణాటక సంగీతంలోనూ ఆమెకు ప్రావీణ్యం ఉంది. 1957లో యామిని కృష్ణమూర్తి తొలి నృత్య ప్రదర్శన ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన ఆమె.. టీటీడీ ఆస్థాన నర్తకిగానూ సేవలందించారు.

## నాట్యంలో విశ్వమోహిని

యామినీ కృష్ణమూర్తి తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగానూ వ్యవహరించారు. ప్రఖ్యాత నాట్యాచారుడు వెంపటి చినసత్యం నేతృత్వంలో కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో మొట్టమొదట ప్రదర్శించిన క్షీరసాగర మథనంలో విశ్వమోహిని పాత్రలో ఆమె నటించి రక్తి కట్టించారు. నాటి నుంచీ నాట్యాభిమానులు తనను విశ్వమోహినిగా పిలవడం మొదలుపెట్టారు. తర్వాత క్షీరసాగర మథనం నృత్యనాటికను సర్వేపల్లి రాధాకృష్ణన్ సమక్షంలో ప్రదర్శించి ప్రశంసలు పొందారు. అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, మయన్మార్ వంటి దేశాల్లో యామినీ కృష్ణమూర్తి నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేశారు. దిల్లీలో నృత్యకౌస్తుభ కల్చరల్ సోసైటీ యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు. భారత్లోనే కాదు అంతర్జాతీయంగా సైతం పలు దేశాలలో ప్రదర్శనలు ఇచ్చి మెప్పు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా యామిని కృష్ణమూర్తి సేవలు అందించారు.

## డకోటా ఫ్లైట్‌లో పాకిస్తాన్‌కు..

యామినీ కృష్ణమూర్తి నాట్యం గురించి తెలుసుకున్న పాకిస్తాన్ దేశస్తులు.. అక్కడ ప్రదర్శన నిమిత్తం ఆహ్వానించారు. దీంతో 1970లో ఆమె లాహోర్లో ప్రదర్శన ఇచ్చారు. ఆ సమయంలో భారత్ నుంచి డకోటా ఫ్లైట్లో అతికష్టం మీద పాక్కు వెళ్లాల్సి వచ్చి ందని పలు సందర్భాల్లో ఆమె ప్రస్తావించారు. భరతనాట్యం, కూచిపూడి నాట్యప్రదర్శలను చూసిన పాకిస్థానీలు మంత్రముగ్ధులై పలుమార్లు ఆమెను ఆహ్వానించడం విశేషం. ప్రముఖ సేవామూర్తి మదర్ థెరెసా చేతుల మీదుగా యామిని జ్ఞాపికను అందుకోవడం విశేషం.

## నాట్యానికి జీవితం అంకితం

నాట్య రంగానికే జీవితాన్ని అంకితం చేసిన యామిని వివాహం చేసుకోలేదు. తన నృత్య జీవిత విశేషాలను, నృత్యం నేర్చుకొనే క్రమంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, నేర్పించిన గురువుల వివరా లతో ఎ ప్యాషన్ ఫర్ డ్యాన్స్ పేరుతో పుస్తకం రచించారు. హైదరాబాద్ యామినీ కృష్ణమూర్తికి హైదరాబాద్తో అనుబంధం ఉంది. సౌత్ ఇండియా కల్చరల్ అసోసియేషన్, కళాసాగర్ వంటి సంస్థలు ఏర్పాటు చేసిన అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆమె దశావతారం, కృష్ణ శబ్దం తదితర ప్రదర్శనలిచ్చి ప్రేక్షక లోకాన్ని మైమరిపించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన ఆమె నృత్య ప్రదర్శన హైదరాబాద్ కళాప్రియులకు సుపరిచితం. తెలుగు విశ్వవిద్యాలయం ఆమెను సిద్ధేంద్రయోగి పురస్కారంతో గౌరవించింది. 2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాల్లో ప్రదర్శనలిచ్చారు.



## పద్మ అవార్డులతో సత్కరించిన కేంద్ర ప్రభుత్వాలు

ఢిల్లీలో డ్యాన్స్ అకాడమీ స్థాపించి శాస్త్రీయ నృత్యకళారూపాల్లో ఎంతో మందికి శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వాలు ఆమె సేవల్ని గుర్తించి పలు అవార్డులతో సత్కరించాయి. మొదటగా 1968లో యామిని కృష్ణమూర్తిని పద్మశ్రీ అవార్డు వరించింది. ఆపై 2001లో పద్మ భూషణ్, 2016లో రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ తో కేంద్ర ప్రభుత్వం ఆమెను గౌరవించింది. 1977లో సంగీతనాటక అకాడమీ అవార్డు కైవసం చేసుకున్నారు. అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, మయన్మార్ వంటి దేశాల్లో యామినీ కృష్ణమూర్తి నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేశారు. దిల్లీలో నృత్యకౌస్తుభ కల్చరల్ సోసైటీ యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు.





### ప్రముఖుల సంతాపం

యామినీ కృష్ణమూర్తి మృతికి సీఎం రేవంతడ్డి సంతాపం తెలిపారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యత్యకళలకు ఆమె విశిష్ట సేవలందించారని, ఎంతోమంది యువతకు నాట్యం నేర్పించి కళారంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని ఆయన అన్నారు. డిల్లీలో యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్సు స్థాపించి ఎంతోమంది యువతరానికి శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇచ్చి గురుదక్షత చూపించారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు తెలిపారు. శాస్త్రీయ నృత్యానికి యామినీ కృష్ణమూర్తి అమోఘమైన సేవలందించారని ఏపీ సీఎం చంద్రబాబు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు జి.కిష్రనెడ్డి, బండి సంజయ్ కొనియాడారు. ఆమె ఆకాశంలో తారలా ప్రకాశించిన గొప్ప నాట్య కళాకారిణి అని రాజ్యసభ మాజీ సభ్యుడు సోనాల్ మాన్సింగ్ అన్నారు. ప్రసిద్ధ కూచిపూడి నృత్యజంట రాజా, రాధారెడ్డి నటరాజు పాదాల చెంత ఆమె మోక్షం పొందారు అని అంజలి ఘటించారు. భారతీయ నృత్యత్యానికి యామిని ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చారని భరతనాట్య కళాకారిణి జయలక్ష్మి ఈశ్వర్ అన్నారు.

### కళకే అంకితమైన నృత్యమూర్తి



నృత్యకళపై ప్రజల్లో అవగాహన, అభిరుచిని పెంచడానికి సుమారు మూడేళ్లు ఆమె చేసిన పరిశోధనపై నృత్యమూర్తి ధారావాహికను 13 భాగాలుగా దూరదర్శన్ ప్రసారం చేసింది. దిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ సంస్థకు డైరెక్టర్గానూ యామిని సేవలు అందించారు. ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఆమెపై 20 నిమిషాల డాక్యుమెంటరీని తీసింది. 1989లో విడుదలైన చందనీర్ అనే బెంగాలీ సినిమాలో డాక్టర్ యామినీ కృష్ణమూర్తి అనే తన పాత్రలోనే ఆమె నటించారు. స్వీయచరిత్రను ఎ పేషన్ ఫర్ డాన్స్ శీర్షికతో ఆంగ్లంలో రాశారు. మహాత్మాగాంధీ బోధనల స్ఫూర్తితో గాంధీయన్ ఆర్డర్ ఆఫ్ లైఫ్ అనే నృత్య రూపకాన్ని.. రవీంద్రనాథ్ టాగోర్, సుబ్రహ్మణ్య భారతి మాటలతో ప్రేరణ పొంది కాళికాదేవి సందేశంతో కూడిన నృత్యరూపకాన్ని రూపొందించారు.



## మే.. ఇంగ్లిస్‌లో అడిగితే బాబర్‌కు కష్టమే కదా!: పాక్ ఫ్యాన్‌కు హర్భజన్ కౌంటర్

భారత క్రికెటర్లను ఏమైనా అంటే సరైన సమాధానం ఇచ్చేందుకు హర్భజన్ సింగ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. తాజాగా ఇర్ఫాన్ పఠాన్ విషయంలో పాక్ అభిమాని చేసిన పోస్టుపై తీవ్రంగా స్పందించాడు. పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లు, ఆ దేశ క్రికెట్ అభిమానులు, జర్నలిస్టుకు భారత్పై అక్కసు వెళ్లగక్కడం సర్వసాధారణమైంది. సోషల్ మీడియా వేదికగా పనికిరాని పోస్టులు పెడుతూ సంబరపడుతున్నారు. అయితే, వాటికి గట్టి కౌంటర్ ఇవ్వడంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఇటీవల ఓ పాక్ జర్నలిస్ట్ తమ దేశానికి ఛాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత్ రావాలని పెట్టిన పోస్టుకు భజ్జీ ప్రతిస్పందించిన సంగతి తెలిసిందే. తాజాగా పాక్ క్రికెట్ అభిమాని ఒకరు తమ కెప్టెన్ బాబర్ అజామ్ను హైలైట్ చేస్తూ.. భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ను తక్కువ చేసేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. దానిపైనా హర్భజన్ (స్పందించి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇంతకీ ఏమైందంటే..వరల్డ్ కప్లో ఓ మ్యాచ్ ముగిసిన తర్వాత పాక్ కెప్టెన్ బాబర్ అజామ్ సహచరులతో కలిసి మైదానాన్ని వీడుతున్నాడు. అప్పుడు ఇంటర్వ్యూ ఇవ్వాలని బాబర్ను వ్యాఖ్యాత ఇర్ఫాన్ పఠాన్ మొత్తుకున్నాడని.. తమ కెప్టెన్ పట్టించుకోలేదని పాక్ ఫ్యాన్ ఓ వీడియోను షేర్ చేశాడు. అయితే, అందులో ఎక్కడా ఇర్ఫాన్ కనిపించలేదు. దీనిపైనే హర్భజన్ కౌంటర్ ఇచ్చాడు. ఇందులో ఇర్ఫాన్ పఠాన్ ఎక్కడ?అసలు నీకు మాట్లాడే మర్యాద తెలియదు. నీ కళ్లు ఇప్పుడు నిజాన్ని చూడటం కూడా మానేశాయా? అసలు ఇది ఒరిజినల్ కాదు. సరే, ఒకవేళ అలానే జరిగిందని అనుకుందాం.. ఆంగ్లంలో ప్రశ్నలు అడిగితే పాపం మీ కెప్టెన్కు కష్టమే కదా! అని హర్భజన్ కౌంటర్ ఇచ్చాడు.

## నీరజ్ గోల్డ్ సాధిస్తే..

# భారతీయులకు బంపర్ ఆఫర్

టోక్యో ఒలింపిక్స్లో బంగారు పతకం సాధించి దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రాపై మరోసారి భారీ అంచనాలే ఉన్నాయి. పారిస్ ఒలింపిక్స్లోనూ ఈ సారి బంగారు పతాకం సాధిస్తారనే ఆశాభావాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆన్లైన్ వీసా ప్లాట్ఫాం అట్లీస్ వ్యవస్థాపకుడు భారతీయులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఒకవేళ ఒలింపిక్స్లో నీరజ్ స్వర్ణం గెలిస్తే వినియోగదారులకు ఉచితంగా వీసా అందిస్తామని ప్రకటించారు.

ఆగస్టు 6న జరగనున్న ఒలింపిక్స్ జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా పాల్గొననున్నాడు. ఈ క్రమంలోనే అట్లీస్ సీఈవో మోహక్ నహ్తా సోషల్ మీడియాలో ఈ ప్రకటన చేశారు. ఒక వేళ నీరజ్ భారత్కు పతకం సాధిస్తే.. ఒక రోజు ఉచితంగా వీసా సేవలను అందిస్తానంటూ పేర్కొన్నారు. ఈ సేవలను పొందాలనుకునే వారికి కొన్ని నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు.

నీరజ్ చోప్రా బంగారు పతకం గెలిస్తే..

ఆగస్టు 8న ఈ సేవలు అమలులోకి వస్తాయి. కేవలం అట్లీస్ వినియోగదారులకు మాత్రమే ఈ సేవలు వర్తిస్తాయి. వీసా పూర్తిగా ఉచితం. ఆ రోజు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు.

ఒక్కరోజు మాత్రమే ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆ రోజున ప్రపంచంలో పలుదేశాలకు వెళ్లేందుకు వీలు కల్పిస్తున్నారు.

ఈ సేవలను పొందాలనుకుంటే.. మోహక్ నహ్తా ఖాతాలోని కామెంట్ సెక్షన్లో వినియోగదారులు తమ ఈమెయిల్ ఐడీని తెలియజేయాల్సి ఉంటుంది. తద్వారా ఉచిత వీసా ఖాతా క్రియేట్ అవుతుంది.

కాగా.. పారిస్ ఒలింపిక్స్లో షూటింగ్ విభాగంలో భారత్ మూడు పతకాలను సాధించింది. బాడ్మింటన్ విభాగంలో సెమీఫైనల్ చేరుకుని చరిత్ర సృష్టించిన భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే.. గత ఒలింపిక్స్లో నీరజ్ మాత్రం సరైన సమయంలో అత్యుత్తమ ప్రదర్శనతో (87.58 మీటర్లు) ఒలింపిక్స్ స్వర్ణం సాధించాడు. ఈ సారి కూడా మరో బంగారు పతాకాన్ని సాధిస్తాడనే అంచనాలు పెరిగిపోయాయి.



# నీ నుంచి మెడల్‌ను దోచేశారు...

## వివాదాస్పదంగా మారిన బాక్సర్ నిశాంత్ దేవ్ ఓటమి

బాక్సింగ్లో భారత్కు మరో ఓటమి ఎదురైంది. 71 కేజీల విభాగంలో నిశాంత్ దేవ్ పరాజయం పాలయ్యాడు. అయితే, ఈ పోరు స్కోరింగ్ వివాదాస్పదంగా మారింది. అత్యుత్తమ ప్రదర్శన చేసినప్పటికీ పారిస్ ఒలింపిక్స్లో భారత్ బాక్సర్ నిశాంత్ దేవ్కు నిరాశ ఎదురైంది. 71 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్లో మెక్సికో బాక్సర్ మార్కో వెర్డే చేతిలో 4-1 తేడాతో నిశాంత్ ఓడిపోయాడు. తొలి రౌండ్లో ఆధిక్యం ప్రదర్శించినప్పటికీ.. వరుసగా రెండు రౌండ్లలో ప్రత్యర్థి గెలిచాడు. నిశాంత్ ప్రతి రౌండ్లోనూ మెరుగ్గానే రాణించినా.. జడ్జీలు మాత్రం వెర్డెను విజేతగా ప్రకటించడంతో విమర్శలు వచ్చాయి. నిశాంత్కు మద్దతుగా భారత మాజీ ఛాంపియన్ విజేందర్ సింగ్, బాలీవుడ్ నటుడు రణ్దీప్ హుడా పోస్టులు పెట్టారు. అసలు స్కోరింగ్ సిస్టమ్ ఎలా చేశారో అర్థం కావడం లేదు. ఇది గొప్ప ఫైట్. నిశాంత్ చాలా అద్భుతంగా పోరాడాడు. బాధపడొద్దు నిశాంత్ అని విజేందర్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టాడు. బాలీవుడ్ స్టార్ రణ్దీప్ హుడా కూడా ఒలింపిక్ కమిటీపై కాస్త ఘాటుగానే స్పందించాడు. ఈ పోటీలో నిశాంత్ విజయం సాధించాడు. స్కోరింగ్ విధానం సరైందేనా? నీ నుంచి పతకాన్ని దోచేశారు. కానీ, నువ్వు మా మనసులను గెలిచావు. అత్యంత బాధాకరం. ఇలాంటివి చాలా జరిగాయి అని పేర్కొన్నాడు.

తొలి నుంచీ..

భారత బాక్సర్ నిశాంత్ తొలి నుంచీ చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ప్రత్యర్థిని విజేతగా ప్రకటించే సమయంలోనూ అతడితోపాటు అభిమానులకు నమ్మశక్యంగా అనిపించలేదు. మొదటి రౌండ్లో వెర్డెపై నిశాంత్ విరుచుకుపడ్డాడు. రెండో రౌండ్లోనూ నిశాంత్ ఆధిపత్యం ప్రదర్శించినా.. జడ్జీలు మాత్రం 3-2 నిర్ణయంతో వెర్డెకు పాయింట్లు ఇచ్చారు. ఇక మూడో రౌండ్లోనూ ఐదుగురు జడ్జీలు పదేసి పాయింట్లను వెర్డెకు ఇచ్చారు. నిశాంత్కు తొమ్మిది చొప్పున ఇవ్వడంతో ఓటమి తప్పలేదు.



## పాక్ వెళ్లని భారత్.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం

# రూ. 544 కోట్లతో ప్లాన్ బీ సెట్ చేసిన ఐసీసీ



ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఎలా సిద్ధమైంది? ఇప్పుడైతే ఈ విషయంపై ఏమీ చెప్పలేకుండా ఉంది. భారత జట్టు పాకిస్థాన్ వెళ్లి ఛాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు నిరాకరిస్తే పీసీబీ ఏం చేస్తుంది? దీనికి సంబంధించి పాక్ సన్నాహాలు సందిగ్ధంగా మారాయి. ఈ విషయంపై ఐసీసీ సన్నద్ధమవుతోంది. ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు టీమ్ ఇండియా పాకిస్థాన్ వెళ్లకపోతే.. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఐసీసీ రూ.544 కోట్ల ప్లాన్ సిద్ధంగా ఉంది.

**ఐసీసీ ప్లాన్ బి విలువ రూ.544 కోట్లు..!**

ప్లాన్ ఏంటని మీరు ఆశ్చర్యపోవచ్చు? కొలంబోలో ఇటీవల ముగిసిన వార్షిక సమావేశంలో ఐసీసీ కీలక ప్రకటన చేసింది.

ఇతర బోర్డు సభ్యుల ముందు పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకి ఇచ్చిన 65 మిలియన్లలో ప్లాన్ సమాచారం ఉంది. 65 మిలియన్ డాలర్లు అంటే రూ.544 కోట్ల కంటే ఎక్కువ అన్నమాట.

కొలంబోలో జరిగిన ఏజీఎం సమావేశంలో ఐసీసీ పాకిస్థాన్కు 65 మిలియన్ డాలర్లు అంటే రూ.544 కోట్లకుపైగా అందజేసినట్టు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణ కోసం ఈ మొత్తాన్ని పాకిస్థాన్కు అందించారు. క్రిక్బజ్ నివేదిక ప్రకారం, ఈవెంట్ కోసం పీసీబీ అందుకున్న మొత్తం, టోర్నమెంట్ కోసం భారతదేశం పాకిస్తాన్కు వెళ్లకపోవడం వల్ల అయ్యే ఖర్చులను కూడా కవర్ చేస్తుంది. అంటే, పీసీబీకి మరింత డబ్బు అందించనుంది. ఇది పాకిస్తాన్ వెలుపల వేరే వేదికలో టీమిండియా మ్యాచ్లను నిర్వహించగలదు.

**వచ్చే ఏడాది పాకిస్థాన్లో ఛాంపియన్స్ ట్రోఫీ**

వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇందుకోసం పాకిస్థాన్లో స్టేడియాల పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి.

ముసాయిదా షెడ్యూల్ ప్రకారం భారత్ మ్యాచ్లు లాహోర్లో జరగాల్సి ఉంది. టోర్నీలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్లతో కలిసి భారత్ గ్రూప్-ఎలో చోటు దక్కించుకున్నాయి. ముసాయిదా షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్తో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది.

దీని తర్వాత ఫిబ్రవరి 23న న్యూజిలాండ్తో తలపడనుంది. కాగా మూడో, చివరి మ్యాచ్ మార్చి 1న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్తో జరగనుంది.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థనను

# తిరస్కరించిన అంబటి రాయుడు

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: షూటర్ ఇషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్, భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్లకు హైదరాబాద్లో ఒక్కొక్కరికి 600 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడానికి తెలంగాణ కేబినెట్ ఇటీవలే అంగీకరించిన విషయం తెలిసిందే. తెలంగాణ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్వాగతించారు. అంతేకాదు మాజీ క్రికెటర్లు ప్రజ్ఞాన్ ఓఝా, అంబటి రాయుడు.. బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాలకు కూడా హైదరాబాద్లో ఇంటి స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అయితే తెలంగాణ ప్రభుత్వంకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అభ్యర్థనపై టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు స్పందించారు. ఎమ్మెల్యే చేసిన అభ్యర్థనపై హర్షం వ్యక్తం చేసిన రాయుడు.. తనకు ఎలాంటి ఇంటి స్థలం అక్కర్లేదన్నారు. కౌశిక్ రెడ్డి గారూ.. క్రీడాకారులను ప్రోత్సహించడం చాలా ముఖ్యం. భారత క్రికెట్కు మొహమ్మద్ సిరాజ్ చేసిన కృషికి గుర్తింపు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను ఎప్పుడూ ప్రభుత్వంను ఏమీ అడగలేదు, ఆశించలేదు. అన్ని క్రీడలు మరియు క్రీడాకారులకు సమానంగా మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం. నైపుణ్యాలను మెరుగుపరచడానికి, అభివృద్ధి చేయడానికి మద్దతు చాలా అవసరం అని రాయడు పేర్కొన్నారు. క్రికెటర్లుగా మేం ఆర్థికంగా బాగా నిలదొక్కుకోగలం. ఈ విషయంలో మేము అదృష్టవంతులం. నాకు భూమిని కేటాయించమని ప్రభుత్వానికి మీరు చేసిన అభ్యర్థనను నేను గౌరవపూర్వకంగా తిరస్కరిస్తున్నాను. నిజంగా ఆ అవసరం ఉన్న క్రీడాకారులను ఆదుకోవాలని కోరుతున్నా అని అంబటి రాయుడు ట్వీట్ చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడిన వీడియోను ట్యాగ్ చేశారు. రాయుడు చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## పారిస్ ఒలింపిక్స్.. సెమీస్‌కు దూసుకెళ్లిన

# భారత హాకీ జట్టు



పారిస్ ఒలింపిక్స్లో హాకీలో భారత పురుషుల జట్టు సెమీస్కు దూసుకెళ్లింది. ఒలింపిక్స్లో భారత హాకీ జట్టు దూకుడు కొనసాగుతోంది. ఆదివారం క్వార్టర్ఫైనల్లో ప్రపంచ నంబర్-2 బ్రిటన్ను ఓడించి సెమీస్కు చేరింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 1 (4)- 1 (2) తేడాతో విజయం సాధించింది. తొలుత మ్యాచ్ 1-1తో టై అయింది. షూటౌట్లో భారత్ 4-2తో గెలుపొందింది. తొలి క్వార్టర్లో ఇరుజట్లు గోల్ చేయలేదు. రెండో క్వార్టర్ ఆరంభమైన కాసేపటికే భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్ మ్యాచ్కు దూరమయ్యాడు. హాకీ స్టిక్తో బ్రిటన్ ఆటగాడి తలపై ఉద్దేశపూర్వకంగా కొట్టాడని భావించిన రిఫరీలు రోహిదాస్ను రెడ్కార్డ్ ద్వారా బయటికి పంపారు. దీంతో తర్వాత భారత్ 10 మందితోనే ఆడింది. 22వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించి భారత్ను ఆధిక్యంలో నిలిపాడు. 27వ నిమిషంలో మోర్టన్ లీ గోల్ చేయడంతో స్కోర్ సమం అయింది. తర్వాతి రెండు క్వార్టర్స్లో ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ షూటౌట్కు దారితీసింది.

## ముక్కుసూటితనంతో గంభీర్

## పూర్తి పదవీకాలంలో ఉండటం కష్టమే



ఇప్పుడే ప్రధాన కోచ్గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్పై భారత మాజీ క్రికెటర్ జోగిందర్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశాడు. శ్రీలంక పర్యటనతో భారత ప్రధాన కోచ్గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాడు. ఇప్పటికే టీ20 సిరీస్ను టీమ్ఇండియా సొంతం చేసుకుంది. జట్టులోని ప్రతి ఒక్కరితో సంభాషిస్తూ ప్రోత్సహిస్తున్న గంభీర్పై భారత మాజీ క్రికెటర్ జోగిందర్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముక్కుసూటిగా మాట్లాడే గంభీర్ ఎక్కువ కాలం ప్రధాన కోచ్గా ఉండలేడని వ్యాఖ్యానించాడు.

భారత జట్టును నడిపిస్తున్న గౌతమ్ గంభీర్.. ప్రధాన కోచ్ పదవిలో ఎక్కువ కాలం ఉండే అవకాశం తక్కువే. ఇలా చెప్పడానికి అతడిపై వ్యక్తిగతంగా ఈర్ష్య లేదు. గంభీర్ సొంతంగా నిర్ణయాలు తీసుకొనే వ్యక్తి. ఒక్కోసారి జట్టులోని ఆటగాళ్లతో ఏకీభవించకపోవచ్చు. ఇదేదో విరాట్ కోహ్లి గురించి చెప్పడం లేదు. ఇతరులు కూడా గంభీర్ నిర్ణయాలను ఇష్టపడకపోవచ్చు. గంభీర్ ఏదైనా సరే నిర్మొహమాటంగా మాట్లాడేస్తాడు. అవతలి వ్యక్తిని పొగడ్తలతో బుట్టలో వేసేద్దామనే స్వభావి కాదు. ఏ పనినైనా నిబద్ధతతో చేస్తాడు. నిజాయతీ కలిగిన వ్యక్తి. అందుకే అతడి పూర్తికాలం ఆ పదవిలో ఉండకపోవచ్చు అని జోగిందర్ తెలిపాడు.

### ఇమానె ఖెలిఫ్ తండ్రి వివరణ..

## ఇకనైనా వివాదానికి ముగింపు పలికేనా?



పారిస్ ఒలింపిక్స్లో అత్యంత వివాదాస్పదంగా మారిన వారిలో అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ ఒకరు. పురుష లక్షణాలున్న అల్జీరియా బాక్సర్ ఖెలిఫ్ను మహిళల విభాగంలో ఎలా ఆడనిస్తారంటూ విమర్శలు వచ్చాయి. దీంతో ఆమె అతడా? అనే అనుమానాలు తలెత్తాయి. ఇదే కారణంతో గతేడాది ఖెలిఫ్పై అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ అనర్హత వేటు వేసింది. కానీ, ఒలింపిక్ కమిటీ నిబంధనలు మరోలా ఉండటంతో ఆమె ఎంట్రీ లభించింది. సెమీస్కు చేరుకొని మెడల్ను ఖరారు చేసుకుంది. ఈ క్రమంలో ఖెలిఫ్ తండ్రి పెట్టిన వీడియో వైరల్గా మారింది.

నా బిడ్డ అమ్మాయే. ఆడపిల్లగానే పెరిగింది. దృఢమైన అమ్మాయి. ధైర్యంగా ఉండటం, కష్టపడటం నేర్పా. అందుకోసం చాలా శ్రమించింది. ఇటలీ బాక్సర్ కంటే నా కుమార్తె చాలా బలంగా ఉంది. అందుకే బౌట్ను సులువుగా గెలుచుకోగలిగింది అని ఇమానె తండ్రి ఒమర్ ఖెలిఫ్ వెల్లడించారు. ఇమానె 1999 మే 2న జన్మించినట్లు సంబంధిత డాక్యుమెంట్లను వీడియోలో ప్రదర్శించారు. దాని ప్రకారం ఇమానెను మహిళగానే గుర్తించి.. బెదిరింపులు, వేధింపులను ఆపేయాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్లు వచ్చాయి.

### భారత్ పతక ఆశలు ఆవిరి.. క్వార్టర్స్‌లో ఓడిన లవ్లీనా



పారిస్ ఒలింపిక్స్లో భారత్ మరో పతకాన్ని అందుకునే అవకాశాన్ని కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్లో భారత్ మరో పతకాన్ని అందుకునే అవకాశాన్ని కోల్పోయింది. మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ క్వార్టర్ ఫైనల్లో 1-4 క్వియాన్ (చైనా) చేతిలో ఓటమిపాలై సెమీస్ చేరే అవకాశాన్ని చేజార్చుకుంది. ఈ మ్యాచ్లో లవ్లీనా నెగ్గితే భారత్కు మరో పతకం ఖాయమయ్యేది. టోక్యో ఒలింపిక్స్లో లవ్లీనా 69 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది.

# పూరితో ప్రభాస్





డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన డబుల్ ఇస్మార్ట్ మూవీ ఆగష్టు 15న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. భారీ బడ్జెట్‌తో పూరి కనెక్ట్స్ బ్యానర్ పై ఛార్మి కౌర్, పూరి జగన్నాథ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా సాంగ్స్ తో ఒక్కసారిగా మూవీపై ఎక్స్ పెక్టేషన్స్ పెరిగిపోయాయి. ఓవరాల్ గా సినిమాపై 100ం కోట్లకి పైగా బిజినెస్ జరిగిందనే టాక్ వినిపిస్తోంది.డిజిటల్, శాటిలైట్ రైట్స్ ద్వారానే డబుల్ ఇస్మార్ట్ మూవీకి 76 కోట్లు వచ్చాయని టాక్ వినిపిస్తోంది. అలాగే థీయాట్రికల్ రైట్స్ ని అన్ని భాషలకి కలిపి ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ నిరంజన్ రెడ్డి కొనుగోలు చేశారు. దీంతో రామ్ పోతినేని కెరియర్‌లో హైయెస్ట్ బిజినెస్ జరిగిన చిత్రంగా డబుల్ ఇస్మార్ట్ మూవీ నిలిచింది. పూరి, రామ్ కలయికలో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ డబుల్ ఇస్మార్ట్ మూవీ తెరకెక్కింది. ఇదలా ఉంటే ఈ సినిమా ట్రైలర్‌ని ఆగష్టు 4న వైజాగ్ లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారంట. ట్రైలర్ లాంచింగ్‌ని వైజాగ్‌లో గ్రాండ్‌గా నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. తరువాత ప్రీరిలీజ్ ఈవెంట్ ని గట్టిగానే ప్లాన్ చేస్తున్నారంట. ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ కి స్పెషల్ గెస్ట్ గా డార్లింగ్ ప్రభాస్ ని ఇన్వైట్ చేయాలని పూరి జగన్నాథ్ భావిస్తున్నారంట. ప్రభాస్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో బుజ్జిగాడు, ఏక్ నిరంజన్ సినిమాలు చేశాడు. ఈ సినిమాలు కమర్షియల్ హీరోగా ప్రభాస్ ఇమేజ్ ని పెంచాయి. బుజ్జిగాడు సినిమాతోనే ప్రభాస్ కి డార్లింగ్ అనే ఇమేజ్ వచ్చింది. అలాగే డబుల్ ఇస్మార్ట్ ప్రొడ్యూసర్ ఛార్మికి కూడా ప్రభాస్ తో మంచి బాండింగ్ ఉంది. ప్రభాస్ చక్రం, పౌర్ణమి సినిమాలలో ఛార్మి హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికి పూరి జగన్నాథ్, ఛార్మితో ప్రభాస్‌కి మంచి రిలేషన్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే డార్లింగ్ ని డబుల్ ఇస్మార్ట్ కి చీఫ్ గెస్ట్ గా పిలవాలని అనుకుంటున్నారంట. పూరి జగన్నాథ్‌తో ఉన్న బాండింగ్ కారణంగా డబుల్ ఇస్మార్ట్ చిత్రాన్ని ఎంకరేజ్ చేయడానికి డార్లింగ్ ప్రభాస్ ముందుకొచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే రామ్ పోతినేని డబుల్ ఇస్మార్ట్ చిత్రంపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ఈ సినిమాతో 100 కోట్ల కలెక్షన్ క్లబ్ లో చేరుతానని భావిస్తున్నాడు. కావ్య థాపర్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.

# సక్సెస్ ట్రాక్ ఎక్కుతారా?





మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం "మిస్టర్ బచ్చన్". హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా పరిచయమవుతోంది. సిద్ధూ జొన్నలగడ్డ క్యామియో రోల్ లో కనిపించనున్నాడు. ఇండిపెండెన్స్ డే స్పెషల్ గా ఆగస్ట్ 15న ఈ సినిమా గ్రాండ్ గా థియేటర్లలో రిలీజ్ కాబోతోంది. కాకపోతే అదే రోజున 'డబుల్ ఇస్మార్ట్' రూపంలో గట్టి పోటీ ఎదురుకానుంది. ఉస్తాద్ రామ్ పోతినేని, డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. ఇస్మార్ట్ శంకర్ స్వీక్వెల్ గా రాబోతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 15వ తారీఖున విడుదల చేస్తామని చాలా రోజుల క్రితమే నిర్మాతలు ప్రకటించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు 'మిస్టర్ బచ్చన్' మూవీని కూడా అదే డేట్ కు తీసుకొస్తున్నట్లు ప్రకటించడంతో రెండు క్రేజీ చిత్రాల మధ్య క్లాష్ అనివార్యమైంది. అయితే కచ్చితంగా సక్సెస్ సాధించాల్సిన పరిస్థితుల్లో, ఇలా క్లాష్ లో వస్తుండటంపై సోషల్ మీడియాలో అనేక చర్చలు జరుగుతున్నాయి. రిజల్ట్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలుగా చేసుకుంటూ వస్తున్న రవితేజ.. గత ఏడాది కాలంలో హ్యాట్రిక్ ఫ్లాప్స్ అందుకున్నారు. 'రావణాసుర', 'టైగర్ నాగేశ్వరరావు', 'ఈగల్' వంటి మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయాయి. దీంతో ఇప్పుడు 'మిస్టర్ బచ్చన్' మూవీతో తప్పకుండా బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టి మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కాలని భావిస్తున్నారు. మరోవైప హరీష్ శంకర్ నుంచి సినిమా వచ్చి దాదాపు ఐదేళ్లు దాటిపోయింది. మధ్యలో కరోనా పాండమిక్ రావడం, చాలా కాలంగా వర్క్ చేస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీ లేట్ అవ్వడం వల్ల దర్శకుడి కెరీర్ లో ఈ గ్యాప్ వచ్చిందని అనుకోవాలి. కారణాలు ఏవైనా హరీశ్ ఇప్పుడు మంచి విజయం సాధించి తాను ఎలాంటి కమర్షియల్ డైరెక్టర్ అనేది చూపించాల్సిన అవసరముంది. అలా జరిగితే ఏపీ డిప్యూటీ సీఎంతో చేసే సినిమాపై అంచనాలు రెట్టింపు అవుతాయి. సో 'మిస్టర్ బచ్చన్' సినిమా రవితేజ, హరీష్ శంకర్ ఇద్దరికీ కీలకమనే చెప్పాలి. ఇది 'రైడ్' అనే హిందీ మూవీకి రీమేక్ గా రూపొందింది. పేరుకి రీమేక్ అయినప్పటికీ తన మార్క్ మార్పులు చేర్పులు ఎన్నో చేశారు డైరెక్టర్ హరీష్. 'దబ్బంగ్'ని 'గబ్బర్ సింగ్'గా, 'జిగర్తాండ'ను 'గద్దలకొండ గణేష్'గా మార్చినట్లుగానే.. ఈ చిత్రానికి కూడా చాలా కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించారు. రవితేజ నుంచి ఫ్యాన్స్ ఎలాంటి ఎంటర్టైనర్ ను ఎక్స్ పెక్ట్ చేస్తారో, అలాంటి చిత్రాన్నే తీసినట్లు ప్రమోషనల్ కంటెంట్ తోనే హామీ ఇచ్చారు. రైడ్ అనేది వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఒక ఒక ఇంటెన్స్ డ్రామా. ఇందులో అజయ్ దేవగన్, ఇలియానా భార్యా భర్తలుగా నటించారు. మిస్టర్ బచ్చన్ చిత్రాన్ని హరీష్ శంకర్ పూర్తిగా తన స్టైల్ లోకి మార్చేశారు. హీరో హీరోయిన్ల మధ్య లవ్, రొమాన్స్, డ్యూయెట్ సాంగ్స్, ఎలివేషన్ ఫైట్స్.. ఇలా అన్ని అంశాలను కలబోసి కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రెడీ చేశారు. ఇప్పటికైతే ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'డబుల్ ఇస్మార్ట్' తో పోటీ బలంగా ఉన్నప్పటికీ విజయం పట్ల దర్శక హీరోలు నమ్మకంగా ఉన్నారు. మిస్టర్ బచ్చన్ సినిమా హిట్టయితే అందరూ హరీశ్ శంకర్, రవితేజల ప్రయత్నాన్ని అభినంది స్తారు. కానీ రిజల్ట్ తేడా కొడితే మాత్రం, ఇద్దరూ విపరీతమైన ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుంది. మంచి చిత్రాన్ని రీమేక్ చేసి చెడగొట్టారనే కామెంట్లు వస్తాయి. ఓటీటీలు రాజ్యమేలుతున్న రోజుల్లో అసలు రీమేక్ సినిమాలు ట్రై చేయడమే తప్పని అందరూ విశ్లేషిస్తారు. మరి ఇండిపెండెన్స్ వీక్ లో బాక్సాఫీసు దగ్గర ఏం జరుగుతుందో చూడాలి.

# నెవ్వర్ బిఫోర్ లుక్

స్టన్నింగ్ లుక్స్‌తో కిల్ చేయడంలో తెలుగమ్మాయి శ్రీలీల తర్వాతే. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్ కతా నుంచి వచ్చిన టాప్ మోడల్స్ కి సైతం శ్రీలీల బిగ్ కాంపిటీషన్. నటిగా తన కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ఈ బ్యూటీ తనదైన నటన, డ్యాన్సులతో అద్భుత ఫాలోయింగ్ సంపాదించుకుంది. టాలీవుడ్ లో తక్కువ టైమ్ లో టాప్ హీరోయిన్ గా ఎదిగిన ప్రతిభావనిగాను శ్రీలీలకు గుర్తింపు ఉంది.సోషల్ మీడియాల్లో ఈ భామకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు.



తాజాగా శ్రీలీల హాట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. శ్రీలీల తెల్లటి పవర్ సూట్‌లో సంథింగ్ యూనిక్ గా కనిపిస్తోంది. ఆ కళ్లలో స్పార్క్.. మేని విరుపుల్లో కాన్ఫిడెన్స్ చూస్తుంటే నిజంగా శ్రీలీల స్టన్నర్ అని పొగిడేయాల్సిందే. ఈ భామ షైనీ అల్ట్రా గ్లామ్ బ్లేజర్‌లో ఎంతో అందంగా మెరిసిపోతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తదుపరి యూత్ స్టార్ నితిన్ సరసన రాబిన్ హుడ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా తర్వాత పలు చిత్రాలకు సంతకాలు చేసేందుకు సిద్ధమవుతోందని సమాచా రం. అయితే ఇటీవల బాలీవుడ్‌లో ఓ క్రేజీ ఆఫర్‌ని ఈ భామ మిస్ చేసుకుందని కథనాలొచ్చాయి. దిగ్గజ దర్శకుడు డేవిడ్ దావన్‌తో శ్రీలీల ఓ సినిమాకి పని చేయాల్సి ఉంది. ఇందులో వరుణ్ ధావన్ హీరో. కానీ ఈ సినిమా ఆఫర్ కోల్పోయిం దని సమాచారం. వెరీ డేంజర్ అనేస్తున్నాడే! మేకర్స్ శ్రీలీ లకు మొదట ఈ చిత్రాన్ని ఆఫర్ చేశారు. కానీ తనకు డేట్స్ లేకపోవడంతో సినిమా నుండి తప్పుకుంది. శ్రీలీల లాస్ మృణాల్ ఠాకూ ర్‌కు గెయిన్ అయిందని కూడా కథనాలొ స్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఇది రొమాంటిక్ కామెడీ జానర్‌లో మరో లెవల్ సినిమా అని ప్రచారం జరుగుతోంది.

# తమిళ నిర్మాతల మండలి సంచలన నిర్ణయాలు

ఆగస్టు 15కి ఇంకా 13 రోజులే సమయం ఉంది. దీంతో ఇప్పుడక్కడ ఓ సన్నివేశం ఆసక్తికరంగా మారింది. ఆగస్టు 15 తర్వాత పరిస్థితి ఎలా ఉండబోతుంది? అన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇంతకీ ఏంటా పరిస్థితి? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. ఇటీవలే తమిళ నిర్మాతల మండలి కొన్ని సంచలన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అన్నింటిని పక్కనబెడితే ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవి తమిళనాడులో మొదలవ్వకూడదని నిర్మాతల మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. హీరో ధనుష్ ని హైలైట్ చేస్తూ ఈ రూల్ తెచ్చినట్లు ఇప్పటికే మీడియాలో ప్రచారం సాగుతోంది. ముందుగా అడ్వాన్సులు తీసుకున్న సినిమాలకు డేట్లు కేటాయించకుండా తర్వాత తీసుకున్న వాటికి కేటాయించడం ఏంటి? అని ధనుష్ నిలదీసే ప్రయత్నం చేసింది. నిర్మాతల సంఘంలో నిర్మాతలు కొంత మంది ధనుష్‌పై ఫిర్యాదు చేయడంతో మండలి ఈ విధంగా స్పందించింది. ధనుష్ ని నియంత్రించే ప్రక్రియలో భాగంగా ఈనిర్ణయం తీసుకున్నట్లు హైలైట్ అయింది. అయితే అతడిని సంప్రదించకుండా మండలి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని నడిగర్ సంఘం తప్పు బట్టింది. అతడతో మాట్లాడకుండా ఇలాంటి నిర్ణయాలు ఎలా తీసుకుంటారని ధనుష్ ని నడిగర్ అధ్యక్షుడు నాజర్ మద్దతు ప్రకటించారు. దీంతో పాటు సౌత్ నటీనటుల సంఘం కూడా మద్దతుగా నిలిచింది. దీంతో కోలీవుడ్ నడిగర్ వర్సెస్ నిర్మాతల మండలి అన్నట్లు సన్నివేశం మారింది. ధనుష్ కంటే ముందు విశాల్ విషయంలో దాదాపు ఇదే సన్నివేశం రిపీట్ అయింది. దీంతో ఆగస్టు 15 తర్వాత నిర్మాతల మండలి పిలుపు మేరకు కొత్త సినిమాల ప్రారంభోత్సవం ఆపేస్తారా? లేక కొన సాగిస్తారా? అన్నది చూడాలి. ప్రారంభోత్సవాలు జరగాలంటే హీరోలు సహా నటీనటులంతా తీసుకున్న అడ్వాన్సులు తిరిగి ఇచ్చేయాలి. అప్పుడే అది సాధ్యమవుతుంది. మండలి నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్లే అవకాశాలు తక్కువగానే ఉంటాయి. అలాగే నిర్మాతల మండలి–నడిగర్ మధ్య చర్చలు జరిగి ఈ సమస్య ఓ కొలిక్కి వస్తే ప్రారంభోత్సవాలకు, షూటింగ్లకు ఇబ్బంది ఉండదు. మండలి నిర్ణయం ప్రకారం ఆక్టోబర్ లోపు సెట్స్ లో ఉన్న షూటింగ్ లు పూర్తవ్వాలి. అలాగే నవంబర్ నుంచి ఎలాంటి షూటింగ్ లు కూడా జరగడానికి వీలు లేదు అనే కండీషన్ కూడా ఉంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో నడిగర్–నిర్మాతల మండలి మధ్య అత్యవసర భేటి అవసరమని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి..

# స్టార్ కిడ్స్ కలిస్తే







ఇండస్ట్రీ అంటే వాళ్లలో వాళ్లే. కొత్త వాళ్లకి అక్కడ ఛాన్సులిచ్చేదెవరు? అన్న అపవాదను దేశంలో అన్నిసిని పరిశ్రమలు మోస్తున్నవే. నెపోటిజం అన్నది పీక్స్ లో ఉందని అవకాశాలు రానివాళ్లంతో ఎన్నో సార్లు ఆరోపించారు. చివరికి బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్పుత్ మరణానికి ఈ నెపోటిజం కూడా ఓ కారణాల్లో ఒకటిగా హైలైట్ అయింది. ఈ నేపథ్యంలో తాజాగా నెపోటిజాన్నిమరింత హైలైట్ చేస్తూ నెట్టింట ట్రోలింగ్ జరగడం చర్చకొస్తుంది. ఇంతకీ ఈ చర్చంతా దేనికి అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా ఇప్పటికే ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఓ మూడు సినిమాలు చేసాడు. కానీ ధృవ్ కి ఇంకా సరైన గుర్తింపు రాలేదు. డాడ్ గ్రేట్ యాక్టర్ అయినా! ఆయన వారసత్వాన్ని తీసుకుని నటుడిగా ఎంట్రీ ఇచ్చిన ధృవ్ కి మాత్రం ఇంకా సరైన సక్సెస్ పడలేదు. అలాగే స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె అతిది శంకర్ కూడా %–%వీరుమాన్%–% తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి సినిమా సక్సస్ తో అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. అటుపై మరో రెండు సినిమాల్లోనూ నటించింది. అయితే ఇవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఇక తలపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతన్నాడు. మరోవైపు మ్యూజిక్ లెజెండ్ రెహమాన్ మేనల్లుడు కూడా సంగీత దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇప్పుడు వీళ్లంతా కలిసి ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. దీంతో నెట్టింట నలుగురిపై ట్రోలింగ్ పీక్స్ కి చేరింది. వాళ్లలో వాళ్లే కలిసి అంతా ఓ కూటమిగా ఏర్పడి సినిమా చేసుకుంటున్నారు. కొత్త వారు ..బయట వారు లేకుండా అంటూ నెపోటిజాన్ని తెరపైకి తెస్తున్నారు. ఈ చిత్రానికి %–%తప్పక అప్పా%–% అనే టైటిల్ పెట్టాలం టూ ఓ యూజర్ దర్శకుడికి సలహాలు ఇచ్చాడు. ఎవరి స్టైల్లో వారు కామెంట్లు..ఎమోజీలు.. విమర్శలు గుప్పిస్తున్నారు. సినిమా ప్రారంభానికి ముందే ఇలా ఉందంటే? ప్రారంభమైన తర్వాత రచ్చ ఇంకే రేంజ్లో ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు.



# రష్మికతో రొమాన్స్

రష్మిక మందన్నను తలవగానే గుర్తుకొచ్చే కొన్ని సంగతులున్నాయి. అందచందాలు.. నటప్రతిభ.. లక్ ఫ్యాక్టర్ వీటన్నిటి కలయికతో దూసుకొచ్చిన మేటి కథానాయిక. ఇన్నాళ్లు టాలీవుడ్ ని ఏలిన ఈ భామ ఇప్పుడు బాలీవుడ్ ని ఏలుతోంది. అక్కడ వరుస సినిమాలకు కమిటవుతూ ఆశ్చర్యపరుస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా, రణబీర్ లాంటి క్రేజీ స్టార్ల సరసన నటించేసిన ఈ బ్యూటీ ఇప్పుడు సల్మాన్ ఖాన్, విక్కీ కౌశల్ లాంటి స్టార్ల సరసనా ఆడిపాడుతోంది. అదంతా అటుంచితే, రష్మిక వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో గుబులు రేపుతున్నాయి. తాజాగా డిజైనర్లు ఫల్గుణి – షేన్ పీకాక్ సాంప్రదాయ దుస్తుల్లో రష్మిక మందన్న కనిపించింది. రష్మిక, విక్కీ కౌశల్ సహా ఫోటోలో ఉన్న టీమ్ భారతీయ సాంప్రదాయ విధానంలో నేసిన దుస్తులను ధరించడం గర్వించదగినది. రష్మిక క్రిస్టల్స్ తో రూపొందించిన స్పెషల్ హాఫ్ షోల్డర్ లెహంగా ధరించి ఎంతో అందంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విక్కీతో రష్మిక కెమిస్ట్రీ అద్భుతంగా వర్కవుటైందని ఈ ఫోటోషూట్ చెబుతోంది. కత్రినతో కూడా విక్కీ కెమిస్ట్రీ ఇంతగా వర్కవుట్ కాలేదంటూ ఇపుడు యువతరం సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికి ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. విక్కీ షేర్ చేసిన ఫోటోషూట్ గురించి సాంప్రదాయం గురించి అద్భుతమైన కామెంట్లు వినిపిస్తున్నాయి. భారతదేశంలోని గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ, సెలబ్రేట్ చేసుకునే ఒక చిరస్మరణీయమైన ప్రక్రియ ఇది. తన క్యాప్షన్‌లో విక్కీ డిజైనర్లు ఫల్గుణి– షేన్ పీకాక్‌లతో పాటు స్వదేశ్ ఆన్‌లైన్ –ఎఫ్‌డిసిఐ(ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) లు సంయుక్త ప్రదర్శనకు కృతజ్ఞతలు తెలిపాడు. మన సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించడం, సెలబ్రేట్ చేయడం కోసం గడిపిన సాయంత్రం ఇది. ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనలో మమ్మల్ని భాగం చేసినందుకు పీకాక్ ఇండియా వారికి విక్కీ ధన్యవాదాలు తెలిపారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044